సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 259

శనివారం 3-6-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'అన్నం పెట్టే రైతన్నను
రుణ విముక్తుణ్ని చేయడమే
నా ముందున్న లక్ష్యం'

పేదరికాన్ని ఓల్డ్‌సిటీ చూపించింది.
దాతృత్వాన్ని నాన్న వైద్యం నేర్పించింది.
ఆరోగ్య భద్రతా లేమిని ఆదివాసీ జీవనం తెలిపింది.
అందంగా జీవించడాన్ని బాల్య స్నేహం చెప్పింది.
కొండంత సాహసాన్ని తనకు తానే చేసింది.
డాక్టర్ శోభాదేవి రాసుకున్న రికార్డుల జాబితా ఇది.


అవార్డులతో...


ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ దగ్గర శోభాదేవి

ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ @ 68

''నేను జర్నలిస్ట్‌ని కావాలనుకున్నాను. మా నాన్న నన్ను డాక్టర్‌ని చేయాలనుకున్నారు. ఆయన మాటే నెగ్గింది. కానీ నా అచీవ్‌మెంట్స్‌తో తరచూ జర్నల్స్‌లో కనిపిస్తూ ఉండటం ద్వారా నేను సంతోషిస్తున్నాను'' అన్నారు డాక్టర్ శోభాదేవి. హైదరాబాద్, హిమాయత్ నగర్‌లో పుట్టి పెరిగి, వెస్ట్ మారేడ్‌పల్లిలో స్థిరపడిన శోభాదేవి ఒక గ్లోబల్ పర్సనాలిటీ. డయాబెటిస్ అండ్ ఒబేసిటీ స్పెషలిస్ట్‌గా ఆమె పదికి పైగా దేశాల్లో సెమినార్‌లలో పాల్గొని అధ్యయనాల పేపర్‌లు సమర్పించారు. కోవిడ్ సమయంలో రోజుకు పద్దెనిమిది గంటల సేపు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటూ సేవలందించిన ఈ డాక్టర్ తన పేషెంట్లను హాస్పిటల్ గడప తొక్కనివ్వకుండా ఆరోగ్యవంతులను చేశారు. అందుకు ప్రతిగా ఆమె డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డుకు ముందు ఆ తర్వాత దేశవిదేశాల్లో ఆమె అందుకున్న పురస్కారాల సంఖ్య వందకు పైగానే. వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆమె ఇంట్లో రెండు గదులు మెమెంటోలతో నిండిపోయి ఉన్నాయి. ఈ ఏడాది మే నెలలో ఎవరెస్ట్ బేస్ క్యాంపు 8కి చేరుకుని మరో రికార్డు సృష్టించుకున్నారు. అది బేస్ క్యాంపుకు చేరిన రికార్డు మాత్రమే కాదు. 68వ ఏట ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించడం, మిసెస్ ఇండియా విజేత, అందాల పోటీ కిరీటధారి ఎవరెస్ట్‌ను అధిరోహించడం కూడా రికార్డులే. ప్రతి రోజునూ స్ఫూర్తిదాయకంగా మలుచుకోవడం ఒక కళ. ఆ కళ ఆమె చేతిలో ఉంది. ఇలాంటి సాహసాలు, సరదాలతోపాటు నల్లమల, భద్రాచలం, ఆసిఫాబాద్ జిల్లాల్లో నివసించే ఆదివాసీలకు ఆరోగ్య చైతన్యం కలిగించడం ఆమెలో మరో కోణం. 'ఒక డాక్టర్‌గా తన వంతు సామాజిక బాధ్యతను నిర్వర్తించడానికి ఎప్పుడూ ముందుంను. అది తండ్రి నేర్పిన విలువల నుంచి గ్రహించిన జీవితసారం' అన్నారామె. వైవిధ్యభరితమైన తన జీవితప్రస్థానాన్ని సాక్షితో పంచుకున్నారు డాక్టర్ శోభాదేవి.

నాన్న నేర్పిన విలువలు

''మా నాన్న అగ్రికల్చరల్ డిపార్ట్‌మెంట్‌లో జాయింట్ డైరెక్టర్‌గా పని చేశారు. అమ్మ రోజరీ కాన్వెంట్ స్కూల్లో టీచర్. అలా నేను అదే స్కూల్‌లో చదివాను. నాన్న ఆసక్తి కొద్దీ హోమియోవైద్యం కోర్సు చేసి ఉచితంగా వైద్యం చేసేవారు. నన్ను మెడిసిన్ చదివించడం కూడా నాన్న ఇష్టమే. ఎంబీబీఎస్ ఎంట్రన్స్‌లో నాకు బాలికల కేటగిరీలో రెండవ ర్యాంకు, జనరల్ కేటగిరీలో ఎనిమిదవ ర్యాంకు వచ్చింది. ఉస్మానియాలో ఎంబీబీఎస్ తర్వాత అన్నామలై యూనివర్సిటీ నుంచి డయాబెటిస్‌లో పీజీ, యూకేలో ఒబేసిటీలో కోర్సు చేసి అక్కడ దాదాపు ఇరవై ఏళ్లు పని చేశాను. నాన్న కోసం తిరిగి ఇండియా వచ్చేసి హైదరాబాద్‌లో గవర్నమెంట్ ఉద్యోగంలో చేరాను. ఓల్డ్‌సిటీలో అడిగి మరీ పోస్టింగ్ వేయించుకున్నాను. పేదరికం ఎంత దారుణంగా ఉంటుందో కళ్లారా చూశాను. పేషెంట్‌లకు చాయ్, బన్నుకు డబ్బిచ్చి తినేసి రండి మందులు రాసిస్తా నని పంపేదాన్ని.

'భగవంతుడు మనల్ని చాలామంది కంటే మెరుగైన స్థానంలో ఉంచాడు. భగవంతుడిచ్చింది అంతా మన కోసమే కాదు, ఆకలితో ఉన్న వాళ్ల కోసం పని చేయాల్సిన బాధ్యతను కూడా ఇచ్చి ఈ భూమ్మీదకు పంపాడు. సమాజానికి తిరిగి మన వంతు బాధ్యతను నిర్వర్తించాలి' అని నాన్న ఎప్పుడూ చెప్పే మాట తరచూ గుర్తు వచ్చేది. ఆ ప్రభావంతోనే అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు వెళ్లి వాళ్లకు సహాయం చేయడం చిన్నప్పుడే అలవాటైంది.

ఆదివాసీల జీవనశైలి గురించి నాకు తెలిసింది బాగా పెద్దయిన తర్వాత మాత్రమే. అడవిలో నివసిస్తూ అక్కడ దొరికే ఆహారం తింటూ కడుపు నింపుకోవడమే వాళ్లకు తెలిసింది. సమతుల ఆహారం అంటే ఏమిటో తెలియదు. సీజన్‌లో వచ్చే జ్వరాల గురించి అవగాహన కూడా తక్కువే. వాళ్లకు ఆహారం గురించి ఆరోగ్యం చైతన్యవంతం చేయడంతోపాటు ఎసెన్షియల్ ఫుడ్ పౌడర్‌లు, వంటపాత్రలు, దుప్పట్లు ఇవ్వడం మొదలు పెట్టాం. అన్ని రకాల కాయగూరలను పండించుకోవడంలో శిక్షణ ఇచ్చాం. మనిషి జీవితంలో ఆహారం, ఆరోగ్యం ప్రధాన భూమిక పోషిస్తాయనే అవగాహన కల్పించగలిగాను.

పర్వతం పెద్ద చాలెంజ్

ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ ఆరోహణ ఆలోచన మెడిసిన్ క్లాస్‌మేట్స్‌తో న్యూజిలాండ్ టూర్‌లో వచ్చింది. అక్కడ గ్లేసియర్‌లు, ట్రెకింగ్ జోన్‌లు చూసినప్పుడు ఇదేపని మన దగ్గర ఎందుకు చేయకూడదు అనుకున్నాం. కానీ మన దగ్గర పర్వతారోహణ శిక్షణ కేంద్రాలుండవు. జిమ్, కేబీఆర్ పార్క్, సిటీలో క్రాస్ ఓవర్ బ్రిడ్జిలు, కర్నాటకలో నందిహిల్స్ నా శిక్షణ కేంద్రాలయ్యాయి. ఎవరెస్ట్ కోసం సిద్ధమవుతున్న సమయంలో ప్రపంచాన్ని కోవిడ్ కుదిపేసింది. డాక్టర్‌గా నా వృత్తికి నూటికి నూరుశాతం సేవలందించాల్సిన సమయం అది. నా పేషెంట్‌ల నంబర్ రాసుకోలేదు కానీ పేషెంట్‌లకు మందులు, ఇతర జాగ్రత్తలు, ధైర్యం చెబుతూ కౌన్సెలింగ్‌లో రోజూ తెల్లవారు జామున రెండు– మూడు గంటల వరకు ఆన్‌లైన్‌లో టచ్‌లో ఉండేదాన్ని. ఆ తర్వాత నాకూ కోవిడ్ వచ్చింది, తగ్గింది. కానీ వెన్ను పట్టేయడం, ఫ్రోజెన్ షోల్డర్ వంటి పోస్ట్ కోవిడ్ లక్షణాలు బాధించాయి. వాటన్నింటినీ చాలెంజ్‌గా తీసుకుని బయటపడి పర్వతారోహణ చేశాను. మేనెల ఆరవ తేదీ హైదరాబాద్ నుంచి బయలేరి ఖాట్మండూకు వెళ్లాను. ఎనిమిదో తేదీన 'లుక్లా' నుంచి నడక మొదలు పెట్టి 15వ తేదీకి బేస్ క్యాంపులో ఎత్తైన శిఖరం 'కెకెకి చేరాను. ఈ ట్రిప్‌లో నేను పర్వతారోహకులకు మార్గాన్ని సుగమం చేసే షెర్పాల దయనీయమైన జీవితాన్ని దగ్గరగా చూశాను. ప్రాణాలను పణంగా పెట్టి ఈ పనులు చేస్తుంటారు వాళ్లు.


షెర్పాలతో శోభాదేవి

బాల్య స్నేహితురాలి చొరవ

బ్యూటీ పాజంట్ అవతారం ఎత్తడానికి కారణం నా స్కూల్ ఫ్రెండ్ రేణుక. మా అబ్బాయిలిద్దరూ యూఎస్‌లో సెటిలయ్యారు. మా వారు 2015లో మాకు దూరమయ్యారు. ఇంత ఇంట్లో నేనొక్కర్తినే, ఎప్పుడూ ఏదో ఒక పనిలో నన్ను నేను నిమగ్నం చేసుకుంటూ నిబ్బరంగా జీవించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు రేణుక ఆల్బమ్ చేయిస్తానని నా ఫొటోలు తీసుకుని వెళ్లి '2019 మిసెస్ తెలంగాణ' పోటీలకు పంపించేసింది. ఆ తర్వాత నాకు అన్ని ఈవెంట్లలో పాల్గొనక తప్పలేదు. ఫైనల్స్ సమయంలో స్కాట్లాండ్‌లో ఒబేసిటీ మీద ఇంటర్నేషనల్ సెమినార్‌కి వెళ్లాను. ఇక్కడి నుంచి ఫోన్ చేసి ఒకటే తిట్లు. చివరి నిమిషంలో వచ్చి ఫైనల్ రౌండ్ పూర్తి చేశాను. మిసెస్ ఇండియా పోటీలకు ఇలా ఒకదానితో ఒకటి ఓవర్‌లాప్ కాకుండా జాగ్రత్త పడ్డాను. మిసెస్ ఇండియా విజేత అయినప్పుడు 63 పూర్తయి 64లో ఉన్నాను. సక్సెస్ ఇచ్చే కిక్‌ని బాగా ఎంజాయ్ చేశాననే చెప్పాలి.

నేనే ఉదాహరణ

అప్పటి వరకు నేనందుకున్న పురస్కారాల సమయంలో స్ఫూర్తిదాయకమైన మహిళగా ప్రశంసిస్తుంటే నా అర్హతలకు మించిన గౌరవం ఇస్తున్నారేమో అనిపించేది. ఈ వయసులో నేను సాధించిన ఈ లక్ష్యం నన్ను సంతోషంలో ముంచెత్తుతోంది. ప్రాణం పోయినా ఫర్లేదనే సంసిద్ధతతో మొదలు పెడతాం, అవాంతరాలెదురవుతాయి, కానీ సాధించి తీరాలనే సంకల్ప శక్తితో ముందుకెళతాం. లక్ష్యాన్ని చేరిన తర్వాత కలిగే ఆత్మవిశ్వాసంతో కూడిన అతిశయం చాలా గొప్ప భావన. చైతన్యవంతంగా ముందడుగు వేయాలనుకునే మహిళలకు నేనొక ప్రత్యక్ష నిదర్శనం'' అన్నారు డాక్టర్ శోభాదేవి.

– వాకా మంజులారెడ్డి

విల్‌పవర్

దుఃఖానికి అలవాటు పడితే చీకటే మిగులుతుంది.
దుఃఖాన్ని కూడా శక్తిగా మలుచుకుంటే వెలుగు వచ్చి పలకరిస్తుంది.
పదిమందికి సహాయం చేసే దారి చూపుతుంది.
దుఃఖాన్ని జయించిన డింపుల్ పర్మా ఆ దుఃఖాన్ని శక్తిగా మలుచుకొని బాధితులకు అండగా నిలబడుతోంది.
తాజాగా...
క్యాన్సర్‌పై అవగాహన కలిగించడానికి చేస్తున్న కృషికి డింపుల్ ప్రతిష్ఠాత్మకమైన 'కార్టియే ఉమెన్స్ ఇన్‌షియేటివ్ అవార్డ్-2023'కు ఎంపికైంది...

కన్నీళ్లే శక్తిగా...


డింపుల్ పర్మా

ఐఐఎం, కోల్‌కత్తాలో ఎంబీఏ చేసింది డింపుల్. తన బ్యాచ్‌మెట్ నితేష్ ప్రజాపత్‌తో స్నేహం ప్రేమగా మారింది. ఆ తరువాత వివాహబంధంతో ఇద్దరు ఒక్కటయ్యారు. సంతోషమే లోకంగా బతుకుతున్న వారిపై ఒక వార్త పిడుగులా పడింది. నితేష్‌కు క్యాన్సర్!

'ఎప్పుడూ చురుగ్గా, ఆరోగ్యంగా ఉండే వ్యక్తికి క్యాన్సరా!' అని కుమిలిపోయింది డింపుల్.

నితేష్‌కు వైద్యచికిత్స కోసం కోల్‌కత్తా నుంచి ముంబైకి తీసుకువచ్చారు. కష్టాల సమయంలో అసలైన ప్రేమ బయటికి వస్తుందంటారు. క్యాన్సర్ రూపంలో వచ్చిన కష్టం వారిని మరింత దగ్గర చేసింది. ఒకరినొకరు బాగా అర్థం చేసుకునేలా చేసింది. అదే సమయంలో మృత్యువు నితేష్‌ను తన నుంచి దూరం చేసింది.

ఎన్నో కలలు కన్న యువకుడు, స్నేహితుడు, భర్త ఇప్పుడు లేడు.


నితేష్‌తో డింపుల్

ఎవరికి ఏ చిన్న కష్టం వచ్చినా 'నేనున్నాను' అంటూ వచ్చే వ్యక్తి ఇకముందు కనిపించడు!

దుఃఖంలో మునిగిపోయిన డింపుల్‌కు కళ్ల ముందు చీకటి తప్ప ఏమీ కనిపించలేదు. ఆ చీకటిని దూరం చేయడానికి ఎవరో తనను వెదుక్కుంటూ ముందుకు రారు. తానే ఒక దారి వెదుక్కోవాలి అనుకుంది.

మొదట 'లవ్ హీల్స్ క్యాన్సర్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించి క్యాన్సర్‌పై అవగాహన కలిగించే ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది.

ఆతరువాత యాంటీ–క్యాన్సర్ డైట్, సప్లిమెంట్‌లకు సంబంధించిన 'జెన్‌ఆన్‌కో' అనే అంకురానికి శ్రీకారం చుట్టింది. 'జెన్‌ఆన్‌కో' ద్వారా వెయ్యికి పైగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. ఎంతో మంది పేషెంట్లకు అండగా నిలబడింది.

'నిరక్షరాస్యులకే కాదు చదువుకున్న వారిలో చాలామందికి క్యాన్సర్‌పై అవగాహన ఉండకపోవచ్చు. మేము చేసే మొదటి పని పేషెంట్‌లో ధైర్యం నింపడం. డైట్ నుంచి లేటెస్ట్ టెక్నాలజీ వరకు రకరకాల విషయాల గురించి వివరించడం' అంటుంది డింపుల్.

'కార్టియే' అనేది మహిళలకు సంబంధించిన ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం. ఈ పురస్కారం ద్వారా తనలాంటి భావాలు ఉన్న ఎంతోమంది మహిళలతో కలిసి అంతర్జాతీయ స్థాయిలో పనిచేసే అవకాశం లభిస్తుంది. కొత్త విషయాలు నేర్చుకోవచ్చు.

'కార్టియే ఉమెన్స్ ఇనిషియేటివ్ అనేది కేవలం అవార్డ్ కాదు. మన శక్తిసామర్థ్యాలు, సేవాకార్యక్రమాలను విస్తృతపరుచుకునే వేదిక. ఒక విధంగా చెప్పాలంటే మనం ఒక కొత్త ప్రపంచంలోకి వెళ్లినట్లు. అక్కడ మనకు అండగా ఉండే వ్యక్తులు ఉంటారు. మనకు ఉపకరించే దారులు ఉంటాయి. మనం ఏర్పర్చుకున్న సామాజిక లక్ష్యాలకు త్వరగా చేరువ కావడానికి వీలవుతుంది. ఫలితంగా ఎంతోమంది జీవితాల్లో మార్పు తీసుకురావచ్చు' అంటుంది డింపుల్.

'డింపుల్ చేస్తున్న ప్రయాణం మమ్మల్ని ఎంతగానో ఆలోచింపజేసింది. తన బాధ, కన్నీళ్లనే శక్తిగా మలుచుకొని ఎంతోమంది బాధితులకు అండగా నిలవడం సాధారణ విషయం కాదు. మన దుఃఖాన్ని శక్తిగా మలుచుకొని పదిమందికి ఉపయోగపడవచ్చు అని చెప్పడానికి డింపుల్‌ను చూపిస్తే చాలు. ఆమె స్టార్టప్ ఎంతో మంది జీవితాలను క్యాన్సర్ నుంచి రక్షించింది. బాధితులకు ఎనలేని ధైర్యాన్ని ఇచ్చింది' అంటున్నారు కార్టియే ఉమెన్స్ ఇన్‌షియేటివ్ సీనియర్ లీడర్‌లు.

నిజమైన నివాళి

వైద్యచికిత్స సమయంలో ఎంతో మంది స్నేహితులు, సన్నిహితులు చూపిన ప్రేమ నితేష్‌ను ధైర్యం కోల్పోకుండా, అదే ఉత్సాహంతో ఉండేలా చేసింది. ఆ సమయంలో నాకు బాగా అర్థమైన విషయం... పేషెంట్‌కు వైద్య చికిత్స మాత్రమే కాదు ప్రేమాభిమానాలు ఎంతో ముఖ్యమైనవని. ఏడాదిన్నర కాలంలోనే జీవితం తలకిందులైపోయింది. దుఃఖిస్తూ కూర్చోవడం కంటే బాధితులకు ఏదో రకంగా సహాయపడడమే నితేష్‌కు ఇచ్చే నిజమైన నివాళి అనుకొని ముందడుగు వేశాను.

– డింపుల్ పర్మా

బ్యూటిప్

రెండు టేబుల్ స్పూన్ల టొమాటో జ్యూస్, ఉడికించిన 50 గ్రా.ల ఓట్స్, 25 గ్రా.ల పెరుగు, కప్పుడు నీళ్లు కలపాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి, ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రపరుచుకోవాలి. బ్లాక్‌హెడ్స్, మొటిమలు తగ్గి చర్మం మృదువుగా కాంతిమంతంగా కనిపిస్తుంది.



పట్టుదల

మన దేశంలోని గ్రామాల్లో, చిన్న చిన్న టౌన్లలో చాలా వరకు మగవాళ్లు బతుకుదెరువు కోసం వలస వెళుతుంటారు. బీహార్‌వాసి ఉషాదేవి భర్త కూడా కుటుంబాన్ని వదిలి, అలాగే నగరానికి వెళ్లాడు. నలుగురు పిల్లలు, తను ఉన్న ఊళ్లోనే ఎలా గొప్పగా బతకచ్చో చూపించింది. స్వయంగా ఉపాధి పొందుతూ, పిల్లలకు చదువులు చెప్పించింది. తను కూడా కాలేజీ నుంచి డిగ్రీ పట్టాను సాధించింది. 'గుర్తింపు అనేది చిన్న విషయం కాదు. ఇది కొన్నేళ్ల పట్టుదల' అంటూ చెప్పే ఉషాదేవి కథనం నేడు ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తోంది.


ఉషాదేవి

ఉన్నచోటనే బతికి చూపించవచ్చు

ఉషాదేవిని చదువు మాన్పించి, పదిహేనేళ్ల వయసులో ఆమె తల్లిదండ్రులు పెళ్లి చేశారు. కొడుకు పుట్టాలని ఇంట్లోవారి కోరిక. దీంతో వరస కాన్పులు. ముగ్గురు ఆడపిల్లల తర్వాత కొడుకు పుట్టాడు. ఆమెకు తన జీవితంలో దేనిపైనా నియంత్రణ లేదు. ఇంట్లోవాళ్ల ఎంత చెబితే అంత. తన భర్త ఉద్యోగం వెతుక్కుంటూ వలస వెళ్లాల్సి రావడంతో తప్పనిసరై నలుగురు పిల్లల జీవితాలను చూసుకునేందుకు తల్లిగా ఆమె ఎదిగింది. అత్తమామల ఇంటి నుండి అదే గ్రామంలో వేరే ఇంటికి మారింది. ఆమె ఇప్పుడు డబ్బు సంపాదిస్తోంది. ఇంటి పెద్దగా ఆమెను అందరూ గుర్తిస్తున్నారు.


గ్రామంలోని మహిళలతో కలిసి...

పదకొండేళ్ల క్రితం

ఉషాదేవి సంపాదించడం ప్రారంభించినప్పుడు ఆమె తన చదువుపై కూడా పెట్టుబడి పెట్టింది. 2012లో ఒక ఎన్జీవోతో కలిసి పనిచేయడం ప్రారంభించింది. ఇంటింటికి వెళ్లి తల్లులు, శిశువుల ఆరోగ్య డేటాను సేకరిస్తుంది. 2016లో స్వయం సహాయక బృందాన్ని నిర్వహించడం ప్రారంభించింది. వదిలేసిన చదువును కొనసాగించడానికి భర్త రంజిత్ కూడా తన ఇష్టాన్ని చూపాడు. 'నా భార్య ఎంత తెలివిగా ఉందో గ్రహించినప్పుడు నా పొరపాటు ఏంటో అర్థమైంది. నా భార్య పిల్లలను చదివించకపోతే నా పిల్లలు నాలాగే మారేవారు. ఆమె వల్ల వారికి మంచి భవిష్యత్తు లభించడానికి అవకాశాలు ఉన్నాయి' అంటాడు రంజిత్.

ఆధారపడితే అంతే!

'భర్తలు వలస వెళ్లిన పరిస్థితుల్లో స్త్రీలే ఇంటి పెద్దలుగా పరిగణిస్తారు. అయితే, ఆమె తన అత్త, అన్నదమ్ముల వంటి ఇతరులపై ఆధారపడితే మాత్రం సరైన గుర్తింపు లభించదు. ఒక స్త్రీ తనంతట తానుగా సొంత కుటుంబాన్ని స్థాపించుకోగలిగిన సందర్భాల్లో, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంలోనే నిజమైన మార్పును చూడగలుగుతాం' అని చెప్పే ఉషాదేవి ఇప్పుడు తన గ్రామంలోని మహిళల్లో నాయకురాలిగా ఎదిగింది. చదువులోనూ రాణించడంతో చేసే ఎన్జీవో పనుల్లోనూ చురుకుగా వ్యవహరిస్తోంది. స్వయం సహాయక బృందానికి లీడర్‌గా, పేద మహిళలకు సులభంగా రుణాలు ఇచ్చే ప్రభుత్వ పథకంలో మహిళలను చేర్చుకోవడం ఆమెనే నిర్ణయిస్తుంది. మీటింగ్‌లను ఏర్పాటు చేస్తుంది. చిన్న మొత్తాల్లో విరాళాలు సేకరించి, తరచుగా బ్యాంకుకు వెళ్లి డిపాజిట్ చేయడం, రుణాల కోసం బ్యాంక్‌వారిని కోరడం, తిరిగి చెల్లించడం వంటి ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటుంది.

ఉషాదేవి టీమ్‌లో ఉండే శోభ మాట్లాడుతూ 'నా భర్త పంపే డబ్బు నాకు సరిపోదు. నాలాగే మిగతా వాళ్లు ఉన్నారు. ఇలాంటప్పుడు ఉషాదేవి మాలో ధైర్యాన్ని నింపుతుంది. ఆదాయవనరులను ఎలా సృష్టించుకోవాలో చెబుతుంది. చదువు చెబుతుంది' అని తెలియజేస్తుంది. పెద్దగా సంపాదిస్తున్న వాళ్లుగా కాదు గానీ, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం గల వ్యక్తులుగా వీళ్లను చూసి నేర్చుకోవాల్సి ఉంటుంది.

ఇంటిప్స్



- కొత్తిమీర, కరివేపాకులను పలుచని వస్త్రంలో చుట్టి ఫ్రిజ్‌లో పెడితే ఎక్కువ రోజులు నిలవ ఉంటాయి, రంగు మారవు.
- నీళ్లు తాగినా కూడా దాహం తీరినట్లు లేకపోతే ఒక ఏలక్కాయ తింటే చాలు. ప్రయాణాలలో ఏలక్కాయ తింటే దాహం వేయదు, నోటి దుర్వాసనను కూడా అరికడుతుంది.



మరో మథనం

'అమృత' శిల్పం


అమృతం కోసం
క్షీరసాగర మథనాన్ని
దేవతలు, రాక్షసులు
ఎలా సాగించారో మనకు తెలుసు.
ఎంతో మథనం సాగితేనే
మంచి సిద్ధిస్తుందని ఈ కథ సంకేతం.
ఈ పురా గాథను
పార్లమెంట్‌లో 75 అడుగుల పొడవు
మ్యూరల్‌గా సృష్టించాడు
శిల్పి నరేశ్ కుమావత్.
10 నెలల పాటు అతడు చేసిన
శ్రమ ఇది.
నరేశ్ కళాసృష్టి చాలానే ఉంది.


75 అడుగుల మ్యూరల్

దేశం గర్వపడే స్థాయిలో కొత్త పార్లమెంట్ భవనం నిర్మితమై, ప్రారంభమైంది. దీని విశేషాలు తెలుసుకునే కొద్దీ ప్రజలకు ఉత్సాహం కలుగుతూనే ఉంది. దీని బహిర్ రూపం గురించే కాకుండా లోపలి అలంకరణల కోసం ఎంతో ప్రయాస జరిగింది. దేశంలోని ఎందరో కళాకారులు, చిత్రకారులు, శిల్పులు పార్లమెంట్ లోపలి దారులను, ద్వారాలను, గోడలను మన సాంస్కృతిక చిహ్నాలతో అలంకరించారు. వీటిలో నరేశ్ కుమావత్ రూపొందించిన 'సముద్ర మంథన్'– అంటే క్షీర సాగర మథనం మ్యూరల్ ఒకటి.

ఆలోచనల మథింపు

దేవతలు, రాక్షసులు కలిసి క్షీరసాగర మథనం సాగించినప్పుడు పాల సముద్రంలో నుంచి ఎన్నో దివ్య వస్తువులు అవతరించాయి. అంతిమంగా అమృతం వెలువడింది. ఇవన్నీ ప్రజాహితానికి ఉపయోగపడేవే. పార్లమెంట్‌లో క్షీర సాగర మథనం మ్యూరల్‌ను పెట్టడంలో ఉద్దేశం అదే అంటాడు నరేశ్ కుమావత్. 'ప్రజలకు హితమయ్యే మంచి ఆలోచనల మథనం జరగాలని కోరుకుంటూ ఈ మ్యూరల్‌ని ప్రతిష్ఠించారు' అని తెలిపాడు.


శిల్పి నరేశ్ కుమావత్

75 అడుగుల వెడల్పు 9 అడుగుల ఎత్తు

'పార్లమెంట్ లోపల ఏర్పాటు చేయాల్సిన ఇంటీరియర్స్ కోసం ఒక సమావేశానికి నాకు ఆహ్వానం అందింది. మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ కలిసి ఈ కళాకృతులను అజమాయిషీ చేస్తున్నాయి. వారి నుంచి 'సముద్ర మంథన్' ఆలోచన వచ్చింది. దాని బాధ్యతలు నాకు అప్పగించారు. పార్లమెంట్‌లోని ఏదైనా పెద్ద గోడ దొరికితే దాని పొడవు మేర గొప్పగా ఈ మ్యూరల్ ఏర్పాటు చేస్తానని చెప్పాను. అలాగే దొరికింది. దాంతో 9 అడుగుల ఎత్తు, 75 అడుగుల వెడల్పులో మ్యూరల్ తయారు చేశాను.

40 మంది 10 నెలలు

క్షీర సారగ మథనం మ్యూరల్ రాత్రికి రాత్రే ఆవిష్కృతం కాలేదు. ముందు కుమావత్ స్కెచెస్ వేశాడు. ఆ తర్వాత బంక మన్నుతో ఒక నమూనా తయారు చేసుకున్నాడు. అధికారులు కరెక్షన్స్ చెప్పాక తుది రూపం నిశ్చయించుకుని ఐదు ధాతువులు– ఇత్తడి, లెడ్, టిన్, మెగ్నీషియమ్, టైటానియమ్‌ల మిశ్రమ రేకుతో మ్యూరల్ తయారయ్యింది. 40 మంది పది నెలల పాటు కష్టపడ్డారు. ఈ మ్యూరల్ మీద మొత్తం 235 మంది దేవుళ్లు, దేవతలు ఉన్నారు. 40 భాగాలుగా మ్యూరల్ తయారు చేసుకుని గోడ మీద వాటన్నింటినీ అనుసంధానించి బృహత్ రూపం ఇచ్చారు.

అతి పెద్ద శివుడు

కుమావత్ ఈ మ్యూరలే కాదు దేశవిదేశాలలో భారీ మూర్తులకు రూపకల్పన చేశాడు. ప్రతిష్ఠించాడు. రాజస్థాన్‌లోని నాథ్‌ద్వారాలో ప్రపంచంలోనే అతి ఎత్తయిన 351 అడుగుల శివుడి శిల్పాన్ని కుమావతే తయారు చేశాడు. దేశ నాయకుల భారీ విగ్రహాల ప్రతిష్ఠాపనలో పాల్గొన్నాడు. కొత్త పార్లమెంట్ భవనంలో తన కళాకృతికి చోటు దొరకడం అదృష్టం అంటున్నాడు.


'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 259

శనివారం 3-6-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రెజ్లర్లకు '83 బ్యాచ్' మద్దతు

మీకు అండగా ఉంటాం..కపిల్‌దేవ్ నేతృత్వంలో బృందం ప్రకటన - 11లో



లోకల్ కరెన్సీలకు ప్రాధాన్యం

అంతర్జాతీయ వాణిజ్యంలో వినియోగం.. బ్రిక్స్ దేశాల తీర్మానం - 11లో

త్వరలోనే బీజేపీని మట్టికరిపిస్తాం

త్వరలో మూడు, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు జరగనున్న ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపిస్తామని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత ప్రజానీకంలో అత్యధికుల మద్దతు లేని బీజేపీని ఓడించేందుకు అవసరమైన సాధనసంపత్తి, సత్తా తమ పార్టీకున్నాయని తెలిపారు. అమెరికాలో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ గురువారం భారతీయ అమెరికన్లతో, నేషనల్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు.



6లో

శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం

మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన నిరంతరం తపించారని చెప్పారు. శివాజీ విధానాలు, పాలనా వ్యవస్థ ఈనాటికీ అనుసరణీయమని పేర్కొన్నారు. మరాఠా రాజుగా ఛత్రపతి పట్టాభిషేకం జరిగి 350 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ కోటపై రాష్ట్రస్థాయి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.



6లో

దేశద్రోహానికి ఏడేళ్ల జైలు శిక్ష

దేశద్రోహం కేసుల్లో దోషులకు విధించే జైలు శిక్షను కనిష్టంగా మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకూ పెంచాలని భారత న్యాయ కమిషన్ సిఫార్సు చేసింది. దీనివల్ల నేరం తీవ్రతను బట్టి శిక్ష విధించే అవకాశం న్యాయస్థానాలకు లభిస్తుందని వెల్లడించింది. ఈ మేరకు న్యాయ కమిషన్ 'దేశద్రోహ చట్ట వినియోగం' పేరిట ఒక నివేదిక విడుదల చేసింది.



6లో



గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో 2,562 ట్రాక్టర్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్

ఇదిగో గ్రామ స్వరాజ్యం

ప్రతి అడుగులోనూ రైతులకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం

వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద పరికరాల పంపిణీలో సీఎం జగన్

- ప్రతి ఆర్బీకే పరిధిలో అందుబాటులో వ్యవసాయ పరికరాలు
- 10,444 ఆర్బీకేల పరిధిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు
- ఇప్పటికే 6,525 ఆర్బీకేలు, 391 క్లస్టర్ కేంద్రాల స్థాయిలో సేవలు
- 3,800 ట్రాక్టర్లు, 391 కంబైన్డ్ హార్వెస్టర్లు, 22,580 ఇతర యంత్రాలు
- మిగిలిన 3,919 ఆర్బీకేలు, 100 క్లస్టర్ కేంద్రాల స్థాయిలోనూ సేవలు
- వీటిలో 2,562 ట్రాక్టర్లు, 100 కంబైన్డ్ హార్వెస్టర్లు, 13,573 ఇతర మెషిన్లు
- అక్టోబర్‌లో 7 లక్షల మందికి ఉపయోగపడేలా స్ప్రేయర్లు, టార్పాలిన్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలను అన్ని విధాలా చేయి పట్టుకుని నడిపించడంలో భాగంగా రైతన్నలే ట్రాక్టర్లతో కూడిన వ్యవసాయ పనిముట్లన్నింటినీ అతి తక్కువ అద్దెతో మిగిలిన రైతులకు అందుబాటులోకి తేవడం గ్రామ స్వరాజ్యానికి నిజమైన అర్థం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా

మిగతా 2వ పేజీలో ▶



"రైతులు దేశానికి, రాష్ట్రానికి వెన్నెముక. అలాంటి రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. అందు కోసమే రాష్ట్రంలో నాలుగేళ్లుగా వారికి అన్ని విధాలా అండగా నిలిచాం. విత్తనం మొదలు పంట కొనుగోలు వరకు అన్ని దశల్లో వారికి దిశా నిర్దేశం చేస్తూ తీసుకొచ్చిన ఆర్బీకేలు అద్భుత ఫలితాలిస్తున్నాయి. ఈ పరంపరలో భాగంగా రైతులకు అతి తక్కువ అద్దెతో వ్యవసాయ యంత్ర పరికరాలు సమకూరుస్తూ ఇంకో అడుగు ముందుకు వేశాం. అన్నదాతలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

\- ముఖ్యమంత్రి వైఎస్ జగన్



ప్రమాద స్థలంలో సహాయక చర్యలు

ఒడిశాలో ఘోర ప్రమాదం

3 రైళ్లు..

వంద మందికి పైగా మృతి?

గూడ్సును ఢీకొని పట్టాలు తప్పిన కోరమండల్! పక్క ట్రాక్‌పై పడ్డ దాని బోగీలను ఢీకొన్న హౌరా

70కి పైగా మృతదేహాల వెలికితీత .. 350 మందికి పైగా గాయాలు

మహా విషాదం!

ఒడిశాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. శుక్రవారం రాత్రి ఒకే చోటఏకంగా రెండు ప్రయాణికుల రైళ్లు, ఒక గూడ్స్ ప్రమాదానికి గురయ్యాయి. ఈ దారుణంలో కనీసం వంద మందికిపైగా దుర్మరణం పాలైనట్టు భావిస్తున్నారు. ఇప్పటిదాకా 70కి పైగా మృతదేహాలను వెలికి తీశారు. 350 మందికి పైగా గాయపడ్డారు. వందలాది మంది బోగీల్లో చిక్కుబడి ఉండటంతో మృతుల సంఖ్య భారీగా పెరిగేలా ఉంది. సహాయక చర్యలకు పెను చీకటి అడ్డంకిగా మారింది. ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది మాటలకందని విషాదమన్నారు.



గూడ్స్ వ్యాగన్ పైకి దూసుకెళ్లిన కోరమండల్ ఇంజన్

6లో

ఊహించని ఉత్పాతం

20 సెకన్లలో గంటకు 128 కి.మీ నుంచి 0 స్పీడ్‌కు..

ఫ్యాక్ట్ చెక్

బాబు కళ్లతో చూశారా రామోజీ?

- ఆర్బీకేల సేవలను దేశమంతా ప్రశంసిస్తుంటే 'ఈనాడు' విష ప్రచారం
- గత ప్రభుత్వంలో రైతుల పరిస్థితి మరిచిపోయారా?
- రోజుల తరబడి విత్తనాల కోసం పడిగాపులు.. స్పృహ తప్పుడాలు
- నకిలీ విత్తనాలు, ఎరువులతో నిలువునా మునిగే రైతులు
- ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది ఈ ప్రభుత్వం వచ్చాకే కదా!
- ఈ వాస్తవాలు మరిచి దుర్మార్గపు రాతలు బాబు కోసం కాదా?
- విత్తు నుంచి విక్రయం వరకు రైతుకు అండగా ఆర్బీకేలు
- నేడు సీజన్‌కు ముందుగానే పంపిణీ

3లో

మరో మైలురాయి చేరుకున్న విమ్స్



విమ్స్‌లో గౌరవ వందనంతో మృతదేహాన్ని తరలిస్తున్న అంబులెన్స్

- అవయవదానం జరిగిన మొట్ట మొదటి ప్రభుత్వాస్పత్రిగా రికార్డు
- బ్రెయిన్ డెడ్ అయిన చంద్రకళ నుంచి అవయవాల సేకరణ
- నలుగురి జీవితాల్లో వెలుగులు
- అవయవదానానికి ముందుకు రావాలంటున్న 'జీవన్‌దాన్'

- వివరాలు 5లో

కోర్టు బోనెక్కనున్న ప్రిన్స్ హ్యారీ



- ఫోన్ ట్యాపింగ్‌పై సాక్ష్యం చెప్పనున్న బ్రిటన్‌రాజు చార్లెస్–3 చిన్న కుమారుడు
- 130 ఏళ్లలో తొలిసారిగా న్యాయస్థానానికి రాజకుటుంబీకుడు

6లో

కోడెలకు అన్యాయం చేస్తున్నారు

పార్టీ కోసం ప్రాణాలిచ్చిన నేత కుటుంబానికి 5 నిమిషాలు ఇవ్వడంలేదు

- చంద్రబాబును కలవాలని చాలా ప్రయత్నాలు చేశాం.. రూ.5 లక్షలు ఇస్తే చంద్రబాబుతో భోజనం చేయవచ్చట
- కోడెల త్యాగానికి వెల కడితే మేము కూడా చెల్లిస్తాం
- పార్టీని, చంద్రబాబుని తిట్టిన కన్నాకు సత్తెనపల్లి బాధ్యతలు ఎలా ఇస్తారు?.. సత్తెనపల్లిలో పోటీ చేస్తా.. గెలుస్తా
- 'సాక్షి'తో కోడెల శివప్రసాద్ కుమారుడు కోడెల శివరాం

సాక్షి, నరసరావుపేట: తెలుగుదేశం పార్టీ స్థాపించిన రోజు నుంచి మరణించే వరకు ఆ పార్టీ కోసం పోరాడిన డాక్టర్ కోడెల శివప్రసాద్, ఆయన కుటుంబానికి చంద్రబాబునాయుడు అన్యాయం చేస్తున్నారని శాసన సభ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ కుమారుడు కోడెల శివరాం ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడుతూ.. 'వైద్య వృత్తిలో పల్నాడు గడ్డపైనే కాకుండా ప్రపంచంలోని



తెలుగువారందరికీ ఆదర్శంగా నిలిచిన కోడెల శివప్రసాద్ ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చారు. ఎన్టీఆర్ కోరిక మేరకు కోడెల 11 ఏళ్ల కష్టపడి బసవతారకం ఆసుపత్రిని నిర్మించారు. చనిపోయేవరకు పార్టీ, కార్యకర్తలు, పేదలకు అండగా నిలిచారు. పల్నాడు ప్రాంతం, కోటప్పకొండ అభివృద్ధి అంటే గుర్తుకొచ్చే పేరు కోడెల. అటువంటి కోడెలను పార్టీ నేతలు

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



...ఇక తొలగించడానికి ఏమీ మిగల్లేన్నార్! ఓకేనా!

అందరినీ కోటీశ్వరుల్ని చేస్తా

- రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యత టీడీపీ తీసుకుంటుంది
- మేనిఫెస్టోను కాపీ కొట్టామనే విమర్శలు అర్థరహితం
- నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీళ్లిస్తాం
- తెలుగు వారికి విభజన దినోత్సవ శుభాకాంక్షలు
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు

- వివరాలు 3లో



రాష్ట్ర విభజన శుభాకాంక్షలా?



- ఇంతకీ చంద్రబాబు ఏ రాష్ట్ర పౌరుడు?: మాజీ మంత్రి పేర్ని నాని
- అసలు మైండ్ ఉండే మాట్లాడుతున్నారా?
- ఆంధ్రప్రదేశ్ ప్రజలకు నవంబర్ 1 ఆవిర్భావ దినోత్సవం
- బాబు హయాంలో ఒక్క రోజులోనే రూ.5 వేల కోట్ల అప్పు
- మేం నాలుగేళ్లలో చేసిన అప్పు రూ.1.82 లక్షల కోట్లు
- డీబీటీతో పేదలకు నేరుగా రూ. 2.11 లక్షల కోట్లు జమ
- షూటింగ్‌లు లేకనే పవన్‌కళ్యాణ్ యాత్రలు

3లో



అమెరికా రుణ పరిమితి బిల్లుకు సెనేట్ ఆమోదం

దివాలా(డీఫాల్ట్) ముప్పు నుంచి అగ్రరాజ్యం అమెరికా బయటపడినట్లే. రుణ పరిమితి పెంపునకు సంబంధించిన బిల్లుపై (ద్వైపాక్షిక ఒప్పందం) సెనేట్ తుది ఆమోద ముద్ర వేసింది. సుదీర్ఘమైన చర్చల అనంతరం గురువారం రాత్రి ఓటింగ్ నిర్వహించగా.. 63–36 ఓట్లతో బిల్లు ఆమోదం పొందింది. సంతకం కోసం అధ్యక్షుడు జో బైడెన్ డెస్క్‌కు పంపించారు.

- వివరాలు 6లో

ఇదిగో గ్రామ స్వరాజ్యం



ట్రాక్టర్లను నడుపుతున్న రైతులకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్సార్ యంత్ర సేవా పథకానికి సంబంధించిన చెక్కుతో సీఎం వైఎస్ జగన్



హార్వెస్టర్‌ను నడుపుతున్న సీఎం వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

శుక్రవారం ఆయన గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో రాష్ట్ర స్థాయి రెండో మెగా పంపిణీ కింద రూ.361.29 కోట్ల విలువ గల 2,562 ట్రాక్టర్లు, 100 కంబైన్డ్ హార్వెస్టర్లు, 13,573 ఇతర వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేసే కార్యక్రమాన్ని లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ట్రాక్టర్‌ను, కంబైన్డ్ హార్వెస్టర్‌ను స్వయంగా నడిపారు. అనంతరం రూ.125.48 కోట్ల సబ్సిడీ సొమ్మును కంప్యూటర్‌లో బటన్ నొక్కి నేరుగా రైతన్నల గ్రూపుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ ప్రతి ఆర్బీకే పరిధిలో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద రైతులకు కావాల్సిన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు. ఆ ఆర్బీకే పరిధిలో ఉన్న రైతులే ఒక గ్రూపుగా ఏర్పడి దానిని ఒక కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ కిందకు తీసుకుని వచ్చి, ఆ ఆర్బీకే పరిధిలో ఉన్న మిగిలిన రైతులందరికీ తక్కువ ధరకు ఈ యంత్రాలన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చే గొప్ప కార్యక్రమానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. తద్వారా 10,444 ఆర్బీకేల పరిధిలో రైతులకు ట్రాక్టర్లతో కూడిన వ్యవసాయ పనిముట్లు తక్కువ అద్దెతో అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

వైఎస్సార్ యంత్ర సేవ యాప్

- ఆర్బీకే స్థాయిలో ఏ రైతు అయినా ఈ యంత్రాలను అతి తక్కువ అద్దెతో వాడుకునేందుకు వైఎస్సార్ యంత్ర సేవ యాప్‌ను అందుబాటులోకి తీసుకుని వస్తున్నాం. ఈ యాప్ సహాయంతో 15 రోజులు ముందుగానే వ్యవసాయ ఉపకరణాలను బుక్ చేసుకోవచ్చు. వీటి వల్ల మంచి జరగాలని, ప్రతి ఆర్‌బీకే పరిధిలోని రైతులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరుతున్నాం.
- ఈ ఏడాది అక్టోబర్ నెలలో 7 లక్షల మంది రైతులకు మంచి చేస్తూ.. వారికి అవసరమైన స్ప్రేయర్లు, టార్పాలిన్లు, వీడర్లు వంటి వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లను నిరుపేదలైన రైతులకు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. ఆర్బీకే వ్యవస్థను పటిష్టం చేస్తూ, రైతులకు ఇంకా మంచి జరగాలన్న తపనతో ముందుకు వెళ్తున్నాం.

ఏ యంత్రాలు కావాలో రైతులదే నిర్ణయం

- ఇంతకు ముందు 6,525 ఆర్బీకేల స్థాయిలో, 391 క్లస్టర్ స్థాయిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను రైతుల పేరుతో ప్రారంభించాం. వాటి పరిధిలో 3,800 ట్రాక్టర్లు, 391 కంబైన్డ్ హార్వెస్టర్లు, 22,580 ఇతర యంత్రాలు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశాం. ఇప్పుడు మరో 3,919 ఆర్బీకేల స్థాయిలో, మిగిలిన 100 క్లస్టర్ స్థాయి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు అన్నింటిలో 2,562 ట్రాక్టర్లు, 100 కంబైన్డ్ హార్వెస్టర్లు, 13,573 ఇతర యంత్రాలను అందుబాటులో ఉంచుతున్నాం.
- ప్రతి ఆర్బీకే స్థాయిలో రూ.15 లక్షలు కేటాయించి, అక్కడ ఎటువంటి యంత్రాలు కావాలో రైతులనే నిర్ణయించుకోమని చెప్పాం. వాళ్ల నిర్ణయం ప్రకారం రూ.15 లక్షల మేరకు ఆ యంత్రసేవలన్నీ వారి అవసరాల మేరకు తీసుకొస్తున్నాం.
- 491 క్లస్టర్ స్థాయి సెంటర్లలో వరి బాగా పండుతున్న చోట కంబైన్డ్ హార్వెస్టర్లు తీసుకు రావాల్సిన అవసరం ఉందని గుర్తించాం. అక్కడ ఒక్కో క్లస్టర్ స్థాయిలో ఒక్కో హార్వెస్టర్‌ను రూ.25 లక్షల వ్యయంతో రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నాం. ఇందుకు రూ.1052 కోట్లు ఖర్చు పెడుతున్నాం. గ్రూపులుగా ఏర్పడిన రైతులు కేవలం 10 శాతం డబ్బులు కడితే చాలు.. 40 శాతం ప్రభుత్వమే సబ్సిడీ కింద ఇస్తుంది. మిగిలిన 50 శాతం రుణాల కింద ఆ ఆర్బీకే పరిధిలో ఉన్న రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

ఇంతటి ఘన కార్యం ఎక్కడా లేదు



గతంతో పోలిస్తే వ్యవసాయ రంగం యాంత్రీకరణ దిశగా కొనసాగుతోంది. పొలాల్లో పని చేసేందుకు కార్మికులు ఆశించిన స్థాయిలో దొరకడం లేదు. అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు సబ్సిడీపై అందిస్తున్నారు. ఇప్పటికే రెండు విడతలుగా పంపిణీ చేశారు. రైతు కోరుకున్న కంపెనీ, కోరుకున్న ధరలో అందజేస్తున్నాం. ఇంతటి ఘన కార్యం చేసిన ముఖ్యమంత్రి దేశంలో ఎవరూ లేరనడం అతిశయోక్తి కాదు. అందుకే రైతాంగం ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతుంది.

– ఎంవీఎస్ నాగిరెడ్డి, వైస్ చైర్మన్ ఏపీ స్టేట్ వ్యవసాయ మిషన్

నాతోపాటు పదిమందికి జీవనోపాధి



ఈ ట్రాక్టర్ కారణంగా నేను ఉపాధి పొందడంతో పాటు తోటి రైతులకు కూడా సాయం చేసే వీలుంటుంది. వ్యవసాయం లేనిదే దేశం లేదు. అందుకే ముఖ్యమంత్రి రైతులను ఆదుకుంటే వ్యవసాయం బతుకుతుందని మాకు చేయూతనిస్తున్నారు. పండుగ వాతావరణంలో ట్రాక్టర్లు అందించారు. నా ట్రాక్టర్ విలువ సుమారు రూ.9 లక్షలు అందులో నాకు రూ.3.60 లక్షలు సబ్సిడీ రూపంలో ప్రభుత్వమే చెల్లించింది.

– బి.డేవిడ్, పొన్నూరు రూరల్, గుంటూరు జిల్లా

ఇలాంటి సీఎం ఎక్కడా ఉండరు



నాకు ట్రాక్టర్‌తోపాటు రైతు వారీగా చాలా పథకాలు అందుతున్నాయి. ఇన్‌పుట్ సబ్సిడీ, రోటోవేటర్, తైవాన్ స్ప్రేయర్లు, నా బిడ్డలకు జగనన్న దీవెన, నా భార్యకు ఉన్న ఊళ్లోనే జగనన్న ఇల్లు వచ్చింది. దీంతోపాటు అతి ముఖ్యమైనది పంటకు మద్దతు ధర. అందుకే ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. ఇలాంటి సీఎం దేశంలో ఎక్కడా లేరు.

– డి.కోటేశ్వరరావు, చిర్రావూరు, తాడేపల్లి, గుంటూరు జిల్లా

దేవుడిలా కరుణ చూపుతున్నారు



ఈ ముఖ్యమంత్రి లేకపోతే రైతాంగం ఏమైపోయేదో. ఇన్‌పుట్ సబ్సిడీ మొదలు.. రైతు భరోసా, బీమా, ట్రాక్టర్ల పంపిణీ.. ఇలా ఒకటి కాదు.. అనేక వరాలు కురిపిస్తున్న మహనీయుడు సీఎం జగన్. సాక్షాత్తు దేవుడిలా మమ్మల్ని ఆదుకుంటున్నారు. నాకు అందించిన ట్రాక్టర్ విలువ రూ.8.30 లక్షలు. అందులో నాకు సుమారు రూ.3.3 లక్షలు సబ్సిడీ కింద వచ్చింది. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం...

– వి.వెంకటేశ్వరరావు, పచ్చలతాడిపర్రు, పొన్నూరు మండలం, గుంటూరు జిల్లా

సీఎం రుణం తీర్చుకుంటాం



రైతుల కష్టాన్ని చూసిన ముఖ్యమంత్రి వారి కష్టాలను ఆయన భుజాన వేసుకున్నారు. గతంలో వర్షాల కోసం ఆకాశాన్ని చూసే రైతులు ఇప్పుడు ప్రభుత్వం వైపు చూస్తున్నారు. అంతగా ఈ ప్రభుత్వం అన్నదాతలను ఆదుకుంటోంది. ముఖ్యమంత్రి రుణం రానున్న కాలంలో తప్పక తీర్చుకుంటాం.

– ఎస్.మణికంత, బ్రాహ్మణకోడూరు, పొన్నూరు మండలం, గుంటూరు జిల్లా

థ్యాంక్యూ సీఎం సార్..



నేను బీటెక్ చదువుకుని నాన్న ప్రోత్సాహంతో వ్యవసాయం చేస్తున్నాను. దాదాపు 30 ఎకరాలను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాం. మాకు ట్రాక్టర్ చాలా అవసరం. 40 శాతం సబ్సిడీపై ట్రాక్టర్‌ను ప్రభుత్వం అందజేసింది. ఇది నా ఉపాధికి ఎంతో ముఖ్యం. ముఖ్యమంత్రి దూరదృష్టి కారణంగా మాలాంటి యువత వ్యవసాయంవైపు చూస్తోంది. థ్యాంక్స్ టు సీఎం సార్.

– ఎం.సాయిరాం, చిట్టూర్పు, కృష్ణా జిల్లా

ముఖ్యమంత్రి ఔదార్యం

- కష్టాలు చెప్పుకొన్న ఇరు కుటుంబాలు
- మెరుగైన వైద్యం, తక్షణ సాయానికి ఆదేశం
- గంటల వ్యవధిలో రూ.లక్ష చొప్పున అందజేత



ముఖ్యమంత్రికి సమస్య చెప్పుకొంటున్న ఖాదర్‌బాషా తండ్రి షేక్ జానీ తదితరులు



ఖాదర్‌బాషా కుటుంబ సభ్యులకు చెక్కు ఇస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే గిరి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

గుంటూరు వెస్ట్ : నవరత్న సంక్షేమ పథకాల అమలుతో పాటు అడగ్గానే ఆపన్న హస్తం అందించే బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతిగా, పేదల ముఖ్యమంత్రిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు తన ఔదార్యం చాటుకున్నారు. శుక్రవారం గుంటూరు పర్యటనకు వచ్చిన సీఎంను కలిసి కష్టాలు విన్నవించుకున్నారు. 'మా 15 ఏళ్ల కుమారుడు షేక్ ఖాదర్ బాషాకు పుట్టుక నుంచే బ్రెయిన్‌లో నరాల ఇబ్బంది ఉందని వైద్యులు చెప్పారు. ఒళ్లంతా చచ్చుబడినట్లు ఉంటుంది. బాబుకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు పింఛన్ మొత్తం పెంచేలా చూడండి' అని తల్లిదండ్రులు గుంటూరుకు చెందిన షేక్ జాని, హసీనా సీఎంకు విన్నవించారు. 'నా మనవడు సయ్యద్ ఫారూఖ్ ఆలీకి తలసేమియా వ్యాధి ఉంది. తరచూ రక్తమార్పిడి జరగాలి. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నెలకు రూ.10 వేలు పింఛన్ వస్తోంది. ఇటీవల లివర్ కొంత పాడయ్యిందని వైద్యులు చెప్పారు. మీరే మంచి వైద్యం చేయించాలి' అని బాలుడి నాయనమ్మ ఫాతిమా ముఖ్యమంత్రిని వేడుకున్నారు. వీరిద్దరి కష్టం వినగానే వెంటనే స్పందించిన సీఎం వారికి తక్షణ సాయంగా రూ.లక్ష, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఇది జరిగిన కొద్ది గంటలకే బాధితులిద్దరికీ జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు మద్దాళి గిరిధర్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాల్‌పురం రాము) రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. మెరుగైన వైద్యం కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఆదాయం అదిరింది

- స్థిరాస్తుల మార్కెట్ విలువ పెంపు నేపథ్యంలో మేలో రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు
- లక్ష్యానికి మించి రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం
- ఒక్క నెలలోనే సమకూరిన మొత్తం రూ.48.37 కోట్లు



కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్‌ల కోసం తరలి వచ్చిన జనం

కొవ్వూరు: జూన్ నుంచి భూముల రిజిస్ట్రేషన్ విలువ పెరుగుతోందన్న ముందస్తు సమాచారంతో జిల్లా వ్యాప్తంగా మేలో రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఏప్రిల్‌లో 7,162 రిజిస్ట్రేషన్లుఅయితే మేలో 10,423 అయ్యాయి. దీంతో రిజిస్ట్రేషన్ల శాఖకు నిర్దేశించిన లక్ష్యంగా కంటే అదనంగా రూ.7.,54కోట్ల మేర ఆదాయం సమకూరింది. గడచిన నెలలో నాలుగు వారాల రికార్డులను పరిశీలిస్తే చివరి వారంలో రెండున్నర రెట్లు అదనపు ఆదాయం వచ్చింది. మేలో వివిధ రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.48.03 కోట్ల ఆదాయం సమకూరింది. చివరి వారంరోజుల్లోనే రూ.23.34 కోట్లు వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 1,06,943 రిజిస్ట్రేషన్లు అయ్యాయి. వీటి ద్వారా ఆ శాఖకు రూ.392.67 కోట్లు ఆదాయం వచ్చింది. నెలకు సరాసరి రూ.32 కోట్లు సమకూరింది. భూముల ధరలు పెరగనున్న నేపథ్యంలో మేలో 48.37కోట్లు ఆదాయం వచ్చింది.

లక్ష్యాలకు మించి రిజిస్ట్రేషన్‌లు

జిల్లా వ్యాప్తంగా 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిలో అనపర్తి, కడియం, అనంతపల్లి కార్యాలయాలను మినహాయిస్తే మిగిలిన తొమ్మిదింట లక్ష్యాలకు మించి రిజిస్ట్రేషన్లు అయ్యాయి. జిల్లాలో అత్యధికంగా రాజమహేంద్రవరం నగరాన్ని ఆనుకుని ఉన్న పిడింగొయ్యిలో రూ.4.92కోట్లు లక్ష్యం కాగా ఏకంగా రూ.7.03 కోట్లు ఆదాయం లభించింది. కొవ్వూరులో రూ.3.34 కోట్లు లక్ష్యమైతే రూ.4.55 కోట్లు వచ్చింది. రాజమహేంద్రవరం మూడో స్థానంలో నిలిచింది. ఇక్కడ రూ.10.55 కోట్లు లక్ష్యంగా నిర్దేశిస్తే రూ.13.29కోట్లు ఆదాయం సమకూరింది .రాజానగరంలోను రూ.6.90కోట్లకు గాను రూ.8.23 కోట్లు వసూలైంది. బిక్కవోలులో 114.67శాతం, కోరుకొండలో 116.58 శాతం, సీతానగరంలో 118.83, వేగేశ్వరపురంలో 114.07,నిడదవోలులో లక్ష్యం కంటే 111.60 శాతం అదనంగా రిజి స్ట్రేషన్ శాఖకు ఆదాయం సమకూరింది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయల వారీగా భూమి విలువ పెరిగిన గ్రామాల సంఖ్య

పరిధి	గ్రామాలు	భూమి విలువ పెరిగినవి
కొవ్వూరు	25	12
అనంతపల్లి	25	10
అనపర్తి	14	06
బిక్కవోలు	26	08
నిడదవోలు	46	10
కడియం	10	02
కోరుకొండ	30	05
రాజానగరం	25	05
పిండిగోయ్యి	08	02
సీతానగరం	16	02
వేగేశ్వరపురం	32	16

జిల్లాలో 78 గ్రామాల్లోనే ధరలు పెంపు

జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 257 గ్రామాలున్నాయి. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 90 వార్డులున్నాయి. వీటిలో 78 గ్రామాలు, నలభై వార్డుల్లో మాత్రమే భూముల మార్కెట్ ధరలు, స్ట్రక్చర్స్ విలువలు పెంచారు. 179 గ్రామాల్లోను, రాజమహేంద్రవరం అర్బన్‌లోని 50 వార్డుల్లోను భూముల ధరల్లో ఏవిధమైన మార్పు లేదు. లేఅవుట్లు విస్తరిస్తున్న ప్రాంతాలు, నేషనల్ హైవేలు, వాణిజ్య పరంగాను, ఇతర అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లోనే తాజాగా భూముల ధరలు పెంచారు. అదికూడా సరాసరి 20 నుంచి 30 శాతం మాత్రమే పెంచారు. ధరల పెరగని ప్రాంతాల్లో 50శాతం చొప్పున పెంచారు.

అమలులోకి వచ్చిన కొత్తమార్కెట్ విలువ



జిల్లాలో ఎంపిక చేసి ప్రాంతాల్లో మాత్రమే స్థిరాస్తుల మార్కెట్ విలువ పెంచారు. ఈనెల 1 నుంచి పెరిగిన భూముల మార్కెట్ ధరలు అమలులోకి వచ్చాయి. దీంతోపాటు స్ట్రక్చర్స్(నిర్మాణాలు) విలువ కుడా పెంచారు. ఎక్కువ రిజిస్ట్రేషన్లు అయ్యే ప్రాంతాల్లో భూములను గుర్తించి అక్కడ ధరలు మాత్రమే సవరించారు. కొత్త ధరలు అమలులోకి వచ్చిన నేపథ్యంలో మేలో ఎక్కువగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. అదనపు ఆదాయం సమకూరింది.

–కె.ఆనందరావు, జిల్లా రిజిస్ట్రార్

ఏపీపీఎస్సీ పరీక్షలను విజయవంతం చేయాలి

కమిషన్ చైర్మన్ గౌతం సవాంగ్



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రూప్–1 సర్వీసెస్‌కు సంబంధించిన మెయిన్స్ పరీక్షను విజయవంతం చేయాలని కమిషన్ చైర్మన్ డి.గౌతం సవాంగ్ అధికారులను ఆదేశించారు. విజయవాడ నగరంలో ఈ నెల మూడో తేదీ నుంచి జరిగే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను పురస్కరించుకొని పరీక్షా కేంద్రాలైన కేబీఎన్ కళాశాల, పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణాలలోని సదుపాయాలను గౌతం సవాంగ్ డీసీపీ విశాల్‌గున్నితో కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం పరీక్షలను నిర్వహించే ఇన్విజిలేటర్లు, ఇతర అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ నెల మూడో తేదీ నుంచి పదో తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పరీక్షా కేంద్రంలో మొబైల్ ఫోన్లను అనుమతించరాదని, పరీక్ష కేంద్రాల దగ్గరలో జిరాక్స్, నెట్, ప్రింటింగ్ సెంటర్లు మూయించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో బయట వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు తిరగకుండా చూడాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన కనీస వసతులు సమకూర్చాలని సంబంధిత అధికారులకు గౌతమ్‌సవాంగ్ ఆదేశాలిచ్చారు. పోలీస్ అధికారులకు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపెరింటెండెంట్లకు, ఇన్విజిలేటర్లకు ఈ సందర్భంగా పలు సూచనలు సలహాలను అందించారు. విశాల్‌గున్ని మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. పోలీసులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ డీ ప్రసాద్, వెస్ట్ ఏసీపీ కే హనుమంతరావు, డీఆర్వో మోహన్‌కుమార్ ఇతర అధికారులు, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

'జయలక్ష్మి' ఆస్తుల సీజ్‌కు రంగం సిద్ధం

- పాత పాలకవర్గం అమ్మేసిన ఆస్తులపై గురి
- కొనుగోలుచేసిన వారికి నోటీసులు.. చార్జిషీట్‌లు
- 'మార్గదర్శి' విచారణతో ఇప్పటివరకు నెమ్మదించిన విచారణ.. తాజాగా మరోసారి రంగంలోకి సీఐడీ బృందం
- సీఐడీ దూకుడుతోరుణాలు చెల్లించేందుకు ముందుకొస్తున్న రుణగ్రహీతలు
- జూలై నెలాఖరుకల్లా బాధితులకు రూ.100 కోట్లు చెల్లింపు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: డిపాజిటర్లను నిలువునా ముంచేసి కోట్లాది రూపాయలు కొల్లగొట్టేసిన జయలక్ష్మి మ్యూచువల్లీ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ గత పాలకవర్గ సభ్యుల ఆస్తులను సీజ్ చేసేందుకు రంగం సిద్ధమైంది. సీఐడీ ఆ దిశగా దూకుడు పెంచింది. నిన్న మొన్నటివరకు మార్గదర్శి కుంభకోణాన్ని ఛేదించడంలో నిమగ్నమైన సీఐడీ ఇప్పుడు తాజాగా 'జయలక్ష్మి'పై దృష్టిపెట్టింది. కాకినాడ సర్పవరంలోని జయలక్ష్మి మెయిన్ బ్రాంచిలో రెండ్రోజులుగా సీఐడీ బృందం పాత పాలకవర్గ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ సహా డైరెక్టర్లు వ్యూహాత్మకంగా ముందుగానే అమ్మేసిన ఆస్తుల సీజ్‌కు రికార్డులను సిద్ధంచేసింది.

జామీను దొరక్కపోవడంతో జైలులోనే..

ఏప్రిల్‌లో కాకినాడ సర్పవరం కేంద్రంగా జయలక్ష్మి మ్యూచువల్లీ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌బోర్డు తిప్పేసి 19,911 మందికి చెందిన రూ.520 కోట్ల డిపాజిట్లు కొల్లగొట్టేసిన సంగతి తెలిసిందే. విశాఖపట్నం, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు తదితర జిల్లాల్లో 29 బ్రాంచీలను ఏర్పాటుచేసి ఈ మోసానికి తెగబడ్డారు. ఈ ఘటనపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. చివరి డిపాజిటర్ వరకు న్యాయం చేసేందుకు ఏర్పాట్లుచేస్తోంది. ఇందులో భాగంగా సీఐడీని రంగంలోకి దింపడంతో చైర్మన్ ఆర్ఎస్ఆర్ ఆంజనేయులు, వైస్ చైర్‌పర్సన్ విశాలాక్షి, 11 మంది సహా డైరెక్టర్లపై కేసులు నమోదుచేయడానికి, ముగ్గురు మినహా అందరినీ అరెస్టుచేయించడానికి వీలు చిక్కింది. ఆంజనేయులు, విశాలాక్షి, డైరెక్టర్లకు బెయిల్ మంజూరైనప్పటికీ జామీను ఇవ్వడానికి ఎవరు ముందుకురాకపోవడంతో వారంతా ప్రస్తుతం విశాఖ సెంట్రల్ జైలులోనే ఉన్నారు.

ఆస్తులు సీజ్ చేస్తున్న సీఐడీ

ఈ క్రమంలో.. గత పాలకవర్గ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్ సహా డైరెక్టర్ల పేరుతో వివిధ జిల్లాల్లో ఉన్న ఆస్తులను సీజ్ చేస్తున్నారు. ఈ మేరకు కొత్త పాలకవర్గ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథ్‌రావు సమక్షంలో సీఐడీ బృందం గురు, శుక్రవారాల్లో కాకినాడ మెయిన్ బ్రాంచిలో రికార్డులను పరిశీలించింది. ఒక్క కాకినాడ జిల్లాలోని ఎనిమిది బ్రాంచీల వివరాలు సేకరిస్తేనే కోట్ల విలువైన చర, స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు ఉన్నట్లు తేలింది. సీఐడీ అదనపు ఎస్పీ రవివర్మ పర్యవేక్షణలో సీఐడీ సీఐ పైడప్ప నాయుడు, ఆరుగురు పోలీసు అధికారులతో కూడిన ప్రత్యేక బృందం రికార్డులు, గత పాలకవర్గ సభ్యుల పేరుతో ఉన్న డాక్యుమెంట్లను సేకరించి ఆస్తులను సీజ్‌చేసే పనిలో నిమగ్నమైంది. వీటిపై చట్టపరంగా ఆంజనేయులు, విశాలాక్షి సహా డైరెక్టర్లకు ఎటువంటి హక్కుల్లేవని సీఐడీ తేల్చింది.

ఆర్నెల్ల ముందు నుంచే అమ్మకానికి ఆస్తులు..

ఇక విశాలాక్షి, భర్త, కుమారులు కలిసి బ్యాంకు బోర్డు తిప్పేయడానికి ఆర్నెల్ల ముందునుంచే తమ పేరుతో ఉన్న ఆస్తులను అమ్మకానికి పెట్టేశారు. కాకినాడలో ఒక మార్ట్.. రామారావుపేట, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న నాలుగు చర, స్థిరాస్తులతో పాటు ఎనిమిది ఎకరాల భూమిని కూడా ఆమె విక్రయించినట్లుగా గుర్తించారు. అలాగే, విశాలాక్షి పేరుతో వివిధ జిల్లాల్లో ఉన్న మొత్తం 64 ఆస్తులనూ సీజ్ చేసేందుకు సీఐడీ రంగంలోకి దిగింది. సుమారు రూ.120 కోట్ల విలువైన ఆస్తులు అమ్మేసినట్లు తేలింది. వాటిలో కాకినాడ ఎస్ఈజెడ్‌లో 30 ఎకరాలు ఉంది. ఇలా కొనుగోలుచేసి తిరిగి అమ్మేసిన ఆస్తులను సీజ్ చేయడంపై సీఐడీ ప్రత్యేక దృష్టిపెట్టింది. ఈ ఆస్తులను కొనుగోలు చేసిన వారికి సీఐడీ నోటీసులు సిద్ధం చేస్తోంది. వారిపై చార్జిషీట్లు కూడా వేయనుంది.

సీఐడీ దూకుడుతో వారంతా బయటకు..

బ్యాంకు నుంచి రూ.120 కోట్లు వరకు రుణాలు తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా ఉన్న వారంతా ఇప్పుడు సీఐడీ దూకుడుతో బయటకొస్తున్నారు. నోటీసులు తీసుకుని 50 రోజులు దాటినా స్పందించని వారు సీఐడీ జోరుతో రుణాలు జమచేసేందుకు రుణగ్రహీతలు ముందుకొస్తున్నారు.

30శాతం తిరిగి చెల్లింపు?

ఇక డిపాజిటర్లకు తొలి విడతగా మొత్తం డిపాజిట్లలో 30 శాతం తిరిగి ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జూలై నెలాఖరుకల్లా బాధితులకు రూ.100 కోట్లు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం. ఇప్పటివరకు 3 కోట్లు వసూలయ్యాయి. డిపాజిటర్లలో 14వేల మంది రూ.లక్ష నుంచి రూ.4 లక్షలలోపు డిపాజిట్ చేసిన వారే. రూ.26 కోట్లు తిరిగి ఇచ్చేస్తే మూడొంతులు మంది బాధితులు జయలక్ష్మి కుంభకోణం నుంచి బయటపడతారు. మరోవైపు.. సివిల్, అండ్ క్రిమినల్ కేసుల ప్రకారం ముందుకెళ్లే అవకాశముండడంతో జూలై 10 నాటికి జమచేస్తామని రుణాలు తీసుకున్న వారు చెబుతున్నారు.

– గంగిరెడ్డి త్రినాథ్‌రావు, చైర్మన్, కాకినాడ జయలక్ష్మి సొసైటీ

పార్లమెంట్‌లో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలి

- వీఆర్‌పీఎస్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్

సాక్షి, న్యూఢిల్లీ: వాల్మీకులను విస్మరిస్తే ఢిల్లీలో ఆమరణ నిరాహారదీక్ష చేస్తానని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి (వీఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మద్దూరు సుభాష్ చంద్రబోస్ చెప్పారు. శుక్రవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించకుంటే ఢిల్లీలో ఆమరణ నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. జాతీయ స్థాయిలో వాల్మీకులందరినీ సమీకరించి ఢిల్లీ జంతర్ మంతర్ లో ఆందోళన చేస్తామని చెప్పారు. వీఆర్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఢిల్లీ రవీందర్ చౌదరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రాంభీం నాయుడు ,రాష్ట్ర ఉపాధ్యక్షులు కప్పట్రాళ్ళ మల్లికార్జున, సంఘం రాష్ట్ర నేతలు గోవర్ధన్, రామాంజనేయులు, అశోక్, ఢిల్లీ సుధీర్, మాలింగ తదితరులు పాల్గొన్నారు.

పోలవరానికి రూ.12,911 కోట్లు!

- బీజేపీ ఎంపీ జీ.వి.ఎల్. నరసింహారావు

సాక్షి, అమరావతి: పోలవరం తొలిదశ నిర్మాణం, డయాఫ్రం వాల్ మరమ్మతుల కోసం కేంద్ర ప్రభుత్వం త్వరలో రూ.12,911 కోట్లు ఇవ్వనుందని బీజేపీ ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు చెప్పారు. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోబోతోందని తెలిపారు. ఆయన శుక్రవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుపై ప్రధాని చాలా సానుకూలంగా ఉన్నారన్నారు. పోలవరంలో పూర్తిస్థాయి నీటినిల్వ చేసుకునేలా అవసరమైన నిధులు, అనుమతులు, అంతర్‌రాష్ట్ర వివాదాలను కేంద్రం పరిష్కరిస్తుందని చెప్పారు. కేంద్రం రూ.10,461 కోట్లు రెవెన్యూ గ్రాంట్‌గా రాష్ట్రానికి కేటాయించిందన్నారు. కేంద్రం నిధులు ఇస్తుంటే, ఎందుకిస్తున్నారని కొందరు అడుగుతున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితి ఏ రాష్ట్రంలోను చూడలేదని పేర్కొన్నారు.

గవర్నర్‌కు వినతిపత్రం: ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు శుక్రవారం సాయంత్రం గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వినతిపత్రం అందజేశారు. 2014 తర్వాత విశాఖలో భూకబ్జాలు, భూ కుంభకోణాలపై సిట్ నివేదికను బహిర్గతం చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు.

క్లుప్తంగా...

సూపర్ స్పెషాలిటీ ఫ్యాకల్టీకి రూ.30 వేల అలవెన్స్

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో పనిచేసే సూపర్ స్పెషాలిటీ ఫ్యాకల్టీకి నెలకు రూ.30,000 చొప్పున సూపర్ స్పెషాలిటీ అలవెన్స్ ఇవ్వడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. అలవెన్స్ చెల్లింపునకు అవసరమైన అదనపు బడ్జెట్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

అందరినీ కోటీశ్వరుల్ని చేస్తా

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు

సాక్షి, అమరావతి: తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో పేదలందరినీ కోటీశ్వరుల్ని చేస్తానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పేర్కొన్నారు. 'పూర్ టు రిచ్' కార్యక్రమంతో 2047 నాటికి రాష్ట్రంలో పేదలు లేకుండా అందర్నీ కోటీశ్వరుల్ని చేస్తానన్నారు. రాష్ట్రం విడిపోయి 9 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో క్యాష్‌వార్ జరగనుందన్నారు. ఇది పేదలకు, దోపిడీదారులకు మధ్య జరుగుతున్న యుద్ధమన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు దోచుకున్నదంతా ప్రజలకు అప్పజెప్పే బాధ్యత తమదేనన్నారు. మహానాడులో తాను ప్రకటించిన తొలి విడత మేనిఫెస్టో చూసి వైఎస్సార్‌సీపీకి భయం పట్టుకుందన్నారు. తమ మేనిఫెస్టో అంశాలను కాపీ కొట్టినట్లు సీఎం జగన్ అర్థం లేని విమర్శలు చేస్తున్నారన్నారు. పోలవరం, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లు ఇవ్వవచ్చన్నారు. టీడీపీ అధికారంలో ఉంటే 2020 జూన్‌కే పోలవరం పూర్తయ్యేదన్నారు. శివరామకృష్ణన్ కమిటీ సూచన మేరకు అన్ని ప్రాంతాలకు సమాన దూరంలో రాజధాని అమరావతికి రూపకల్పన చేశామని తెలిపారు. రాజధాని నిర్మాణం కొనసాగి ఉంటే ప్రభుత్వానికి సుమారు రూ.2 లక్షల కోట్ల ఆదాయం వచ్చేదన్నారు. రాష్ట్రంలో రోడ్లన్నీ అధ్వాన్నంగా తయారయ్యాయని విమర్శించారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదాను తెస్తానన్న సీఎం కేసుల మాఫీ కోసం దాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. జీతాలు అడిగితే ఉద్యోగులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యత టీడీపీ తీసుకుంటుందన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

- మంత్రి బొత్స సత్యనారాయణ
- పాలకొండలో శ్రీ విజయ ఆస్పత్రి ప్రారంభం


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స

పాలకొండ: రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో శుక్రవారం శ్రీ విజయ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో సైతం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలను ఉచితంగా అందిస్తోందని చెప్పారు. అనంతరం ఆస్పత్రిలోని పలు విభాగాలను విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పల్సస్ సంస్థల అధినేత గేదెల శ్రీనుబాబు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర

- అన్నవరంలో దర్శనంతో ప్రారంభం
- మొదటి విడతలో భీమవరం వరకు 11 నియోజకవర్గాల్లో పర్యటన

సాక్షి, అమరావతి: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఈ నెల 14 నుంచి వారాహి యాత్రను మొదలు పెడతారని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆ రోజు అన్నవరం సత్యనారాయణస్వామి దర్శనం చేసుకొని యాత్రకు శ్రీకారం చుడతారని వెల్లడించారు. అన్నవరం నుంచి భీమవరం వరకు మొదటి విడత యాత్ర ఉంటుందని చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం మనోహర్ మీడియాతో మాట్లాడారు. పొత్తుల్లో జనసేన పోటీ చేసే చోట మాత్రమే కాకుండా అన్ని నియోజకవర్గాల్లో ఈ పర్యటన కొనసాగుతుందన్నారు. అన్ని నియోజకవర్గాల్లో సమస్యలను తెలుసుకునేందుకు, ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకునేందుకు పవన్ ఈ యాత్ర చేపడుతున్నారని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రారంభించి పిఠాపురం, కాకినాడ, కాకినాడ రూరల్, ముమ్మిడివరం, అమలాపురం, పి.గన్నవరం, రాజోలు తర్వాత నరసాపురం, పాలకొల్లు, భీమవరం వరకు ఉంటుందని చెప్పారు. ఆ తర్వాత పశ్చిమ గోదావరి జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో యాత్ర రూట్ మ్యాప్‌ను స్థానిక పార్టీ నేతలతో చర్చించి ఖరారు చేస్తామన్నారు.


విజయనగరంలోని ధర్మపురి చిన్నవీధిలో వృద్ధురాలు రాములమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ పార్వతి


విజయవాడ కృష్ణలంక ప్రాంతంలో శివమ్మకు వృద్ధాప్య పింఛను అందిస్తున్న వార్డు వలంటీర్ నవ్య


ఒంగోలులోని భాగ్యనగర్‌లో నడవలేని స్థితిలో ఉన్న పూల వెంకట సుధీర్‌కు దివ్యాంగ పింఛను అందజేస్తున్న వలంటీర్ రేవతి


ఏలూరులో డి.జోషికి వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ అమ్మాజీ


తిరుపతిలోని కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలిరెడ్డిపాళెంనకు చెందిన వృద్ధుడు ఎం. పోతయ్యకు పింఛను అందజేస్తున్న వలంటీర్ అన్నపూర్ణ


కర్నూలు మండలం దిగువపాడులో దివ్యాంగురాలు చాకలి ఈదమ్మకు పింఛను ఇచ్చేందుకు ఐరిస్ నమోదు చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ఎండీ రఫీ

93.78 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తి

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 93.78 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయింది. జూన్ ఒకటో తేదీ నుంచి మొత్తం 63,14,192 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసేందుకు రూ.1,739.75 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం వరకు వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి 59,21,369 మందికి రూ.1,631.07 కోట్లను పంపిణీ చేశారు. మిగిలిన వారి కోసం మరో మూడు రోజులు కూడా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని సెర్ప్ అధికారులు వెల్లడించారు.


రాజమహేంద్రవరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనంతపల్లికి చెందిన కలిగినీడి అమ్మన్నకు పింఛను అందిస్తున్న వలంటీర్ పవిత్ర


నెల్లూరు నగరంలోని నల్లకాలువ ప్రాంతానికి చెందిన వృద్ధుడు ఈశ్వర్‌రెడ్డికి ఆస్పత్రిలో పింఛను అందజేస్తున్న వలంటీర్ సుకన్య

బాబు కళ్లతో చూశారా రామోజీ?

ఆర్బీకేల సేవలను దేశమంతా ప్రశంసిస్తుంటే 'ఈనాడు' విష ప్రచారం



ఏ విధంగానూ ఈ ప్రభుత్వానికి మంచి పేరు రాకూడదు.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాగా పని చేస్తున్నారని ఎవరూ చెప్పకూడదు.. ప్రభుత్వ పథకాలు బాగున్నాయని ఇతర రాష్ట్రాల వారెవరూ ప్రశంసించకూడదు.. ప్రభుత్వ సేవలు భేష్.. అని ఎవరైనా అన్నారంటే చాలు ఈనాడు రామోజీరావుకు పూనకం వస్తుంది. తన ఆత్మీయుడు చంద్రబాబు ఎప్పుడైతే సీఎం కుర్చీ నుంచి దిగిపోయారో అప్పటి నుంచి ఈ జాడ్యం మొదలైంది. రోజూ పనిగట్టుకుని ప్రభుత్వంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారు. చంద్రుడు ఈరోజు చక్కగా ఉన్నాడని చూపిస్తే.. వేలును చూశాడట ఓ మూర్ఖుడు.. అన్నట్లుంది రామోజీ తీరు. రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాల గురించి దేశమంతా చర్చించుకుంటున్న ఈవేళ రామోజీకి కడుపు మండిపోతోంది. తమ బాబుకు దక్కని ఈ ఖ్యాతి మరెవరికీ దక్కరాదంటూ తప్పుడు రాతలతో ప్రజలను మభ్యపెట్టేందుకు నిస్సిగ్గుగా తెగించారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో రైతుల పరిస్థితి ఏమిటో మీకు తెలియదా రామోజీ? విత్తనాల కోసం రైతులు ఒక రోజు ముందుగానే వెళ్లి క్యూ లో నిలుచునే పరిస్థితి మరచిపోయారా? ఓసారి లైబ్రరీలోకి వెళ్లి నాటి పత్రికలు తిరగేయండి.. వాస్తవం మీ కళ్లకే కనిపిస్తుంది. అవునులే.. ఇప్పటికే బుద్ధి మందగించిన మీకు కంటి చూపు కూడా తగ్గిపోయి ఉంటుంది కదా! మీ సహాయకుడు ఎవరినైనా వెంటబెట్టుకుని వెళ్లి.. అతనితో చదివించి వినండి. రాష్ట్రంలో 10,778 ఆర్బీకేలు ఏర్పడటమనేదే ఒక చరిత్ర. సొంత భవనంలోనో.. అద్దె భవనంలోనో అవన్నీ కొనసాగుతుండటం మరో చరిత్ర. ప్రతి ఆర్బీకేకు ఒక వలంటీర్‌ను అనుసంధానం చేయడం ఇంకో చరిత్ర. రామోజీ.. ఇవన్నీ మీరు స్వయంగా చూసి, నిర్ధారించుకోవడానికి రాష్ట్రంలో ఏ ఊరికి వెళ్తారో మీ ఇష్టం. ఈ సాహసం మీ వల్ల అవుతుందా రామోజీ?

ఆర్బీకేల ద్వారా విత్తన విక్రయాలు (టన్నుల్లో)

సంవత్సరం	ఖరీఫ్	రబీ	రైతులు (లక్షల్లో)
2019-20	7,20,719	3,79,426	17.36
2020-21	6,99,179	2,28,953	17
2021-22	6,16,806	3,17,673	16.59
2022-23	5,63,471	1,77,291	12.55

ఆర్బీకేల ద్వారా ఎరువుల విక్రయాలు

సంవత్సరం	అమ్మకం (లక్షల టన్నుల్లో)	విలువ (రూ.కోట్లలో)	రైతులు (లక్షల్లో)
2020-21	1.07	99.88	2.55
2021-22	3.68	379.22	10.03
2022-23	3.94	473.92	10.89
మొత్తం	8.69	953.02	23.47

ఆరోపణ : సిబ్బంది లేకుండా సేవలా?

వాస్తవం : రెండు విడతల్లో 6,246 వ్యవసాయ, 4,655 పశు సంవర్ధక, 2,356 ఉద్యాన, 731 మత్స్య, 377 పట్టు సహాయకులు పని చేస్తున్నారు. వీరే కాకుండా అనుభవజ్ఞులైన బహుళార్థ, వ్యవసాయ విస్తరణ అధికారులతో పాటు గోపాల మిత్రలను నియమించి రైతులకు ఎలాంటి ఆటంకం లేకుండా సేవలందిస్తున్నారు. ప్రతి ఆర్బీకేకు ఓ వలంటీర్‌ను అనుసంధానం చేశారు. ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసేందుకు చర్యలు చేపట్టారు.

సాక్షి, అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ స్థాయిలో ఏర్పాటైన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) సాగు ఉత్పాదకాలను రైతుల ముంగిటకే అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. అనతి కాలంలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖుల ప్రశంసలందుకున్నాయి. ఆర్బీకే సాంకేతికత కోసం దేశ, విదేశాలు పోటీ పడుతుంటే ఓర్వలేని 'ఈనాడు'.. 'అద్దెకు దిక్కులేని ఆర్బీకేలు.. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు దొరకని దుస్థితి' అంటూ శుక్రవారం ఓ తప్పుడు కథనాన్ని వండివార్చింది. గతంలో అదును దాటక ముందు విత్తనాల కోసం, విత్తుకున్న తర్వాత ఎరువుల కోసం సన్న, చిన్నకారు రైతులు పడరాని పాట్లు పడేవారు. ఎండనక, వాననక, పగలనకా, రేయనకా నిద్రాహారాలు మాని సొసైటీల వద్ద పడిగాపులు పడితే కాసిన్ని విత్తన గింజలు కూడా దక్కేవి కావు. ప్రైవేటు డీలర్లు అంటగట్టే అవసరం లేని పురుగుల మందులను కొంటే తప్ప ఎరువులు దొరకడం గగనంగా ఉండేది. ఎండలు తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోవడం, వడగాడ్పుల బారినపడి ఏటా పదుల సంఖ్యలో రైతులు మృత్యువాత పడిన సందర్భాలు కోకొల్లలు. నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులతో ఆశించిన దిగుబడులు రాక అప్పుల ఊబిలో కూరుకు పోయేవారు. ఈ వాస్తవాలన్నింటినీ మరిచి ఈనాడు ప్రస్తావించిన అంశాల్లో నిజానిజాలు ఇలా ఉన్నాయి.

ఆరోపణ : జాడలేని విత్తనాలు

వాస్తవం : సీజన్‌కు ముందుగానే సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులను ఆర్బీకేల ద్వారా రైతుల ముంగిటకు అందిస్తున్నారు. సాగు వేళ అన్ని కంపెనీలకు చెందిన పురుగుల మందులను సైతం అందుబాటులో ఉంచుతున్నారు. ఆర్బీకేల్లోని కియోస్కుల్లో బుక్ చేసుకున్న 24 గంటల్లోపే వారి ముంగిట అందిస్తున్నారు. ఇలా ఈ మూడేళ్లలో 63.50 లక్షల మంది రైతులకు 37.04 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. వరి, అపరాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, పచ్చిరొట్ట విత్తనాలే కాదు పత్తి, మిరప వంటి నాన్ సబ్సిడీ విత్తనాలను సైతం ఆర్బీకేల ద్వారా అందిస్తున్నారు. 2023-24లో రూ.222 కోట్ల విలువైన రాయితీ విత్తనాలను పంపిణీ చేయాలని ప్రతిపాదించగా, ఇప్పటి వరకు 3 లక్షల మంది రైతులు 1.90 లక్షల క్వింటాళ్ల విత్తనాల కోసం నమోదు చేసుకున్నారు. ఏపీ సీడ్స్ ఆర్బీకేల్లో 1.94 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచగా, ఇప్పటికే 100 శాతం పచ్చిరొట్ట విత్తనాలు (99 వేల క్వింటాళ్లు) 40 శాతం సబ్సిడీపై పంపిణీ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 90 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు, రాయలసీమ జిల్లాల్లో 40 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. మిగిలిన విత్తనాల కోసం ఆర్బీకేల్లో జోరుగా రిజిస్ట్రేషన్లు సైతం జరుగుతున్నాయి.

ఆరోపణ : అరకొరగా ఎరువులు

వాస్తవం : ఆర్బీకేలతో పాటు సొసైటీలు, ప్రైవేట్ వ్యాపారుల ద్వారా కూడా పంట కాలానికి అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచారు. మూడేళ్లలో ఆర్బీకేల ద్వారా రూ.953.53 కోట్ల విలువైన 8.69 లక్షల టన్నుల ఎరువులను 23.47 లక్షల మంది రైతులకు పంపిణీ చేశారు. 2023-24లో 10.50 లక్షల టన్నుల ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆర్బీకేల్లో 54,525 టన్నులు, సొసైటీల్లో 20,789 టన్నులు, ఏపీ మార్క్‌ఫెడ్ గోదాముల్లో 69 వేల టన్నులు నిల్వ చేశారు. 3,979 సచివాలయ గోదాములను అగ్రి ఇన్‌పుట్ స్టోరేజీ పాయింట్‌లుగా గుర్తించి గ్రామ స్థాయిలో ఎరువుల నిల్వకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో మండల, బ్లాక్ స్థాయిలో విత్తన పంపిణీ జరిగేది. ఎమ్మార్పీకి మించి అమ్మేవారు. పైగా మండల, జిల్లా కేంద్రాల నుంచి తరలించు కోవడానికి రవాణా చార్జీలు తడిసి మోపెడయ్యేవి. నేడు ఎమ్మార్పీకే తమ ఇంటి ముంగిటే అందిస్తున్నారు. బ్యాగ్‌పై రూ.20 మేర రవాణా ఆదా అవుతుంది. ఈ విధంగా 3 ఏళ్లలో రూ.35 కోట్లకు పైగా రైతులకు ఆదా అయ్యింది. సర్టిఫై చేసిన ఎరువుల పంపిణీ వల్ల నకిలీ ఎరువులు, బ్లాక్ మార్కెటింగ్‌కు పూర్తిగా చెక్ పడింది. మరోవైపు ఈ మూడేళ్లలో 1,50,822 మంది రైతులకు రూ.14 కోట్ల విలువైన 1.36 లక్షల లీటర్ల పురుగుల మందులను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేశారు. వచ్చే సీజన్ కోసం సర్టిఫై చేసిన సస్య రక్షణ మందులు, సూక్ష్మ పోషకాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో విత్తనాల కోసం ఎక్కడా క్యూలైన్ అనేదే కన్పించడం లేదు. విత్తనం దొరుకుతుందో లేదోననే ఆందోళన లేదు. నకిలీల ఊసే లేదు.

ఆరోపణ : ఆర్బీకేల అద్దెలకు దిక్కులేదు..

వాస్తవం : రాష్ట్రంలో మొత్తం 10,778 ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. వీటిలో ప్రభుత్వ భవనాల కొరత కారణంగా 3,830 ఆర్బీకేలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి అద్దె రూపంలో మూడేళ్లలో ప్రభుత్వం రూ.51.09 కోట్లు విడుదల చేసింది. 2023-24లో ఆర్బీకేలతోపాటు గోదాముల అద్దెల నిమిత్తం యాజమాన్యాలకు బకాయిలు లేకుండా ప్రతి 3 నెలలకోసారి చెల్లించేలా ఏర్పాట్లు చేశారు.

ఆరోపణ : అధికార పార్టీ వారికే యంత్ర పరికరాలు

వాస్తవం : సన్న, చిన్న కారు రైతులకు గ్రామ స్థాయిలో వారికి కావాల్సిన యంత్ర పరికరాలను అద్దె ప్రాతిపదికన అందుబాటులో ఉంచాలన్న సంకల్పంతో వైఎస్సార్ యంత్ర సేవా పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద ఇప్పటికే 6,525 ఆర్బీకే, 391 క్లస్టర్ స్థాయి కేంద్రాలను ఏర్పాటు చేయగా, తాజాగా మరో 3,919 ఆర్బీకే, 100 క్లస్టర్ స్థాయి సీహెచ్‌సీలను శుక్రవారం సీఎం ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో 40 శాతం సబ్సిడీపై రూ.1052.16 కోట్ల విలువైన 6,362 ట్రాక్టర్లు, 491 కంబైన్డ్ హార్వెస్టర్లు, 36,153 ఇతర వ్యవసాయ పనిముట్లు సమకూర్చారు. గతంలో మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకు రైతు రథాలు పంపిణీ చేసేవారు. పైగా ఎమ్మార్పీ కంటే కనీసం 10-30 శాతం అధికంగా కోట్ చేసి.. ఆ మేరకు జేబులు నింపుకునే వారు. ప్రస్తుతం నచ్చిన కంపెనీల నుంచి నేరుగా కొనుగోలు చేసే బాధ్యతను రైతు గ్రూపులకే అప్పగించారు.

ఆరోపణ : కియోస్క్‌లు పని చేయడం లేదు

వాస్తవం : తొలి విడతలో 9,484 ఆర్బీకేల్లో కియోస్కులు ఏర్పాటు చేయగా, ఇటీవల మరో 1,294 ఆర్బీకేల్లో కొత్తగా సరఫరా చేశారు. సమస్యల పరిష్కారం కోసం డాష్ బోర్డు ఏర్పాటు చేశారు. కియోస్కులకు ఇంటర్నెట్ కోసం రూ.19.34 కోట్లు విడుదల చేశారు. బ్యాంకింగ్ సేవలను గ్రామ స్థాయిలో అందించేందుకు వివిధ బ్యాంకుల్లో పని చేస్తున్న 9,277 మంది బ్యాంకింగ్ కరస్పాండెంట్(బీసీ)లను ఆర్బీకేలతో అనుసంధానం చేశారు. ఇండియన్ పోస్టల్ బ్యాంక్ సహకారంతో మిగిలిన ఆర్బీకేల్లోనూ వీరి నియామకానికి చర్యలు చేపట్టారు.

ఆరోపణ : అనుబంధ రంగాలకు అరకొర సేవలు

వాస్తవం : ఆర్బీకేల ద్వారా మూడేళ్లలో 2 కోట్ల సేవలు అందించారు. పశుసంవర్ధక శాఖ ఆర్బీకేల ద్వారా పశుపోషకులకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తోంది. ఇప్పటి వరకు రూ.106.48 కోట్ల విలువైన 67,395 మెట్రిక్ టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణా 60 శాతం సబ్సిడీ (రూ.63.89 కోట్లు)పై పంపిణీ చేశారు. రూ.49.66 కోట్ల విలువైన 5397.95 మెట్రిక్ టన్నుల పశుగ్రాస విత్తనాలను 75 శాతం సబ్సిడీ (రూ. 37.24 కోట్లు)పై అందించారు. రూ.115.18 కోట్ల విలువైన 3,907 గడ్డి కత్తిరించే యంత్రాలను 40 శాతం సబ్సిడీ (రూ.46.07 కోట్లు) పై పంపిణీ చేశారు. వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల ద్వారా లబ్ధి పొందిన వారికి జగనన్న పాల వెల్లువ పథకం కింద ఇప్పటి వరకు 3.72 లక్షల పశువులు, జగనన్న జీవ క్రాంతి పథకం కింద 1.34 లక్షల మంది గొర్రెలు, మేకలు పంపిణీ చేశారు. పశు పోషకులకు 45,652 పశు కిసాన్ క్రెడిట్ కార్డులను జారీ చేశారు. పశువిజ్ఞాన బడుల ద్వారా 14,83,643 మందికి మెళకువలపై అవగాహన కల్పించారు. ఆర్బీకేల ద్వారా ఆక్వా సాగును ఈ ఫిష్ బుకింగ్ చేస్తూ గిట్టుబాటు ధర, బీమా సదుపాయం కల్పిస్తున్నారు. ఆక్వా రైతులు మత్స్యకారులకు సర్టిఫై చేసిన చేపలు, రొయ్యల ఫీడ్, చేపల సీడ్ పంపిణీ చేస్తున్నారు. ఫిషింగ్ బోట్స్ నమోదు, లైసెన్సులు జారీ చేస్తున్నారు. అప్సడా చట్టం ద్వారా ఆక్వాసాగు, ఆక్వా వ్యాపార కార్యకలాపాలు, ఫిష్ ఫీడ్, రొయ్యల సీడ్‌ల కోసం లైసెన్సు/ఎండార్స్‌మెంట్లు జారీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 36,779 లైసెన్సులు జారీ చేశారు. 16,489 నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ మత్స్యసాగు బడి ద్వారా 17,945 మందికి అవగాహన కల్పించారు. అదేరీతిలో ఉద్యాన, పట్టు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ఆర్బీకేల ద్వారా అందిస్తున్నారు. ఈ-క్రాప్, ఈ-ఫిష్ నమోదుతోపాటు పంట నష్ట పరిహారం, ఇతర పథకాలు అందిస్తున్నారు. ఇన్ని సేవలు అందిస్తున్న ఆర్బీకేల స్ఫూర్తితోనే జాతీయ స్థాయిలో పీఎం సమృద్ధి కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. యూఎన్ చాంపియన్ అవార్డుకు మన రాష్ట్రం నామినేట్ అయింది. సాంకేతికత కోసం రాష్ట్ర ప్రభుత్వంతో ఇథియోపియా ఒప్పందం కుదుర్చుకుంది.

కోడెలకు అన్యాయం చేస్తున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

తీవ్రంగా అవమానిస్తున్నారు. ఆయన పేరును చెరిపివేయాలని మా పార్టీలోని కొందరు కుట్ర పన్నుతున్నారు' అని శివరాం ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ లాంఛనాలను వద్దన్నారు


'గత నాలుగేళ్లుగా చంద్రబాబుతో మాట్లాడాలని ఎంత ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదు. టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, అచ్చెన్నాయుడు, చంద్రబాబు వ్యక్తిగత సహాయకుల ద్వారా ఎన్నో ప్రయత్నాలు చేశా. మహానాడులో రూ.5 లక్షలు విరాళం ఇచ్చిన వారితో చంద్రబాబు కలసి భోజనం చేశారు. మా తండ్రి, మా కుటుంబం పార్టీ కోసం అహర్నిశలు కష్టపడినా మాకు మాత్రం అవకాశం ఇవ్వలేదు. పార్టీ కోసం ప్రాణాలర్పించిన నాయకుడి కుటుంబానికి చంద్రబాబు 5 నిమిషాలు సమయం ఇవ్వడంలేదు. డబ్బే ప్రామాణికమైతే ఆస్తులు అమ్మి అయినా ఇస్తాం. కోడెల త్యాగానికి వెల కడితే ఆమేరకు చెల్లిస్తాం. మా తండ్రి మరణం తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేస్తామని చెప్పింది. టీడీపీ అధిష్టానం వద్దని చెప్పడంతో మేము ఆ లాంఛనాలను తిరస్కరించాం. కన్న కొడుకుగా నా తండ్రికి దక్కాల్సిన గౌరవాన్ని వదులుకున్నందుకు బాధ కలిగింది. అయినా టీడీపీ కోసం ఆ బాధనూ భరించాం. ఇన్ని చేసినా చంద్రబాబు, లోకేశ్ మా కుటుంబాన్ని కావాలనే దూరం చేస్తున్నారు' అని చెప్పారు. 'ఎన్నో కష్టనష్టాలకోర్చి, ఎందరినో కలుపుకొని బసవతారకం ఆస్పత్రి నిర్మించిన కోడెల చనిపోతే.. ఆయన స్థానంలో ట్రస్ట్ మెంబర్‌గా మా తల్లిని నియమించలేదు. ఆ స్థానంలో చంద్రబాబు కోడలు బ్రాహ్మణిని తెచ్చారు. ఇది ట్రస్ట్ నిబంధనలకు విరుద్ధం. రాష్ట్రంలో ఎన్నో స్థానాల్లో నాయకులు చనిపోతే వారి వారసులకు సీట్లు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. అదే పాలసీ సత్తెనపల్లిలో ఎందుకు పాటించరు? మా అమ్మను కనీసం ఫోన్ చేసి ఓదార్చలేదు. కోడెల విగ్రహాల ఏర్పాటును కూడా సొంత పార్టీ నేతలే అడ్డుకుంటున్నారు. ఇదేమి పార్టీ' అని అన్నారు.

పోటీ చేస్తా.. గెలుస్తా

'టీడీపీ, చంద్రబాబు, కోడెల అంటేనే పడని వ్యక్తి కన్నా లక్ష్మీనారాయణ. అక్రమాస్తులు కలిగి ఉన్నారని చంద్రబాబుపై కన్నా కేసులు వేశారు. చంద్రబాబును బూతులు తిట్టారు. అవకాశాల కోసం పార్టీలు మారిన వ్యక్తి కన్నా. అటువంటి వ్యక్తిని సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్జిగా నియమిస్తారా? ఇది చాలా బాధించింది. పార్టీ శ్రేణులు కూడా హర్షించడంలేదు. వచ్చే ఎన్నికల్లో సత్తెనపల్లి నుంచి పోటీ చేసి తీరుతా. నేనే గెలుస్తా. కోడెల కుటుంబాన్ని నమ్ముకున్న కార్యకర్తలు, అభిమానులకు అండగా నిలుస్తా. నాకు పదవులు, అధికారం ముఖ్యం కాదు. కోడెల ఆశయాల సాధనే ప్రధానం. అందుకోసమే పోరాడుతా' అని శివరాం చెప్పారు.

ఎవరికి పడితే వారికి టికెట్లా?

టీడీపీలో తాజా పరిణామాలపై ప్రత్తిపాటి ఆగ్రహం



చిలకలూరిపేట : పల్నాడు జిల్లా టీడీపీలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో ఫౌండేషన్లు, ట్రస్ట్‌ల పేర్లతో వచ్చే నేతలు చేసేది కేవలం హడావుడే అని విమర్శించారు. ఇలాంటి వారిని ఎందుకు ప్రోత్సహిస్తున్నారంటూ అధిష్టానాన్ని ప్రశ్నించారు. 'అక్కడక్కడా రూ.10 వేలు... రూ.15 వేలు పంచిన వారికి టికెట్లు ఇచ్చేస్తారా.. ఎవరికి పడితే వారికి టికెట్లు ఇస్తూపోతే ఇన్నాళ్లూ కష్టపడిన వారి సంగతి ఏమిటి.. ట్రస్ట్ పేర్లతో వచ్చే నేతలు పార్టీ కోసం ఏమి చేయగలరు.. ఇలాంటి వారు వస్తారు.. పోతారు.. భాష్యం ప్రవీణ్‌కు చిలకలూరిపేటలో ఓటే లేదు' అని ధ్వజమెత్తారు. సత్తెనపల్లిలో కోడెల శివరాంను కాదని కన్నా లక్ష్మీనారాయణను ఇన్‌చార్జ్‌గా ప్రకటించడం తగదని వ్యాఖ్యానించారు. కోడెల కుటుంబానికి న్యాయం చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

రాష్ట్ర విభజన శుభాకాంక్షలా? : పేర్ని

సాక్షి, అమరావతి: రాష్ట్రం విడిపోయినందుకు శుభాకాంక్షలు చెబుతున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు మైండ్ ఉందా? చెడిపోయిందా? అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అంతటితో ఆగకుండా సీఎం జగన్ శుభాకాంక్షలు చెప్పలేదంటూ నిందించడం ఏమిటని నిలదీశారు. చంద్రబాబు పూర్తిగా గతి తప్పారని దుయ్యబట్టారు. బాబు అధికారంలో ఉండగా రాష్ట్ర విభజన తేదీ రోజు నల్ల బ్యాడ్జీలతో డ్రామాలాడారని గుర్తు చేశారు. రాష్ట్రం విడగొట్టారంటూ సోనియా, రాహుల్‌ను తిట్టిన చంద్రబాబు బీజేపీని మాత్రం పల్లెత్తు మాట అనేందుకు సాహసించలేదన్నారు. పేర్ని నాని శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్న చంద్రబాబు ఏ రాష్ట్ర పౌరుడో చెప్పాలని ప్రశ్నించారు.

- జూన్ 2న రాష్ట్రం ఏర్పడటం ఏమిటి? ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ నవంబరు 1వ తేదీనే అవతరణ దినోత్సవంగా జరుపుకొంటారు. చంద్రబాబు ముందుచూపుతో రెండు రాష్ట్రాల ప్రజలు విడిపోయి బాగుపడాలని చెప్పారట. అలాంటప్పుడు రాష్ట్ర విభజనకు నిరసనగా బెజవాడలో టీడీపీ ఎందుకు ఆందోళన చేసింది? అమరావతి పేరుతో చంద్రబాబు తన వంది మాగధులకే సంపదను సృష్టించి ఇచ్చారు.
- రాష్ట్రంలో పేదలందరినీ 2047 నాటికి ధనికులను చేస్తానని చంద్రబాబు అంటున్నారు. అప్పటికి ఆయన వయసు ఎంత ఉంటుంది? అధికారం కోల్పోయిన ప్రతిసారీ మళ్లీ అవకాశమిస్తే 20 ఏళ్లలో మార్చేస్తానని చెప్పడం ఆయనకు అలవాటు. గత ప్రభుత్వ హయాంలోనే ఎక్కువ అప్పులు చేశారు. చంద్రబాబు ఒక్క రోజులోనే రూ.5 వేల కోట్ల అప్పులు చేశారు. మేం నాలుగేళ్లలో చేసిన అప్పు రూ.1.82 లక్షల కోట్లు మాత్రమే. అదే సమయంలో సీఎం జగన్ డీబీటీ ద్వారా రూ.2.11 లక్షల కోట్లు నేరుగా పేదలకు అందచేశారు.
- హైదరాబాద్‌ను తానే అభివృద్ధిని చేశానంటూ చంద్రబాబు ఇంకా మానసిక వైకల్యంతో ఉన్నారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ పార్క్ గురించి ఆలోచించి లేఅవుట్‌ను ఆమోదించి శంకుస్థాపన చేసింది నాటి సీఎం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి. వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యే వరకూ హైటెక్ సిటీకి ఒక రోడ్డుందా? వైఎస్సార్ వచ్చాకే హైటెక్ సిటీలో మౌలిక వసతులు కల్పించి 4 లైన్ల రోడ్లు, పీవీ నరసింహారావు ఫ్లైఓవర్ నిర్మించారు. ఎయిర్ పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన, ప్రారంభోత్సవం వైఎస్సార్ చేశారు. ఐటీ పార్క్ 2, 3 దశలను కూడా అభివృద్ధి చేసింది వైఎస్సారే.
- జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ షూటింగ్‌లు లేకనే వారాహిపై చంద్రవరం యాత్ర చేపడుతున్నారు. సీపీఐ నారాయణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చంద్రబాబు అనే తరహాలో వ్యవహరిస్తున్నారు.

“ ఆసక్త భావము లేకపోవడము; పుత్రులు, భార్య, గృహము మొదలైన వాటితో తాదాత్మ్యము చెందకపోవడము, ఇంద్రియ విషయాలలో అహంకారం లేకపోవడము... జ్ఞానము. దానికి భిన్నమైనది అంతా అజ్ఞానము.
– భగవద్గీత

సాక్షి
శనివారం, 3 జూన్ 2023

గండం గట్టెక్కిన అమెరికా

ఎట్టకేలకు ఒక పెను సంక్షోభం సమసిపోయింది. కరోనా మహమ్మారి, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ప్రపంచాన్ని మింగేసే మూడో ముప్పుగా ఆర్థిక నిపుణులు అభివర్ణించిన అమెరికా గరిష్ఠ రుణపరిమితి (డెబిట్ సీలింగ్) సంక్షోభంపై పాలక డెమాక్రాటిక్ పార్టీ, విపక్ష రిపబ్లికన్ పార్టీల మధ్య చివరి నిమిషంలో కుదిరిన అవగాహన పర్యవసానంగా కథ సుఖాంతమైంది. నిజానికి కరోనా మహమ్మారి, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఊహించని రీతిలో వచ్చిపడ్డాయి. కానీ అమెరికా సంక్షోభం అలా కాదు. అది పేలడానికి సిద్ధంగా ఉన్న టైమ్ బాంబు మాదిరి కొన్ని నెలలుగా ప్రపంచాన్ని తీవ్రంగా భయపెడుతోంది. అమెరికా ఆర్థిక వ్యవస్థతో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలన్నీ ముడిపడి ఉండటమే ఇందుకు కారణం. ప్రపంచంలో అత్యంత సంపన్న దేశంగా, అగ్రరాజ్యంగా ఉన్న అమెరికా తన ఆర్థిక వ్యవస్థను దశాబ్దాలుగా క్రమశిక్షణతో నడపలేకపోవటమే ఈ సమస్యకు మూలం. తొలిసారి 1917లో గరిష్ఠ రుణ పరిమితి పెంపునకు అమెరికన్ కాంగ్రెస్ అనుమతించగా, ఆ తర్వాత 1939లో, 1941లో రుణ సేకరణకు ప్రత్యేక చట్టాలు చేయాల్సివచ్చింది. ఇక అది రివాజుగా మారింది. ఆ తర్వాత 2011 వరకూ 78సార్లు గరిష్ఠ రుణ పరిమితికి అమెరికన్ కాంగ్రెస్ ఆమోద ముద్ర వేయాల్సివచ్చింది. అమెరికా ప్రస్తుత గరిష్ఠ రుణ పరిమితి 31.4 లక్షల కోట్ల డాలర్లు కాగా, దాన్ని మరింత పెంచేందుకు ప్రతినిధుల సభ, సెనేట్ తాజాగా అంగీకరించాయి. రుణ పరిమితిని పెంచే బదులు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకోవాలంటూ మొన్న ఏప్రిల్‌లో రిపబ్లికన్ పార్టీ పట్టుబట్టడంతో జో బైడెన్ ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో పడింది. రిపబ్లికన్‌ల ఆధిక్యత ఉన్న ప్రతినిధుల సభలో బైడెన్ సర్కార్ ప్రతిపాదించిన బడ్జెట్‌కు 4.8 లక్షల కోట్ల మేర కోత పెట్టే తీర్మానం ఏప్రిల్ నెలాఖరున ఆమోదం పొందింది. ఆ కోత తీర్మానం ద్వారా హరిత ఇంధన రంగ పెట్టుబడులకు ప్రభుత్వం ఇవ్వదల్చుకున్న పన్ను మినహాయింపులకూ, విద్యార్థుల రుణాల మాఫీకీ రిపబ్లికన్‌లు మోకాలడ్డారు. ఈ చర్య అమెరికా పౌరులపైనా, దేశ ఆర్థిక వ్యవస్థపైనా తుపాకి గురిపెట్టడంతో సమానమని అమెరికా ఖజానా మంత్రి జానెట్ యెలెన్ మండిపడ్డారు. ఆ మాటెలావున్నా ప్రతినిధుల సభ, సెనేట్‌ల ఆమోదం లభించకపోతే ఆపద్ధర్మంగా బైడెన్ 14వ రాజ్యాంగ సవరణ ద్వారా తనకు లభించే విశేషాధికారాలతో ప్రత్యేక చర్య తీసుకునే వీలుంటుంది. కానీ అది సంక్షోభాన్ని తాత్కాలికంగా ఒకటి రెండు నెలలు వాయిదా వేయగలదే తప్ప నివారించలేదు. ఫైనాన్షియల్ మార్కెట్లలో అనిశ్చితిని పోగొట్టలేదు. అందుకే సమస్యకు పరిష్కారం సాధ్యమా కాదా అన్న సంశయంలో ప్రపంచం పడిపోయింది. ఇరు పార్టీల మధ్యా ఒప్పందం కుదరకపోతే అమెరికా తన రుణాలను చెల్లించలేని స్థితిలో పడేది. టీచర్లు, పబ్లిక్ రంగ సంస్థల కార్మికులతో సహా లక్షలాది మంది ఉద్యోగుల జీతాలు నిలిపేయాల్సివచ్చేది. పింఛన్లు, అనేకానేక సాంఘిక సంక్షేమ పథకాలు కూడా ఆపాల్సివచ్చేది. కేవలం తాను చెల్లించక తప్పని రుణాలకూ, వడ్డీ చెల్లింపులకూ ప్రాధాన్యం ఇవ్వాల్సివచ్చేది. దాని సెక్యూరిటీలు పల్టీలు కొట్టేవి. సారాంశంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ దివాలా తీసేది. ఒక అంచనా ప్రకారం స్వల్పకాల దివాలా అయినా కనీసం 5 లక్షల మంది ఉద్యోగులకు అది ముప్పుగా పరిణమించేది. మరింత కాలం కొనసాగితే అనేకానేక వ్యాపారాలూ మూతబడి 83 లక్షల ఉద్యోగాలు ఆవిరయ్యేవి. అంతేకాదు, అది కార్చిచ్చులా వ్యాపించి పలు దేశాల ఆర్థిక వ్యవస్థలను కుప్పకూల్చేది. ఇరుపక్షాలూ పరిణతి ప్రదర్శించటం వల్ల ప్రస్తుతానికైతే అంతా సర్దుకుంది. కానీ ముమ్ముందు ఇదంతా పునరావృతం కాకమానదని గత చరిత్ర గమనిస్తే అర్థమవుతుంది.

అసలే ప్రపంచం ఆర్థిక మాంద్యం అంచుల్లో ఉంది. కరోనా మహమ్మారి లక్షలాదిమంది ప్రాణాలను బలితీసుకోవటంతోపాటు మహా మహా ఆర్థిక వ్యవస్థలనే తలకిందులు చేసింది. దాన్నుంచి బయటపడటం కోసం ప్రయత్నాలు సాగుతుండగానే రష్యా అధ్యక్షుడు పుతిన్ పొరుగునున్న చిన్న దేశం ఉక్రెయిన్‌పై దురాక్రమణకు దిగారు. కొన్ని నెలల్లో సమసిపోతుందనుకున్న ఆ దురాక్రమణ యుద్ధం ఏణ్ణర్థం నుంచి ఎడతెగకుండా సాగుతోంది. ఇదే అదునుగా రష్యాకు కళ్లెం వేసేందుకు అమెరికా యూరోప్ దేశాలన్నిటినీ ఏకం చేసి ఉక్రెయిన్‌కు సైనికంగా, ఆర్థికంగా అండదండలందిస్తోంది. అదే సమయంలో రష్యాపై ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగించింది. తమ సమస్త అవసరాలకూ రష్యాపై ఆధారపడక తప్పని యూరోప్ దేశాలు ఈ ఆంక్షల పర్యవసానంగా ఒడిదుడుకుల్లో పడ్డాయి. జర్మనీ ఆర్థిక మాంద్యంలో పడింది. ఈలోగా గోరుచుట్టుపై రోకటి పోటులా ఈ రుణ గరిష్ఠ పరిమితి సంక్షోభం వచ్చిపడింది.

తన శక్తిసామర్థ్యాలను తక్కువ అంచనా వేస్తున్నవారికి రిపబ్లికన్‌లతో ఒప్పందం ద్వారా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి షాక్ ఇచ్చారు. రిపబ్లికన్‌లకు చెందిన ప్రతినిధుల సభ స్పీకర్ మెకార్తీ తన పార్టీలోని అత్యుత్సాహులను కట్టడి చేయగలిగారు. అయితే అమెరికా డాలర్‌తో, అక్కడి ఫైనాన్షియల్ మార్కెట్లతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ముడిపడివున్న సంగతిని ఆ దేశం మరువకూడదు. ప్రపంచంలో రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనాకు విశ్వసనీయత లేకపోవటంవల్ల తప్ప ఇందులో తన ప్రయోజకత్వం ఏమీ లేదని అది గుర్తించాలి. తాజా ఒప్పందం పర్యవసానంగా 2025 జనవరి వరకూ గండం గట్టెక్కినట్టే. ఆ తర్వాతైనా సమస్యలు తప్పవు. ఇప్పటికైనా అమెరికా సొంతింటిని చక్కదిద్దుకునే చర్యలు మొదలెట్టాలి. హద్దూ ఆపూలేని వ్యయానికీ, పన్నులకూ కళ్లెం వేసి హేతుబద్ధ విధానాలను రూపొందించుకోవాలి.

స్థిరమైన నిధులతోనే శాస్త్రీయ ప్రగతి

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

సాంకేతిక పరిజ్ఞాన రంగంలో సూపర్ పవర్‌గా ఎదగాలన్న లక్ష్యం అందుకోవాలంటే ఏ దేశమైనా తగినన్ని నిధులు, స్థిరంగా అందుబాటులో ఉంచాలి. మౌలిక పరిశోధనలపైనా దృష్టి పెట్టాలి. కోవిడ్–19 టీకా, కో–విన్, యూపీఐ వంటి డిజిటల్ అప్లికేషన్ల అభివృద్ధి... పెరుగుతున్న భారతీయ సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యానికి అద్దం పడుతున్నాయి. ఈ విజయాలు దీర్ఘకాలం పరిశోధనలపై నిధులు ఖర్చుపెట్టిన ఫలితమే. దశాబ్దాలపాటు నాణ్యమైన విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తూండటం, వాటి పోషణకు తగిన నిధులు కేటాయించడం వల్లనే ఈ విజయాలు సాధ్యమయ్యాయి. ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న జాతీయ పరిశోధన సంస్థల సాంకేతిక సామర్థ్యాన్ని దశాబ్దాలుగా ప్రైవేటు రంగమూ ఉపయోగించుకుంది.

హింగోలి మహారాష్ట్ర మరాఠ్వాడా ప్రాంతంలోని జిల్లా కేంద్రం. 1948 వరకూ హైదరాబాద్ నిజాం రాజ్యం పరిధిలో ఉండేది. అప్పట్లో ఈ ప్రాంతాన్ని మిలిటరీ కేంద్రంగానూ వాడుకునేవారు. తాజాగా ఈ జిల్లాకు సరికొత్త గుర్తింపు లభిస్తోంది. అంతర్జాతీయ సైన్స్ ప్రాజెక్టు ‘లేజర్ ఇంటర్‌ఫెరోమీటర్ గ్రావిటేషనల్ వేవ్ అబ్జర్వేటరీ’ క్లుప్తంగా ‘లిగో’కు కేంద్రంగా ఇది అవతరించనుంది. ఈ మహా భౌతిక శాస్త్ర ప్రయోగశాల కాస్మిక్ గ్రావిటేషనల్ వేవ్స్‌ను గుర్తించేందుకు ఉద్దేశించింది. ఇలాంటివే అమెరికాలోని హాన్‌ఫర్డ్, లివింగ్‌స్టోన్ ప్రాంతాల్లో ఉన్నాయి. మరోరెండు ఇటలీ, జపాన్‌లలో ఉన్నాయి. 2030 నాటికి హింగోలిలోనూ ఈ వేధశాల నిర్మాణం పూర్తయితే ప్రపంచవ్యాప్త నెట్‌వర్క్ సంపూర్ణమవుతుంది. నాలుగు కిలోమీటర్ల పొడవైన భుజాల్లాంటి నిర్మాణాలు... ఎల్ ఆకారంలోని ఇంటర్‌ఫెరోమీటర్‌లతో కూడిన ఈ ప్రయోగశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో నేషనల్ టెక్నాలజీ డే సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని ఆన్‌లైన్‌లో రూ.1,200 కోట్ల విలువైన హింగోలి లిగో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టును భారత్ చేపట్టడం హర్షణీయమైన విషయమై నప్పటికీ ఇలాంటి భారీ ప్రాజెక్టులు, మౌలిక శాస్త్ర పరిశోధనల విషయంలో భారత్ వైఖరి ఎలా ఉందన్న విషయాన్ని సమీక్షించేందుకు ఒక అవకాశాన్ని కల్పిస్తోంది.

ఎంత ‘వేగం’గా సాగుతున్నాయంటే...

లిగో ప్రాజెక్టు ఆలోచనలకు బీజం పడ్డది 2009 లోనే. భారతీయ శాస్త్ర పరిశోధన సంస్థలకు చెందిన పలువురు శాస్త్రవేత్తలు కలిసికట్టుగా గ్రావిటేషనల్ వేవ్స్‌పై పరిశోధనలు చేస్తూండేవారు. ఆ క్రమంలోనే భారత్‌లో గ్రావిటేషనల్ వేవ్స్ వేధశాల ఏర్పాటు చేయాలన్న ఆలోచన పుట్టింది. రెండేళ్ల తరువాత అమెరికాలోని లిగో పరిశోధనశాల తమ పరిశోధనల్లో భాగం కావాలని భారత శాస్త్రవేత్తలకు ఆహ్వానం పలికింది. ఆ ఏడాదే భారత శాస్త్రవేత్తలు విస్తృత చర్చల తరువాత ఇండియన్ లిగో ఏర్పాటుకు సంబంధించి, భారత అణుశక్తి విభాగానికి ఒక ప్రతిపాదన చేశారు. 2012లో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు పచ్చజెండా ఊపుతూ ఓ కమిటీ నిధులు కేటాయించాల్సిందిగా అభ్యర్థించింది. నాలుగేళ్ల వివిధ ప్రభుత్వ విభాగాలకు చక్కర్లు కొట్టిన ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రిమండలి 2016లో ‘సూత్రప్రాయ అంగీకారం’ తెలిపింది. ఆ తరువాత సుమారు ఏడేళ్ల నిరీక్షణ తరువాత ఈ ప్రాజెక్టుకు తుది అనుమతులు లభించాయి. దేశంలో సైన్స్ ప్రాజెక్టులు ఎంత ‘వేగంగా’ అమలవుతాయో తెలిపేందుకు ఈ ఉదాహరణ చాలు.

హింగోలి ప్రాజెక్టు అమల్లో జరిగిన జాప్యం ఇంకో విషయాన్నీ గుర్తు చేస్తుంది. దేశంలో పరిశోధనల కోసం కేటాయిస్తున్న నిధుల్లో



పెరుగుదల లేకపోవడాన్ని ఎత్తి చూపుతుంది. స్థూల జాతీయోత్పత్తిలో పరిశోధనలకు (ఆర్ అండ్ డీ) కేటాయించిన నిధులు దశాబ్ద కాలంగా కేవలం 0.7 శాతం మాత్రమేనని నీతి ఆయోగ్ గత ఏడాది విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది. ఈ మోతాదు బ్రెజిల్ (1.6 శాతం), దక్షిణాఫ్రికా (0.83) కంటే తక్కువ కావడం గమనార్హం. పొరుగు దేశం చైనా తన స్థూల జాతీయోత్పత్తిలో ఏకంగా 2.14 శాతం ‘ఆర్ అండ్ డీ’కి కేటాయిస్తోంది. కేటాయింపులు అత్యల్పంగా ఉంటే పరిశోధనా రంగంలో పురోగతి సాధ్యం కాదని నీతి ఆయోగ్ తన నివేదికలో విస్పష్టంగా తెలిపింది.

లక్ష్యాలూ అస్పష్టమే...

2013లో భారత్ తన ‘ద సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్’ పాలసీలో 2020 నాటికల్లా శాస్త్ర పరిశోధనల రంగంలో టాప్–5లోకి చేరాలని సంకల్పం చెప్పుకొంది. తొమ్మిదేళ్ల తరువాత ఇదే పాలసీని ఆధునికీకరించారు. 2030 నాటికి నాణ్యమైన పరిశోధన ఫలితాలు సాధించే టాప్–5 దేశాల్లోకి భారత్ చేరాలన్న అస్పష్ట లక్ష్యం గురించి ఈ విధానంలో పేర్కొన్నారు. పదాలతో గారడీ చేయడం కంటే పరిశోధనలకు స్థిరంగా నిధులు కేటాయించడం మేలన్న విషయం మన విధాన నిర్ణేతలకు అర్థం కావడం లేదు. ఇటీవలి కాలంలో కోవిడ్–19 టీకా తయారీలో సాధించిన విజయం, కో–విన్, యూపీఐ వంటి డిజిటల్ అప్లికేషన్ల అభివృద్ధి... పెరుగుతున్న భారతీయ సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యానికి అద్దం పడుతున్నాయి. ఈ విజయాలు దీర్ఘకాలం పరిశోధనలపై నిధులు ఖర్చుపెట్టిన ఫలితమే అన్నది విస్మరించరాదు. దశాబ్దాలపాటు నాణ్యమైన విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తూండటం, వాటి పోషణకు తగిన నిధులు కేటాయించడం వల్లనే ఈ విజయాలు సాధ్యమయ్యాయి. ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న జాతీయ పరిశోధన సంస్థల సాంకేతిక సామర్థ్యాన్ని దశాబ్దాలుగా ప్రైవేటు రంగమూ ఉపయోగించుకుంది. కోవిడ్ టీకా, జెనెరిక్ మందుల అభివృద్ధినే తీసుకుందాం. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు చాలాకాలం క్రితమే మందులు, టీకాల తయారీ, క్లినికల్ ట్రయల్స్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశాయి. ఈ ఏర్పాట్లు 1970 నుంచి ప్రైవేట్ రంగం ఎదుగుదలకు పునాదిగా నిలిచాయి.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ, టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డ్ వంటివి భారత్ బయోటెక్, శాంతా బయోటెక్ వంటి సంస్థలకు తొలినాళ్ల నుంచి అండదండగా నిలిచాయి. ప్రైవేట్ రంగంలోని టీకా తయారీ కంపెనీలకు వందల కోట్ల నిధులు అందించారు కూడా. సుమారు 30 – 40 ఏళ్లుగా జరుగుతున్న ఈ కార్యక్రమాలు కోవిడ్ మహమ్మారి దాడి చేసిన వెంటనే అక్కరకు వచ్చాయి. ఐటీ రంగానికీ ఇది వర్తిస్తుంది. కంప్యూటర్ సైన్స్, గణిత, భౌతిక శాస్త్రాల్లో పరిశోధనల ఫలితంగానే ఐటీ రంగం వృద్ధి చెందింది. అల్గారిథమ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్రిప్టోగ్రఫీ నెట్‌వర్కింగ్ రంగాల్లో జరిగిన మౌలిక పరిశోధనలే కంప్యూటర్లు, ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ల అభివృద్ధికి కారణమయ్యాయి. భారతీయ విద్యాసంస్థల్లో కంప్యూటర్ సైన్స్ విద్యా బోధనకు దేశం చాలా ముందుగానే పెట్టుబడులు పెట్టింది. రీజినల్ ఇంజినీరింగ్ కాలేజీలు (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలని ఇప్పుడు పిలుస్తున్నారు), తరువాతి కాలంలో ట్రిపుల్ ఐటీల ఏర్పాటు కూడా ఈ ప్రయత్నాల్లో భాగమే. ప్రభుత్వ రంగంలో పెట్టిన ఈ పెట్టుబడుల ఫలితాలను ప్రైవేట్ రంగమూ పొందింది. ఆ క్రమంలోనే సరికొత్త డిజిటల్ అప్లికేషన్ల అభివృద్ధికి దారితీసింది. ప్రస్తుత డిజిటల్ విప్లవం వెనుక ప్రభుత్వ రంగ సంస్థలైన నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, నేషనల్ పేమెంట్ కార్పొరేషన్‌లు అభివృద్ధి చేసిన ఈ–గవర్నెన్స్, ఇతర డిజిటల్ అప్లికేషన్ల భూమికను విస్మరించలేము.

సాంకేతిక పరిజ్ఞాన రంగంలో సూపర్ పవర్‌గా ఎదగాలన్న లక్ష్యం అందుకోవాలంటే ఏ దేశమైనా తగినన్ని నిధులు, స్థిరంగా అందుబాటులో ఉంచాలి. అదే సమయంలో మౌలిక పరిశోధనలపైనా దృష్టి పెట్టాలి. దిగుమతి చేసుకున్న హార్డ్‌వేర్, విజ్ఞానంతో టెక్నలాజికల్ అప్లికేషన్ల అభివృద్ధిపై దృష్టి పెట్టడం వల్ల మనం ఇతరులపై ఆధారపడే స్థితి వస్తుంది. మౌలిక రంగ పరిశోధలు ఎన్నో రకాల ఇతర ప్రయోజనాలు అందిస్తాయి. పారిశ్రామిక, సామాజిక లాభాలూ ఒనగూరుతాయి. సర్వవ్యాప్తమైన డిజిటల్ కెమెరా, మెడికల్ ఇమేజింగ్, ఇంటర్నెట్‌లన్నీ ఇందుకు ఉదాహరణలు. వాతావరణ మార్పులు, ప్రజారోగ్యం, ఆహార భద్రత వంటి అతి సంక్లిష్టమైన ప్రపంచస్థాయి సమస్యల పరిష్కారానికీ మౌలిక పరిశోధనలే ఆధారం. రేపటి తరం టెక్నాలజీల కోసం ఈ రోజే సైన్స్‌పై పెట్టుబడులు పెట్టడం అవశ్యం.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
(‘ద ట్రిబ్యూన్’ సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

ఎన్ని నీళ్లు వృథా!



డ్యామ్‌లో పడిన తన ఫోన్‌ను తీసుకోవడానికి మొత్తం నీటిని ఖాళీ చేయించిన అధికారికి 53,092 రూపాయల జరిమానా విధించారు. అతడిని చాలాకాలం జైల్లో ఎందుకు పెట్టకూడదు? ఈ జరిమానా అతడి ఫోన్ ఖరీదుకు కూడా సమానం కాదు. (ఛత్తీస్‌గఢ్‌లోని ఖేర్‌కట్టా దగ్గర రాజేశ్ విశ్వాస్ సెల్ఫీ తీసుకుంటూ లక్ష రూపాయల ఫోన్ పారేసుకున్నాడని వార్త.)

– అనిందా సర్దార్, యాత్రికుడు

అదేం గొప్పది అనుకోవద్దు!



ఒక స్కాటిష్ పెద్ద మనిషితో గోల్ఫ్ ఆడుతున్నాను. ఆయన్ని మొదటిసారి కలిశాను. నాకు నచ్చే సింగిల్ మాల్ట్స్, నేను దర్శించిన మంచి డిస్టిల్లరీల గురించి చెప్పాను. ఆయన ఓపిగ్గా విని, మర్యాదగా, ‘సారీ, నాకు సింగిల్ మాల్ట్ నచ్చదు’ అన్నారు. మూస అభిప్రాయాలకు ఎన్నడూ పడిపోవద్దు.

– పర్మీందర్ సింగ్, ‘గూగుల్’ మాజీ ఎండీ

పిల్ల పిడుగు



నా పదేళ్ల అబ్బాయి గర్భంలో ఉండగా తన అనుభవానికి రేటింగ్ ఇస్తున్నాడు. “ఎక్కువగా సెల్ఫ్ సర్వీస్. బఫే చాలేది కాదు. ఏసీ లేదు. వైఫై లేదు. ఆతిథ్యం బాలేదు. ఈ ఇంటికి ఒక్క స్టార్ ఇస్తా.”

– రీతూపర్ణా ఛటర్జీ, జర్నలిస్ట్

మంచి మాట



‘కొన్ని వర్గాలు బయటినుంచి వచ్చాయి. ఇప్పుడవి మనవే’ అన్నారు మోహన్ భాగవత్. ఆరెస్సెస్ అధినేత నుంచి ఇలాంటి సానుకూల ప్రకటనలు రావడం మత విభేదాలను పూడ్చగలుగుతుంది.

– ఎస్.వై. ఖురేషి, కేంద్ర ఎన్నికల మాజీ ప్రధాన కమిషనర్

చూపించడానికే!



ఫొటోలు తీసుకోవడానికి అనుమతించకపోతే కూడా ఎవరైనా ట్రెక్కింగ్, ప్రయాణాలు చేస్తారా? నేననుకోవడం చాలామంది చేయరు.

– పర్వీన్ కాశ్వాన్, ఐఎఫ్ఎస్ అధికారి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఒక నాయకుడు... ఎన్నో విలువలు!

సందర్భం



రావి ప్రతిభారెడ్డి

“తెలంగాణాలో నిజాం రాజు ఆయన పెంచి పోషించిన రజాకార్లకు వ్యతిరేకంగా ఇక్కడి రైతాంగం ఒక్కటై సాయుధ పోరాటం చేయకపోతే కాంగ్రెస్ – ఏడవ నిజాం ఉస్మాన్ అలీఖాన్ మధ్య యథాతథ ఒడంబడిక (స్టాండ్‌స్టిల్ అగ్రిమెంట్)తో ఇద్దరి మధ్య రాజీ కుదిరి హైదరాబాద్ సంస్థానం భారతదేశ గుండెల మీద కుంపటిలా తయారయ్యేది. కశ్మీర్‌లా నిత్యం రావణ కాష్టాన్ని రగిలించేది. తెలంగాణ సాయుధ పోరాటం వీటన్నంటినీ భగ్నం చేసి భారతదేశ స్వతంత్రత, సమైక్యతలను సాధించింది. అంతకు మించి దేశమంతా భూ ప్రాముఖ్యతను ముందుకు తెచ్చింది.” ఇవి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సేనాని రావి నారాయణరెడ్డి ‘నా అనుభవాలు – జ్ఞాపకాలు’ పేరుతో రాసుకున్న స్వగతంలోని కొన్ని అంశాలు. నిజమే. భారతదేశ చరిత్రలో ఏ ప్రాంతానికి లేని పోరాట చరిత్ర తెలంగాణాకు ఉంది.



రావి నారాయణరెడ్డి

1947కు పూర్వం హైదరాబాద్‌లో కనీస హక్కుల్లేకుండా వెట్టిచాకిరీలో జనం మగ్గారు. మతపరమైన వివక్ష, భాషా వివక్షలు ఉండేవి. శిక్షల్లోనూ సాధారణ జనాలను రెండవ తరగతి శ్రేణులుగా పాలకులు పరిగణించారు. ఈ పరిస్థితుల్లో భువనగిరి సమీపంలోని బొల్లేపల్లిలో భూస్వామ్య కుటుంబంలో రావి నారాయణరెడ్డి జన్మించారు. నిజాం కాలేజీలో ఉన్నత విద్యను అభ్యసిస్తూ గొప్ప క్రీడాకారునిగా దేశానికే ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరారు. కానీ ప్రజల కష్టాలను చూసి పిన్న వయసులోనే ఉద్యమ పంథాను ఎంచుకున్నారు. విద్యార్థి దశలోనే వందమంది యువకులతో కలిసి గాంధీజీ నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఆ స్ఫూర్తిని హైదరాబాద్ సంస్థానంలో నింపే ప్రయత్నం చేశారు. మహాత్మా గాంధీ హైదరాబాద్ వచ్చిన సందర్భంలో ‘హరిజన సేవ సంఘం’ ఆధ్వర్యంలో నడిచే పాఠశాలల కోసం తన భార్య నగలమ్మి రూ. 2000లను విరాళంగా ఇచ్చారు. దున్నే వానికే భూమి ఉండాలన్న నినాదంతో భూదాన ఉద్యమం కంటే ముందుగానే తన వాటాగా వచ్చిన ఐదు వందల ఎకరాల భూమిని దళితులు, ఇతర కులాల వారిగా దానం చేసి భూదాన యోధుడిగా నిలిచారు.

నిజాం పాలనలో జాగిర్దార్‌లు, దేశ్‌ముఖ్‌ల అధీనంలోని భూములను పేదలకు పంచితే తప్ప కూలీనాలీల జీవితాల్లో సాంఘిక, ఆర్థిక మార్పులు సాధ్యం కాదని నిర్ణయించుకుని తొలుత సత్యాగ్రహ పోరాటం, ఆపై సాయుధ పోరాట రూపంలో 4 వేల గ్రామాల్లో ప్రజారాజ్యాల ఏర్పాటుకు నాయకత్వం వహించారు. రావి నాయకత్వంలో ప్రజా గెరిల్లాలు–గ్రామ రక్షక దళాల ఆధ్వర్యంలో విముక్తి ప్రాంతాల సంఖ్యను పెంచుకుంటూ పోతున్న సమయంలో భారత సైన్యాలు ‘ఆపరేషన్ పోలో’లో భాగంగా హైదరాబాద్ సంస్థానంలో ప్రవేశించి దాన్ని భారత్‌లో విలీనం చేశాయి.

విలీనం తర్వాత నిర్బంధంతో ఎక్కువ కాలం గెరిల్లా పోరు చేయటం నష్టమన్న నిర్ణయంతో పంథా మార్చిన రావి తమ పోరును ఎన్నికల వైపు మళ్లించారు. తొలి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుండి పోటీచేసి ఏకంగా 3,91,162 ఓట్లు సాధించి దేశంలోనే అత్యధిక ప్రజా మద్దతుతో పార్లమెంటులో అడుగుపెట్టారు. 1957లో భువనగిరి అసెంబ్లీ నుండి విజయం సాధించి ప్రతి పక్షనాయ కునిగా వ్యవహరించారు. విద్యార్థి దశ నుండి చివరి అంకం వరకు దోపిడీ, పేదరికం లేని సమ సమాజం కోసం తపించిన మహానాయకుని స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

వ్యాసకర్త రావి నారాయణరెడ్డి మనవరాలు
(రేపు రానారె జయంతి సభ హైదరాబాద్‌లో జరగనుంది.)

అమలు చేసిన సంక్షేమ పథకాలే రక్షగా...

అభిప్రాయం



చలాది పూర్ణచంద్ర రావు

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయ్యాయి. ఐదవ ఏట అడుగుపెట్టిన ఆ ప్రభుత్వ పనితీరు పైనా, ప్రతిపక్షాల ఎత్తుగడల మీదా సమీక్షించడం అవసరం. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవ సభలోనే ముందుగా ప్రకటించినట్లుగానే తాత, అవ్వలకు వృద్ధాప్య పెన్షన్‌లను పెంచుతూ మొదటి ఫైల్ మీద పెట్టిన సంతకంతో 2019 మే 30న పాలన ప్రారంభించారు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఆయన అన్న మాట ప్రకారం మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి బటన్ నొక్కి వెయ్యటం ఒక అపూర్వ ప్రయోగంగానే చెప్పుకోవాలి.

అయితే నాలుగేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు మేలేమీ జరగలేదనేది ప్రతిపక్షం వాదన. కేవలం 23 మంది సభ్యుల సంఖ్యాబలం గల ప్రధాన ప్రతిపక్షం... 151 సభ్యుల అధికార పక్షాన్ని ఏ దశలోనూ శాసన సభలో ఎదుర్కోలేకపోతోంది. అవాస్తవ విమర్శలతో కాలం వెల్లబుచ్చడం తప్ప ప్రతిపక్షం నిర్మాణాత్మక విమర్శ చేయలేకపోతోంది.

వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు వేసిన హైస్పీడ్ జాతీయ రహదారుల నిర్మాణం సలహా తానే వాజ్‌పేయికి తానే ఇచ్చాననీ, 2016లో మోదీ నేతృత్వంలో ఎంతో రహస్యంగా జరిగిన 500, 1000 నోట్ల రద్దు చేసే విషయం ప్రధాని మోదీకి సూచించాననీ చెప్పడానికి ఏమాత్రం వెరవని ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు... తాజాగా 2000 వేల కరెన్సీ నోటు చలామణీని నిలిపివేసే ఆలోచనా తనదే అనిచెప్పినట్లు కూడా వినపడింది. ఇదిగో ఇటువంటి గప్పాలు పలకడం తప్ప బాధ్యతాయుత ప్రతిపక్షంగా నిర్మాణాత్మక పాత్ర పోషించలేకపోతున్నారు బాబు.

ఈ నాలుగేళ్ళ కాలంలో, రెండేళ్లు కరోనా రక్కసి కోరల్లో చిక్కుకున్న రాష్ట్ర ఆర్థిక స్థితి చిన్నాభిన్నం అయ్యింది. అయినా సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవన స్థితిని మెరుగు పరచడానికి జగన్ ప్రభుత్వం వందల కోట్లు వ్యయం చేసిందని చెప్పక తప్పదు. కరోనా బారిన పడిన వారిని ఆదుకోవడానికి రాష్ట్రప్రభుత్వం తీసుకున్న చర్యలు అభినందనీయం.

ఇక అమరావతి రాజధాని సంగతికొస్తే...



అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు అమరావతిని రాజధానిగా నిర్ణయించి వేల ఎకరాలు సేకరించి ఏ కట్టడం కట్టినా ప్రతి నిర్మాణానికీ అడుగు (ఫీట్)కు ఎక్కడా లేని రేటు చెల్లించి నిర్మించారు. అయినా అవి తాత్కాలికమే అని చెప్పటం వైసీపీకి మూడు రాజధానుల ఆలోచన బయటపెట్టడానికి అందివచ్చిన అవకాశంగా మారింది.

ఇప్పుడు మూడు రాజధానుల ప్రతిపాదనతో అమరావతి ఏరియాలో పెరిగిన భూమి ధరల రెక్కలు విరిగాయి. దీంతో టీడీపీవారూ, అనేక మంది రియల్టర్లూ భారీగా నష్టపోతున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే జగన్ మాత్రం తన పథకాలపై తనకున్న నమ్మకంతో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో 175కు 175 సీట్లనూ గెలవాలనే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నారు.

మరోసారి జగన్ విజయం పొందకుండా అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు వెంపరలాడుతున్నాయి. ఒకటి అరా శాతం ఓట్లున్న బీజేపీ పవన్ కల్యాణ్‌కి ఉన్న క్రౌడ్ పుల్లింగ్ సమర్థ్యాన్ని అడ్డుపెట్టుకుని కొండకు నిచ్చెనలు వేస్తోంది. టీడీపీతో పొత్తుకు ససేమిరా అంటున్న బీజేపీతో టీడీపీకి మైత్రి సమకూర్చడానికి జనసేనాని తంటాలు పడుతున్నారు. బీజేపీకి ఏపీలో బలం లేకున్నా దానితో మిగతా రెండు పార్టీలూ పొత్తుకు సిద్ధమ వటానికి కారణం వేరే ఉంది. రానున్న ఎన్నికల్లో అధికార పార్టీ వైసీపీని ఎలక్షనీరింగ్‌లో ఎదుర్కో వాలంటే కేంద్రం బలగాల సాయం అవసరం అనీ, అందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో అంటకాగితే వారి ఓట్ల మాటేమోగాని తమకు చెందిన ఓట్లు కచ్చితంగా పోల్ చేయించుకుని గెలుపొందవచ్చనీ మిగిలిన రెండు పార్టీల భావన అంటున్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం ప్రచారం చేయడంలో చూపించిన శ్రద్ధ తన పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడంలో పవన్ చూపించలేదు. ఆయన ఇప్పటికీ అదే ధోరణిలో ఉండటం గమనార్హం.

జగన్ తాము అమలుచేసిన పథకాలే తమ గెలుపుకు హామీ అంటున్నారు. ప్రతిపక్షాల ప్రజా సంక్షేమ వ్యతిరేక విమర్శలను తమకు అనుకూలంగా మార్చుకోవడం ద్వారా మరోసారి విజయాన్ని సాధించడానికి ముందడుగు వేస్తున్నారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 94915 45699

ఆస్వాదించడం

ఓ ఆశ్రమ గురువు జీవిత చరమాంకంలో మంచం మీద పడుకుని ఉన్నాడు. చుట్టూ నిలుచున్న శిష్యుల్లో ఒకరు గురువుగారికి ఎంతో ఇష్టమైన మామిడి పండుని తెచ్చాడు. ఆయన ఎంతో ఇష్టపడి ఆ పండుని అందుకుని తిన్నాడు. అనంతరం ఆ శిష్యుడిని దగ్గరకు పిలిచాడు. గురువుగారు ‘ఆహా ఏమి రుచి’ అంటూ కనులు మూశారు. ఆ మాటతో శిష్యుడు నిరాశ చెందాడు. చివరి క్షణాల్లో ఏదో నాలుగు మంచి మాటలు చెప్తారని అనుకుంటే పండు రుచిగా ఉందని చెప్తారేంటని నిరాశ చెందాడు.

కానీ ఆ తర్వాత స్థిమితంగా ఆలోచించాడా శిష్యుడు. అతనికి గురువుగారి మాటతో ఓ విషయం బోధపడింది. జీవితం చివరి క్షణాన్ని కూడా మరణభయం లేకుండా ఆస్వాదించడం



తెలిసుండాలన్నదే గురువుగారి మాటలకు అర్థమని గ్రహించాడు. ఇక మరణం తప్పదని తెలిసినా జనులు దానినుంచి తప్పించుకోవడానికి పోరాడుతూ చివరివరకూ మనశ్శాంతి లేకుండా గడపడం అతడికి గుర్తొచ్చింది. అందుకు భిన్నంగా తన గురువుగారు చివరి క్షణాల్లోనూ నిశ్చింతగా తనకిష్టమైన మామిడిపండును ఆస్వాదించి కన్ను మూయడం అబ్బురమనిపించింది. జరిగేదాన్ని మనం నిరోధించలేని స్థితిలో ఉన్నప్పుడు హైరానా పడకుండా ప్రశాంతంగా మరణాన్ని కౌగలించుకోవడం సద్గతికి మార్గమవుతుందని గురువుగారు చెప్పకనే చెప్పారని ఆ శిష్యుడు గ్రహించాడు. అది ఒక్కటే సరైన మార్గమన్నది గురువుగారి హితవు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.చతుర్దశి ఉ.10.15 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** విశాఖ తె.5.11 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.9.29 నుండి 11.04 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.29 నుండి. 7.12 వరకు, **అమృతఘడియలు:** సా.6.55 నుండి 8.31 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.27.

క్లుప్తంగా...

సత్యదేవుని సన్నిధిలో హైకోర్టు తాత్కాలిక సీజే



జస్టిస్ ఆకుల వేంకట శేషసాయి దంపతులకు సత్యదేవుని చిత్రపటం అందజేస్తున్న ఈవో

అన్నవరం: కాకినాడ జిల్లా రత్నగిరిపై ఉన్న సత్యదేవుని రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వేంకట శేష సాయి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో వ్రత మాచరించారు. వీరికి దేవస్థానం ఈవో చంద్రశేఖర్ అజాద్ ఆధ్వర్యంలో పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా, స్వామి వారి ప్రసాదం, చిత్రపటం ఈవో చంద్రశేఖర్ అజాద్ దంపతులు అందించారు.

వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాల అభివృద్ధి

రాష్ట్ర వికేంద్రీకరణ జేఏసీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్



నినాదాలు చేస్తున్న నాయకులు

అరకులోయ రూరల్: పరిపాలన వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్య పడుతుందని రాష్ట్ర వికేంద్రీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ చెప్పారు. ఆయన శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో స్థానిక నాయకులు, యువకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా విధానాన్ని ప్రజలంతా స్వాగతిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. గత ప్రభుత్వాలకు దీటుగా ప్రస్తుత ప్రభుత్వం మూడు రాజధానుల ఏర్పాటుపై దృష్టి సారించిందన్నారు. త్వరలో విశాఖ పరిపాలన రాజధానిగా ఏర్పాటు కానుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అన్ని ప్రాంతాల ప్రజలు స్వాగతిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ రఘునాథ్, ప్రజాసంఘాల నాయకులు శివప్రసాద్, భైరవమూర్తి, సతీష్ కుమార్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్

26 వరకు దరఖాస్తుకు గడువు

జూలై 13న ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

ఆగస్టు మొదటి వారంలో తరగతుల ప్రారంభం



నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల సమీకృత బీ.టెక్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం శనివారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి తెలిపారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో శుక్రవారం ఆయన అడ్మిషన్లకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ నెల 4 నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికై నవారి జాబితాను జూలై 13న విడుదల చేస్తామని, ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు. దివ్యాంగుల కోటాను 3 నుంచి 5 శాతానికి పెంచిన నేపథ్యంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అడ్మిషన్లు చేపడతామన్నారు. 40 శాతం కంటే ఎక్కువ వికలాంగత్వం ఉన్న వారు మాత్రమే ఈ కోటాలో అర్హులని చాన్సలర్ తెలిపారు. పీహెచ్‌సీ, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, భారత్ స్కౌట్స్ తదితర ప్రత్యేక కేటగిరీ కోటా విద్యార్థుల సర్టిఫికెట్లను నూజివీడు ట్రిపుల్ ఐటీలో జూలై 5 నుంచి 9వ తేదీ వరకు పరిశీలిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన విద్యార్థులకు 4 శాతం డిప్రివేషన్ స్కోర్‌ను జోడించి మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని వివరించారు. ఒక్కో క్యాంపస్‌లో ఉన్న వెయ్యి సీట్లకు అదనంగా ఈడబ్ల్యూఎస్ కోటాలో మరో వంద సీట్లు కూడా భర్తీ చేస్తామన్నారు. నాలుగు క్యాంపస్‌లలో కలిపి 4,400 సీట్లు భర్తీ చేస్తామని, ఇందులో 85 శాతం సీట్లు ఏపీ అభ్యర్థులకు, 15 శాతం సీట్లు తెలంగాణ, ఏపీ విద్యార్థులకు ఓపెన్ మెరిట్ కింద కేటాయిస్తామని తెలిపారు. వీటికి అదనంగా ఇతర రాష్ట్రాల విద్యార్థులకు 5 శాతం సూపర్‌న్యూమరరీ సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఈ కోటాలో చేరినవారు ఏడాదికి రూ.1.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. నూజివీడు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలకు ఎంపికై నవారికి జూలై 21, 22 తేదీల్లో, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఎంపికై న విద్యార్థులకు జూలై 24, 25 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తామని వెల్లడించారు. ట్రిపుల్ ఐటీ అడ్మిషన్స్‌కు కన్వీనర్‌గా ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజును నియమించినట్లు తెలిపారు.



ఆచార్య కేసీ రెడ్డి

హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోం: సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నంలో వ్యాపారవేత్త లలితేష్‌కుమార్‌కు గతంలో కేటాయించిన భూమిని వెనక్కి తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోపై హైకోర్టు నిర్ణయంలో తాము జోక్యం చేసుకోబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ పంకజ్‌మిత్తల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోబోమని, పిటిషన్ కొట్టివేస్తున్నామని ధర్మాసనం పేర్కొంది.

బాబు కరకట్ట నివాసం అటాచ్‌మెంట్ కేసు 6కు వాయిదా

సాక్షి, అమరావతి: అమరావతి భూసమీకరణ కుంభకోణం, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులతో భూ అక్రమాల కేసులో చంద్రబాబు, నారాయణ ఆస్తుల ఆటాచ్‌మెంట్‌పై విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో ఇరుపక్షాల వాదనలు శుక్రవారం ముగిశాయి. కేసును న్యాయస్థానం జూన్ 6కు వాయిదా వేసింది. ఆ రోజే ఈ కేసులో న్యాయస్థానం తీర్పు వెలువరించే అవకాశాలున్నాయి. అమరావతి భూముల క్విడ్ ప్రోకో కుంభకోణం కింద లింగమనేని రమేశ్ నుంచి చంద్రబాబు పొందిన కరకట్ట నివాసం, నారాయణ బినామీలు, బంధువుల పేరిట ఉన్న బ్యాంకు ఖాతాలను జప్తు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ఆ ఆస్తుల జప్తునకు అనుమతించాలని కోరుతూ న్యాయస్థానంలో సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది. వాస్తవానికి ఈ కేసులో ఇప్పటికే వాదనలు ముగిశాయి. శుక్రవారం తీర్పు వెలువరించాల్సి ఉండగా లింగమనేని న్యాయవాది వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అందుకు న్యాయాధికారి సమ్మతించడంతో వాదనలు వినిపించారు. సీఐడీ న్యాయవాది కూడా వాదనలు వినిపించారు. అనంతరం ఈ కేసును కోర్టు వాయిదా వేసింది.

జాజులబందలో స్కూల్ లేకపోవడంపై నివేదిక ఇవ్వండి

ఏపీ సీఎస్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జాజులబంద గిరిజన గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయకపోవడంపై నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) శుక్రవారం నోటీసులు జారీ చేసింది. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఈ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఇబ్బందులుంటే వాటి గురించి కూడా ఆ నివేదికలో తెలియజేయాలని కోరింది.

మరో మైలురాయి చేరుకున్న విమ్స్

- అవయవదానం జరిగిన మొట్టమొదటి ప్రభుత్వాస్పత్రిగా రికార్డు
- బ్రెయిన్ డెడ్ అయిన చంద్రకళ నుంచి అవయవాల సేకరణ
- నలుగురి జీవితాల్లో వెలుగులు



చంద్రకళ కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రం అందజేస్తున్న విమ్స్ డైరెక్టర్ రాంబాబు



చంద్రకళ (ఫైల్)

ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) మరో మైలురాయి చేరుకుంది. రాష్ట్రంలో అవయవదానం జరిగిన మొట్టమొదటి ప్రభుత్వ ఆస్పత్రిగా విమ్స్ నిలిచింది. శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం మదుపాం గ్రామానికి చెందిన పట్నాన చంద్రకళ(32)కు గత నెల 31న తీవ్ర తలనొప్పి రావడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. దీంతో విమ్స్‌లో చేర్పించారు. ఇక్కడ న్యూరో సర్జరీ వైద్యులు పరీక్షలు చేసి బ్రెయిన్‌లో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు గుర్తించారు. క్రమంగా ఆమె శరీరంలో అవయవాలు పనిచేయడం ఆగిపోయాయి. దీంతో చంద్రకళ బ్రెయిన్ డెడ్ అయినట్లు గురువారం వైద్యులు నిర్ధారించారు. ఆమె అవయవాలను వేరే వ్యక్తులకు వినియోగించి వారికి జీవం పోయాలన్న ఆలోచనతో విమ్స్ డైరెక్టర్, జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు మృతురాలి కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో ఆమె బంధువులు కూడా పెద్ద మనసు చేసుకుని అవయవదానానికి అంగీకరించారు. జీవన్‌దాన్ సమక్షంలో విమ్స్ వైద్యులు ఆమె అవయవాలు సేకరించారు. ఈ సందర్భంగా చంద్రకళ కుటుంబ సభ్యులకు ప్రశంస పత్రం ఇచ్చారు. చంద్రకళ మృతదేహానికి విమ్స్ వైద్య సిబ్బంది శుక్రవారం నివాళులర్పించారు. అంబులెన్స్‌లో ఆమె స్వగ్రామానికి తరలించారు.

అనుమతి పొందిన నెల రోజుల్లోనే

బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి అవయవాలు సేకరించేందుకు విమ్స్ ఆస్పత్రికి ఏప్రిల్ 26న అనుమతులొచ్చాయి. అనుమతులు పొందిన అతి తక్కువ సమయంలోనే అవయవాలు సేకరించిన తొలి ఆస్పత్రిగా విమ్స్ రికార్డు సృష్టించింది.

నాలుగు అవయవాల సేకరణ

రాష్ట్ర వ్యాప్తంగా అవయవాల కోసం 2,900 మంది రోగులు ఎదురు చూస్తున్నారు. అవయవదానానికి ముందుకొచ్చిన చంద్రకళ కుటుంబ సభ్యులను అభినందించారు. ఇలాగే బ్రెయిన్ డెడ్ అయిన వారి కుటుంబ సభ్యులు కూడా అవయవదానం చేసేందుకు ముందుకు రావాలి. చంద్రకళ శరీరం నుంచి నాలుగు అవయవాలు సేకరించాం. ఆమె కిడ్నీలలో ఒకటి అపోలో ఆస్పత్రికి, మరోటి కేర్ ఆస్పత్రికి, రెండు కార్నియాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి అందించినట్లు చెప్పారు.

– డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్, జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్

ఏడుగురిలో ఊపిరిపోసుకున్నాడు..

- రోడ్డు ప్రమాదంతో యువకుడి బ్రెయిన్‌డెడ్
- తల్లిదండ్రుల అనుమతితో అవయవాలను తీసుకున్న జీవన్‌దాన్



మణికంఠ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం (గాజువాక): ఓ యువకుడు మృతి చెంది ఏడుగురికి పునర్జన్మను ప్రసాదించాడు. యలమంచిలి కొత్తపాలెం గ్రామానికి చెందిన మొల్ల మణికంఠ(20) రెండు రోజుల కిందట ఓ వ్యానులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు పడిపోయాడు. దీంతో యువకుడి తలకు తీవ్ర గాయం కావడంతో షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. వైద్యుల విజ్ఞప్తి మేరకు యువకుడి అవయవాల దానానికి తల్లిదండ్రులు అంగీకరించారు. జీవన్‌దాన్ ఆధ్వర్యంలో మణికంఠ కిడ్నీలు, లివర్‌ను విశాఖలో అపోలో ఆస్పత్రికి తరలించగా, గుండె, ఊపిరితిత్తులు తదితర అవయవాలను హైదరాబాద్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి గ్రీన్ చానెల్ ద్వారా తరలించినట్లు జీవన్ దాన్ ప్రతినిధులు తెలిపారు. ఈ అవయవాలతో ఏడుగురికి సరికొత్త జీవితానికి అవకాశం కల్పించినట్టు చెప్పారు.

'టైమ్స్' ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో ఏఎన్‌యూకి ప్రథమ స్థానం

ఏఎన్‌యూ: లండన్‌కు చెందిన టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ 2023 సంవత్సరానికి గాను ఉన్నత విద్యాసంస్థలకు ర్యాంకులు ప్రకటించింది. ఈ ర్యాంకుల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాన్ని పొందింది. జాతీయ స్థాయిలో 15వ ర్యాంకును, అంతర్జాతీయ స్థాయిలో 601–800 విభాగంలో ర్యాంకు సాధించింది. విద్యా సంస్థల్లోని విద్య, పరిశోధన, బోధన, మౌలిక వసతుల అభివృద్ధి, అంతర్జాతీయ ప్రమాణాలు, పేటెంట్లు, పరిశ్రమలతో అనుసంధానం తదితర ప్రమాణాల ఆధారంగా ఈ ర్యాంకులను టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రకటించింది. ఈ సందర్భంగా వర్సిటీలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ సమష్టి కృషితోనే ఏఎన్‌యూ అంతర్జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించగలిగిందన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఎం వైఎస్ జగన్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న సుమారు 40 వేల మంది మున్సిపల్ కార్మికులు ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పంపిన లేఖను శ్రీనివాసరావు శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికుల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రమంతా యాత్రలు జరుగుతున్నందున సంబంధిత సంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

8న అమిత్‌షా రాష్ట్ర పర్యటన

10న తిరుపతికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

సాక్షి, అమరావతి: బీజేపీ అగ్రనేతలు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఇద్దరూ రాష్ట్ర పర్యటనకు రాబోతున్నారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ దేశవ్యాప్తంగా మే 30వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాల్లో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఈ నెల 8వ తేదీన విశాఖపట్నంలో.. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవ తేదీన తిరుపతికి వస్తారని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. విశాఖపట్నం, తిరుపతిలో రెండు చోట్ల భారీ బహిరంగ సభల నిర్వహణకు బీజేపీ రాష్ట్ర కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.

పది రోజుల్లో ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు

అనంతపురం: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్–2023 ఫలితాలు పది రోజుల్లో విడుదల చేస్తామని సెట్ చైర్మన్ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా 25 శాతం వెయిటేజీ ఇవ్వనుండటంతో ఫలితాల ప్రక్రియ జాప్యం అవుతోందని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ, ఇతర రాష్ట్రాల ఇంటర్మీడియెట్, సీబీఎస్ఈ, ఆర్జీయూకేటీ, ఓపెన్ స్కూల్ పరీక్షల ఫలితాలను పరిగణనలోకి తీసుకుని వెయిటేజీ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఇంకా చాలా మంది విద్యార్థులు తమ ఇంటర్ మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థుల మార్కులు ఆటోమేటిక్‌గా నమోదవుతాయని, నేరుగా బోర్డు నుంచి ఏపీ ఈఏపీసెట్ నిర్వాహకులకు పంపుతారని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియెట్ బోర్డు మినహా ఇతర బోర్డుల్లో ఇంటర్ చదివినవారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో తమ మార్కులు నమోదు చేయాలని సూచించారు. ఇప్పటివరకు మార్కులు నమోదు చేయనివారి సెల్‌ఫోన్ నంబరుకు సమాచారం వస్తుందని తెలిపారు.

చిన్న సినిమాలకు ప్రభుత్వం సహకారం

- థియేటర్లు దొరకని చిన్న సినిమాలకు ఏపీ ఫైబర్‌నెట్ చేయూత
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- ఏపీ ఫైబర్‌నెట్ 'ఫస్ట్‌డే.. ఫస్ట్ షో' ప్రారంభం



'ఫస్ట్ డే ఫస్ట్ షో'ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో గౌతమ్‌రెడ్డి, సి.కల్యాణ్

సాక్షి, విశాఖపట్నం : థియేటర్లు దొరక్క ఇబ్బందులు పడుతున్న చిన్న సినిమాలకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని, అందులో భాగంగానే 'ఫస్ట్ డే.. ఫస్ట్ షో'ను ప్రారంభించిందని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఏపీ ఫైబర్‌నెట్ ఆధ్వర్యంలో సినిమా విడుదలైన రోజునే ఇంట్లోనే కూర్చొని వీక్షించేలా రూపొందించిన ఈ కార్యక్రమాన్ని మంత్రి అమర్‌నాథ్ శుక్రవారం విశాఖలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా తొలి సినిమాగా నిరీక్షణ చిత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫైబర్‌నెట్ సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నారని, ఇప్పటికే 8 వేల పంచాయతీలకు ఈ సేవలు అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఏడాదికి 100 సినిమాలు షూటింగ్ పూర్తి చేసుకుంటే.. అందులో 20 మాత్రమే విడుదలవుతున్నాయని, మిగిలినవన్నీ ల్యాబ్‌లకే పరిమితమవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఏపీ ఫైబర్‌నెట్ ద్వారా కొత్త సినిమా రిలీజ్ అయిన రోజునే 99 రూపాయిలకే 24 గంటలపాటు ఇంట్లో నుంచి చూసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) చైర్మన్ గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ముంగిటకే పరిపాలన తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. ఇప్పుడు ప్రజల ఇంటికే కొత్త సినిమాను తెస్తున్నారన్నారు. సినిమా డిస్ట్రిబ్యూటర్లు కూడా ఇబ్బందులు పడకుండా త్వరలోనే ట్రై పార్టీ అగ్రిమెంట్‌కు విధివిధానాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడుతూ చిన్న సినిమాల్ని ఆదరించేలా, ప్రొడ్యూసర్లకి చేయూతనందించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దీనివల్ల థియేటర్లకు ఎలాంటి నష్టం లేదన్నారు. ఇది క్లిక్ అయితే ఆరు నెలల్లోనే పెద్ద సినిమాల ప్రొడ్యూసర్లు కూడా ఫైబర్‌నెట్‌ను ఆశ్రయిస్తారని చెప్పారు. నిరీక్షణ చిత్ర నిర్మాత రామ సత్యనారాయణ మాట్లాడుతూ పెద్ద సినిమాలకు లాభాలు వచ్చేందుకు అనేక దారులుంటాయని, చిన్న సినిమాలకు ఇప్పుడే దారి దొరికిందని అన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన నవరత్నాల తర్వాత 10వ రత్నం ఫస్ట్ డే ఫస్ట్ షో అని కొనియాడారు. భవిష్యత్తులో ఫైబర్‌నెట్ కోసం సినిమాలు తీసే రోజులు వస్తాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్ క్రియేటివ్ హెడ్ జోగినాయుడు, ఏపీఎస్ఎఫ్ఎల్ ఎండీ మధుసూధన్‌రెడ్డి, నిరీక్షణ హీరో సాయిరోనక్, డైరెక్టర్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేదార్‌నాథ్‌లో బాపట్ల వాసి మృతి

- మే 5న బాపట్ల నుంచి బస్సులో యాత్రలకు వెళ్లిన లక్ష్మి
- లక్ష్మి మృతదేహానికి కేదార్‌నాథ్‌లోనే అంత్యక్రియలు



పెరుమాళ్ల లక్ష్మి (ఫైల్)

బాపట్ల టౌన్: యాత్రలకు వెళ్లిన బాపట్ల జిల్లాకు చెందిన మహిళ కేదార్‌నాథ్‌లో మృతి చెందిన ఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే... బాపట్ల మండలం, హైదరపేట గ్రామానికి చెందిన పెరుమాళ్ల లక్ష్మి (55) మే నెల 5న బాపట్ల నుంచి ప్రత్యేక టూరిస్ట్ బస్సులో యాత్రలకు బయలుదేరి వెళ్లారు. ఇదే బస్సులో బాపట్ల నుంచి 12 మంది, ఒంగోలుకు చెందిన 30 మంది, గుంటూరుకు చెందిన 20 మంది మొత్తం 62 మంది ఉన్నారు. వీరంతా కాశీ యాత్ర ముగించుకొని కేదార్‌నాథ్ చేరుకున్నారు. కేదార్‌నాథ్‌లో కొండపైకి చేరుకొని స్వామివారిని దర్శించుకొని తిరిగి వచ్చే సమయంలో నడవలేకపోవడంతో కొండపై నుంచి కిందకి వచ్చేందుకు డోలీ మార్గాన్ని ఎంచుకున్నారు. మార్గమధ్యలో మంచుతోకూడిన వడగండ్ల వర్షం పడటంతో డోలీ మోసుకొని వచ్చే వ్యక్తులు త్వరగా కిందికి రావాలనే ఉద్దేశంలో హడావుడిగా వచ్చారు. ఈ క్రమంలో శ్వాస అందక లక్ష్మి మృతి చెందారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి ఆమె మృతదేహానికి కేదార్‌నాథ్‌లోనే అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి భర్త పెరుమాళ్ల బాబు, కుమార్తె కృష్ణవేణి, కుమారుడు పోతురాజు ఉన్నారు.

గడపగడపకు.. ఉత్కంఠభరితం

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పర్యటన



గిరిజనులకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే అత్యంత మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా గుర్తింపు పొందిన అమ్మవారి దారకొండ పంచాయతీలో శుక్రవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఒడిశా సరిహద్దుకు ఆనుకుని దట్టమైన కొండల్లో ఉన్న ఈ పంచాయతీలో 30కి పైగా గ్రామాలున్నాయి. ఈ గ్రామాలకు వెళ్లాలంటే కాలినడకే శరణ్యం. మావోయిస్టుల అడ్డాగా పేరొందడంతో ఈ పంచాయతీలోకి అడుగుపెట్టాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులకు సాహసమే అని చెప్పాలి. కేవలం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు వంటి వారే ఇక్కడకు వెళ్తుంటారు. మండలస్థాయి అధికారులు సైతం ఆ గ్రామాలకు వెళ్లేందుకు సాహసించరు. గతంలో ఇక్కడ మావోయిస్టులకు, పోలీసులకు మధ్య అనేకసార్లు ఎదురుకాల్పులు జరిగాయి. అనేక హింసాత్మక ఘటనలు జరిగాయి. పోలీసులు మాత్రం అప్పుడప్పుడు మావోయిస్టుల గాలింపునకు ఈ ప్రాంతంలో పర్యటిస్తుంటారు. అటువంటి పంచాయతీలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ధైర్యంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మొదట పోలీసులు అనుమతి నిరాకరించినా.. ఎమ్మెల్యే సంకల్పబలంతో ఆ పంచాయతీలోని అమ్మవారి దారకొండ, నల్లమొక్కలు, చిలకవీధి, ఎస్‌కొత్తూరు, పనసలబంద గ్రామాల్లో పర్యటించారు. మొత్తం 177 గడపలను సందర్శించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. వారి సమస్యలను విని గిరిజనులతో మమేకమయ్యారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్రోచర్లను పంపిణీ చేశారు. తొలిసారిగా పాడేరు ఎమ్మెల్యే మావోయిస్టు ప్రభావిత ప్రాంతం అయిన అమ్మవారి దారకొండ పంచాయతీలో పర్యటిస్తుండటంతో గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయినకుమారి, అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సర్టిఫికెట్లపై విచారణ

- ఉద్యోగులను బదిలీల నుంచి తప్పించే ఎత్తుగడ
- సంఘం ఆఫీస్ బేరర్లుగా దొంగ సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు ఆరోపణలు
- ఆరోపణలపై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు
- దర్యాప్తు అధికారిగా విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్
- అప్పటి వరకు ఆ లేఖలపై ఎటువంటి నిర్ణయం తీసుకోవద్దు
- అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు

సాక్షి, అమరావతి: సాధారణ బదిలీల నుంచి తప్పించుకోవడానికి తప్పుడు సర్టిఫికెట్లు జారీచేస్తున్న ఉద్యోగసంఘాలపై రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కిందిస్థాయి ఉద్యోగుల నుంచి గెజిటెడ్ ఉద్యోగుల వరకు ఆఫీస్ బేరర్లుగా నియమిస్తూ తప్పుడు ధృవపత్రాలను జారీచేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్‌ను దర్యాప్తు అధికారిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎగ్జిక్యూటివ్ విధులు నిర్వర్తించే తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్‌టీవోలు, ఎస్ఆర్‌వోలు, ఏటీవోలు, సీటీవోలు, డీసీటీవోలు, ప్రత్యేక విభాగ డాక్టర్లు, ఏడీలు, జేడీలు ఇలా అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగులకు ఆఫీసు బేరర్స్‌గా తప్పుడు ధృవీకరణ పత్రాలను జారీచేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో విచారణ చేపట్టినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ యాక్ట్ పరిధిలోకి వచ్చే వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఈ విధమైన తప్పుడు ధృవీకరణ పత్రాలను ఇస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దర్యాప్తు పూర్తయ్యేవరకు ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జారీ చేసిన లేఖల పరిశీలనను నిలిపివేయాలని అన్ని శాఖల అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది.

పార్వతీపురం మన్యం జిల్లాకు నీతి ఆయోగ్ పురస్కారం

సాక్షి, అమరావతి: పార్వతీపురం మన్యం జిల్లా మరో ఘనత సాధించింది. జిల్లాలో ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మొబైల్ టవర్ల ఏర్పాటు, మారుమూల ఆవాసాలకు పీఎంజీఎస్‌వై కింద రహదారుల నిర్మాణం, గ్రామాల్లో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తేవడం, గృహ నిర్మాణాలు వేగవంతం చేయడం తదితర పనులను చేపట్టడాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించింది. ఆశావహ జిల్లాల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పన రంగంలో జాతీయ స్థాయిలో మంచి స్థానాన్ని సాధించి రూ.3 కోట్ల అదనపు నిధులు పురస్కారంగా పొందింది. ఈ మేరకు నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి.రాధ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి సమాచారం అందించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మొబైల్ టవర్ల ఏర్పాటును ప్రశంసిస్తూ ఇటీవల నీతి ఆయోగ్ ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే.

3 పంచాయతీలకు జాతీయ అవార్డులు

పచ్చదనం, పరిశుభ్రత విభాగంలో పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలానికి చెందిన జోగుంపేట, ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లా బిల్లనందూరు, నెల్లూరుజిల్లా కడలూరు పంచాయతీలను కేంద్ర పర్యావరణ, అటవీశాఖ జాతీయ అవార్డులకు ఎంపిక చేసింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా జూన్ 5న న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగే వేడుకల్లో ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. బహిరంగ మలవిసర్జన లేని, తాగు నీటి సరఫరా, పచ్చదనం, మురుగు నీటి పారుదల, పారిశుధ్యం, పౌష్టికాహారం విధానాలు పాటించడం, సుపరిపాలన, వీధి దీపాలు వంటి విభాగాల్లో జాతీయ స్థాయిలో ఈ మూడు పంచాయతీలు అత్యున్నత స్థానంలో నిలిచాయి.

తెలంగాణ

కడుపులో ఉబ్బిన రక్తనాళం తొలగించి... కాలి నుంచి మరో రక్తనాళం అమర్చి

లక్డీకాపూల్(హైదరాబాద్): నిమ్స్ వైద్యులు మరో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. కడుపులోని పెద్ద రక్తనాళం తీవ్ర ఇన్ఫెక్షన్‌కు గురై ఉబ్బటం వల్ల గత కొన్ని నెలలుగా జ్వరంతో బాధపడుతున్న ఓ 60 ఏళ్ల వృద్ధుడికి ప్రాణాపాయం తప్పించారు. నిమ్స్ వ్యాస్క్యులర్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ సందీప్ మహాపాత్ర అందించిన వివరాల ప్రకారం ఏపీలోని బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన చింతగుంట్ల గమానియేలు గత 20 ఏళ్లుగా హైదరాబాద్‌లో చెప్పుల షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆయన గతేడాది డిసెంబర్‌లో జ్వరంబారిన పడటంతో సొంతూరు వెళ్లి అక్కడి పలు ఆస్పత్రుల్లో చూపించుకున్నాడు. కానీ ఎక్కడా నయంకాకపోవడం, వ్యాధి సైతం నిర్ధారణ కాకపోవడంతో మంగళగిరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి కడుపులోని పెద్ద రక్తనాళం ఇన్ఫెక్షన్‌కు గురై ఉబ్బిందని... వెంటనే హైదరాబాద్‌లో ఏదైనా కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ ఆస్పత్రిని సంప్రదించగా వైద్యులు ఆపరేషన్‌కు రూ. 10 లక్షలు ఖర్చవుతుందన్నారు. దీంతో ఆర్థిక స్థోమతలేని గమానియేలు చివరకు నిమ్స్‌కు వచ్చాడు. గత నెల 24న జనరల్ మెడిసిన్ విభాగంలో ఆయనకు అన్ని పరీక్షలు చేసిన వైద్యులు వాస్క్యులర్ సర్జరీకి రిఫర్ చేశారు. గత నెల 28న వ్యాస్క్యులర్ సర్జరీ హెడ్ డాక్టర్ సందీప్ మహాపాత్ర ఆధ్వర్యంలో డాక్టర్ అనూష, డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ స్నేహాలతో కూడిన వైద్య బృందం 13 గంటలపాటు శ్రమించి రోగి కడుపులో ఉబ్బిన పెద్ద రక్తనాళాన్ని పూర్తిగా తొలగించింది. దాని స్థానంలో రోగి కాలి ఎముక పక్కన ఉండే రక్తనాళాన్ని తీసుకొని అమర్చింది. దీంతో రోగి ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడ్డాడు. ఈ ఆపరేషన్‌కు కేవలం రూ. 2 లక్షల ఖర్చయింది.

క్లుప్తంగా

అమెరికా నేషనల్ స్పెల్లింగ్ బీలో ... ఇండియన్ అమెరికన్ దేవ్ షా విజేత



వాషింగ్టన్: అమెరికా లోని స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీలో 2023 సంవత్స రానికి గాను భారతీయ సంతతికి చెందిన 14 ఏళ్ల వయసున్న దేవ్ షా విజేతగా నిలిచాడు. ఫ్లోరి డాకు చెందిన దేవ్ "psammophile" అనే పదం స్పెల్లింగ్‌ను సరిగ్గా చెప్పి చాంపియన్ అయ్యాడు. ఈ పోటీలో గెలవడంతో దేవ్‌షాకు 50 వేల అమెరికన్ డాలర్ల ప్రైజ్ మనీ లభిస్తుంది. మేరీల్యాండ్‌లో జరిగిన ఈ పోటీలో నెగ్గిన తర్వాత దేవ్ షా తాను చాంపియన్ అయ్యానంటే నమ్మలేకపోతున్నానన్నాడు. ఇంగ్లిషు స్పెల్లింగ్ పోటీలలో అత్యధికంగా ప్రవాస భారతీయుల పిల్లలే విజేతలుగా నిలుస్తున్నారు.

అమెరికా రుణ పరిమితి బిల్లుకు
సెనేట్ ఆమోదం

వాషింగ్టన్/కొలరాడో: దివాలా(డిఫాల్ట్) ముప్పు నుంచి అగ్రరాజ్యం అమెరికా బయట పడినట్లే. రుణ పరిమితి పెంపునకు సంబంధించిన బిల్లుపై (ద్వైపాక్షిక ఒప్పందం) సెనేట్ తుది ఆమోద ముద్ర వేసింది. సుదీర్ఘమైన చర్చల అనంతరం గురువారం రాత్రి ఓటింగ్ నిర్వహించారు. 63–36 ఓట్లతో బిల్లు ఆమోదం పొందింది. సంతకం కోసం అధ్యక్షుడు జో బైడెన్ డెస్క్‌కు పంపించారు. ఆయన సంతకం చేస్తే బిల్లు చట్టరూపం దాల్చనుంది. దేశ రుణ పరిమితిని 31.4 ట్రిలియన్ డాలర్లకు పెంచుతూ బిల్లును రూపొందించారు. అంటే మొత్తం అప్పులు 31.4 ట్రిలియన్ డాలర్లు దాటకూడదు. బిల్లుకు సెనేట్ ఆమోదం లభించడంతో కొత్త అప్పులు తీసుకొని, పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. బడ్జెట్ కట్స్ ప్యాకేజీకి సైతం సెనేట్ ఆమోదం తెలిపింది. బిల్లు ఆమోదం పొందడంలో అమెరికా ఇక ఊపిరి పీల్చుకోవచ్చని సెనెట్ మెజార్టీ నాయకుడు చక్ షూమర్ చెప్పారు. ఛ

ఇది అతిపెద్ద విజయం: బైడెన్

అమెరికా తన బాధ్యతలు నెరవేర్చే దేశం, బిల్లులు చెల్లించే దేశం అని డెమొక్రాట్లు, రిపబ్లికన్లు మరోసారి నిరూపించారని అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. అమెరికా తన బాధ్యతలను ఎప్పటికీ చక్కగా నెరవేరుస్తుందని చెప్పారు. బిల్లుపై త్వరగా సంతకం చేస్తానన్నారు. చర్చల్లో ఎవరికీ కోరుకున్నది మొత్తం దక్కకపోవచ్చని, అయినప్పటికీ తాము ఎలాంటి పొరపాటు చేయలేదని వ్యాఖ్యానించారు. ఈ ద్వైపాక్షిక ఒప్పందం అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ప్రజలకు అతిపెద్ద విజయమని బైడెన్ అభివర్ణించారు.



ప్రమాద స్థలం వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు



ప్రమాదంలో గాయపడ్డ ప్రయాణికులు

మూడు రైళ్లు...మహా విషాదం!

ఒడిశాలో ఘోర ప్రమాదం • గూడ్సును ఢీకొన్న కోరమండల్? • పక్క ట్రాక్‌పై పడ్డ పలు బోగీలు

- వాటిని ఢీకొన్న హౌరా ఎక్స్‌ప్రెస్
- ప్రమాదంలో వందమందికి పైగా దుర్మరణం?
- 70కి పైగా మృతదేహాల వెలికితీత
- 350 మందికి పైగా క్షతగాత్రులు
- బోగీల్లో చిక్కిన వందలాది మంది
- రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి



గూడ్స్ బోగీపైకి దూసుకెళ్లిన ప్రయాణికుల బోగీ

భువనేశ్వర్/బాలాసోర్/హౌరా/సాక్షి, అమరావతి: ఒడిశాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. శుక్రవారం రాత్రి ఒకే చోటఏకంగా మూడు రైళ్లు ప్రమాదానికి గురయ్యాయి. ఈ దారుణంలో కనీసం వంద మందికిపైగా దుర్మరణం పాలైనట్లు భావిస్తున్నారు. ఇప్పటిదాకా 70కి పైగా మృతదేహాలను వెలికి తీశారు. 350 మందికి పైగా గాయపడ్డారు. వారిలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వందలాది మంది బోగీల్లో చిక్కుబడి ఉండటంతో మృతుల సంఖ్య భారీగా పెరిగేలా కన్పిస్తోంది. సహాయక చర్యలకు పెను చీకటి అడ్డంకిగా మారింది. ఎన్డీఆర్‌ఎఫ్, రాష్ట్ర బృందాలు హుటాహుటిన రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. మృతులు, క్షతగాత్రుల్లో ఆంధ్రప్రదేశ్ వాసులు కూడా ఉండొచ్చని చెబుతున్నారు.

ఏం జరిగింది...?

రాత్రి ఏడింటి ప్రాంతంలో బెంగుళూర్ నుంచి హౌరా వెళ్తున్న 12864 ఎక్స్‌ప్రెస్ బాలాసోర్ సమీపంలోని బహనాగా బజార్ రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు తప్పిందని రైల్వే అధికారులు చెబుతున్నారు. దాని తాలూకు బోగీలను ఢీకొని షాలిమార్ నుంచి చెన్నై వెళ్తున్న కోరమండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కూడా పట్టాలు తప్పిందని, దాని బోగీలు మరో ట్రాక్‌పై ఉన్న గూడ్స్‌పైకి దూసుకెళ్లాయని అంటున్నారు. కానీ వాస్తవానికి తొలుత ప్రమాదానికి గురైంది కోరమండల్ ఎక్స్‌ప్రెసేనన్నది ప్రత్యక్ష సాక్షుల కథనం. దానికి పొరపాటున లూప్ లైన్లోకి సిగ్నల్ ఇవ్వడంతో ఆ ట్రాక్‌పై నిలిచి ఉన్న గూడ్స్‌ను శరవేగంగా ఢీకొట్టిందన్నది వారు చెబుతున్నారు. ‘‘ప్రమాద ధాటికి కనీసం ఏకంగా 14 బోగీలు పట్టాలు తప్పి చెల్లాచెదురుగా పడిపోయాయి. పలు బోగీలు గూడ్స్ బోగీల్లోకి దూసుకెళ్లాయి. దాంతో ప్రయాణికులు హాహాకారాలు చేస్తూ రైలు దిగి పరుగులు తీశారు. మరికొన్ని బోగీలు పక్క ట్రాక్‌పై పడ్డాయి. ఆ ట్రాక్‌పై ఎదురుగా వస్తున్న హౌరా ఎక్స్‌ప్రెస్ వాటిని ఢీకొని పట్టాలు తప్పింది’’ అని వారంటున్నారు. ప్రమాదం జరిగిన తీరుపై రైల్వే అధికారులు సరైన సమాచరం ఇవ్వకపోవడం, దాంతో సైట్లు, వార్తా సంస్థలు ఒక్కోటీ ఒకోలా రిపోర్టు చేయడం మరింత గందరగోళానికి దారితీసింది.

హుటాహుటిన సహాయ చర్యలు

ప్రమాద సమాచారం తెలియగానే అధికారులు రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించారు. కోచ్‌ల కింద చిక్కుకుపోయిన ప్రయాణికులను బయటకు తీస్తున్నారు. చీకటి వల్ల సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోందని అధికారులు చెప్పారు. 132 మంది క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించినట్టు ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ జెనా తెలిపారు. మిగతా వారిని సారో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, గోపాల్‌పూర్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, ఖొంటపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. జాతీయ విపత్తు స్పందన దళం కూడా రంగంలోకి దిగింది. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రమాద వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శనివారం ఆయన ప్రమాద స్థలానికి వెళ్లనున్నారు. రైలు ప్రమాదంపై పరిస్థితిని తాను వ్యక్తిగతంగా ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వెల్లడించారు.

హెల్ప్‌లైన్ నంబర్లు ఇవే

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద ఘటనకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేసింది. రైల్వేస్టేషన్లు.. విజయవాడలో 0866 2576924, రాజమండ్రిలో 0883 2420541, రేణిగుంటలో 9949198414, తిరుపతిలో 7815915571, నెల్లూరులో 0861 2342028, సామర్లకోటలో 7780741268, ఒంగోలులో 7815909489, గూడూరులో 08624250795, ఏలూరులో 08812232267 నంబర్లను అందుబాటులో ఉంచింది. అలాగే తెలంగాణలోని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 040 27788516 నంబర్‌ను ఏర్పాటు చేసింది. రైలు ప్రమాదంలో చిక్కుకున్న తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సమాచారం తెలుసుకోవడానికి ఈ నంబర్లకు ఫోన్ చేయొచ్చని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో వెల్లడించింది. అలాగే హౌరాలో 033 2638227, ఖరగ్‌పూర్‌లో 8972073925, 9332392339, బాలాసోర్‌లో 8249591559, 7978418322, 8585039521, షాలిమార్‌లో 9903370746, సంత్రాగచ్చిలో 8109289460, 8340649469 నంబర్లను దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసింది.

రాష్ట్రపతి, ప్రధాని సంతాపం..

రైలు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారీగా ప్రయాణికులు మృతి చెందడం తీవ్రంగా కలిచివేసిందని చెప్పారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ప్రధాని మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. బాధితులకు సాధ్యమైన సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ప్రమాదంపై దిగ్భ్రాంతి వెలిబుచ్చారు.

రూ.10 లక్షల పరిహారం..

ప్రమాద బాధితులకు రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు ప్రకటించారు.

మాటలకందని విషాదం: వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఒడిశా రైలు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విచారం వెలిబుచ్చారు. ‘‘ఇది మాటలకు అందని విషాదం. మృతుల కుటుంబాలకు దేవుడు ఆ కష్టాన్ని తట్టుకునే శక్తిని ఇవ్వాలి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడానికి అందరూ కృషి చేయాలి’ అని పేర్కొన్నారు. మృతులకు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలు ముమ్మరంగా సాగేలా అందరూ సహకరించాలని, మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు తోడుగా నిలవాలని ట్వీట్ చేశారు.

రద్దయిన రైళ్లు ఇవే...

12837 హౌరా–పూరీ ఎక్స్‌ప్రెస్ (02.06.2023); 12863 హౌరా–సర్ ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ ఎక్స్‌ప్రెస్ (02.06.2023); 12839 హౌరా–చెన్నై మెయిల్ (02.06.2023); 12895 షాలిమార్–పూరీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (02.06.2023); 20831 షాలిమార్–సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (02.06.2023); 02837 సంత్రాగచ్చి–పూరి (02.06.2023); 22201 సీల్దా–పూరీ దురంతో ఎక్స్‌ప్రెస్ 0(2.06.2023); 12074 భువనేశ్వర్–హౌరా జన్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 12073 హౌరా–భువనేశ్వర్ జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 12278 పూరీ–హౌరా శతాబ్ది ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 12277 హౌరా–పూరీ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 12822 పూరీ–షాలిమార్ ధౌలీ ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 2821 షాలిమార్ – పూరి ధౌలీ ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 12892 పూరి–బంగిరిపోసి (03.06.2023), 12891 బంగిరిపోసి–పూరి ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 02838 పూరీ–సంత్రగచ్చి స్పెషల్ (03.06.2023); 12842 చెన్నై–షాలిమార్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 12509 ఎస్ఎంవీటీ బెంగళూరు–గౌహతి (02.06.2023)

ఛత్రపతి శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం

- ‘ఏక్ భారత్, శ్రేష్ట భారత్’.. శివాజీ ఆశయాలకు ప్రతిబింబం
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- ఘనంగా ఛత్రపతి 350వ పట్టాభిషేక దినోత్సవాలు

ముంబై: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రధాని మోదీ కొనియాడారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన నిరంతరం తపించారని చెప్పారు. శివాజీ విధానాలు, పాలనా వ్యవస్థ ఈనాటికీ అనుసరణీయమని పేర్కొన్నారు. మరాఠా రాజుగా ఛత్రపతి పట్టాభిషేకం జరిగి 350 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ కోటపై రాష్ట్రస్థాయి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఒక వీడియో సందేశం పంపించారు. శివాజీ దార్శనికత, అరుదైన వ్యక్తిత్వం చరిత్రలోని ఇతర రాజుల కంటే భిన్నమని మోదీ ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వ నినాదమైన ‘ఏక్ భారత్, శ్రేష్ట భారత్’ శివాజీ మహారాజ్ ఆలోచనలు, ఆశయాలకు ప్రతిబింబమని వివరించారు. ఆయన వీరత్వం, భయానికి తావులేని కార్యాచరణ, వ్యూహాత్మక నైపుణ్యాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు.



అమెరికా కాంగ్రెస్‌లో 22న మోదీ ప్రసంగం

వాషింగ్టన్: భారత ప్రధాని మోదీ జూన్ 21నుంచి 24వ తేదీ వరకు అమెరికాలో అధికారికంగా పర్యటించనున్నారు. 22న అమెరికా కాంగ్రెస్‌నుద్దేశించి ప్రసంగించనున్నారు. భవిష్యత్ భారతం, రెండు దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లపై ఆయన ప్రసంగిస్తారని కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. 22న వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు బైడెన్ ఇచ్చే విందులో మోదీ పాల్గొంటారు. ఉభయసభలైన ప్రతినిధుల సభ, సెనేట్‌నుద్దేశించి మోదీ మొదటిసారిగా 2016లో ప్రసంగించారు.

లూప్‌లైన్లోకి మళ్లించినందుకే?

- 20 సెకెన్లలో 128 నుంచి 0 స్పీడ్‌కు
- ప్రమాదానికి గురైన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ వేగ పతనమిదీ
- లూప్‌లైన్‌లోకి సిగ్నల్ ఇవ్వడమే ప్రమాదానికి కారణమా?
- గూడ్స్ రైలు లేదని చెబుతున్న అధికారులు
- కానీ.. ఫొటోలో స్పష్టంగా కనిపిస్తున్న గూడ్స్ బోగీ



ప్రమాద తీవ్రతకు అద్దం పడుతున్న ఒక బోగీ లోపలి దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: ఊహించని ఉత్పాతం.. రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రమాదానికి గురై, పదుల సంఖ్యలో ప్రయాణికులు మృత్యువాత పడగా, వందల మంది క్షతగాత్రులయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో రైలు వేగాన్ని పరిగణనలోకి తీసుకున్న అధికారులు దాని తీవ్రతను అంచనా వేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల 55 నిమిషాల 28 సెకన్లకు గంటకు 128 కిలోమీటర్ల వేగంతో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణిస్తోంది. అదే సమయంలో ప్రమాదం సంభవించడంతో 6 గంటల 55 నిమిషాల 51 సెకన్లకు వేగం సున్నాకు పడిపోయింది. సాధారణంగా గంటకు దాదాపు 130 కి.మీ. వేగంతో వెళ్లే రైలు వేగం సున్నాకు చేరుకునేందుకు అకస్మాత్తుగా బ్రేక్ వేస్తే 60 నుంచి 80 సెకన్లకు పైగా సమయం పడుతుంది. కానీ, ప్రమాదం జరిగి 23 సెకన్లలోనే జీరో స్పీడ్‌కు చేరుకుందంటే పట్టాలపై ఉన్న గూడ్సు రైలును ఎంత బలంగా ఢీకొట్టిందో అర్థం చేసుకోవచ్చని, దీన్నిబట్టి ప్రమాద తీవ్రతను ఊహించడానికే భయం కలుగుతోందని రైల్వే అధికారులు చెబుతున్నారు.

అధికారులు ఏం చెబుతున్నారంటే...

రైల్వే అధికార ప్రతినిధి అమితాబ్ శర్మ ప్రమాదం ఎలా జరిగిందన్న అంశంపై స్పందించారు. సాయంత్రం 6.55 గంటల సమయంలో బహనాగ రైల్వేస్టేషన్ వద్ద స్టాప్ లేకపోవడంతో వేగంగా వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ బోగీలు ఒక్కసారిగా పట్టాలు తప్పాయి. పక్కన ఉన్న ట్రాక్‌పైకి కోరమండల్ కోచ్‌లు పడిపోయాయి. అదే సమయంలో ఆ ట్రాక్‌పై వస్తున్న యశ్వంత్‌పూర్–హౌరా ఎక్స్‌ప్రెస్ పడిపోయిన కోచ్‌లని ఢీకొట్టడంతో ఆ ట్రైన్‌కు సంబంధించిన నాలుగు బోగీలు పట్టాలు తప్పాయని వివరించారు.

అసలు జరిగిందేమిటి?

అధికారులు చెబుతున్న దానికి, ప్రమాదం సంభవించిన పరిస్థితుల్ని గమనిస్తే.. ఒకదానికొకటి పొంతన లేకుండా ఉన్నాయి. వేగంగా వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిందని అధికారులు చెబుతున్నారు. కానీ, ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు చూస్తే అక్కడ గూడ్స్ రైలు కూడా ఉందని స్పష్టమవుతోంది. స్టేషన్ వద్ద.. మధ్యలో ఉన్న లూప్‌లైన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉంది. స్టేషన్‌లో స్టాప్ లేనప్పుడు రైలుకు మెయిన్ లైన్‌లో ట్రాక్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, కోరమాండల్‌కు లూప్‌లైన్‌లో సిగ్నల్ ఇచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెయిన్ లైన్‌లో నుంచి వెళ్లకుండా లూప్‌లైన్‌లోకి రావడం వల్ల అక్కడ ఆగి ఉన్న గూడ్స్ రైలుని బలంగా ఢీకొట్టడమే ప్రమాదానికి ప్రధాన కారణమన్న వాదన వినిపిస్తోంది. ఇది ముమ్మాటికీ రైల్వే శాఖ తప్పిదమని కొందరు సిబ్బంది చెబుతున్నారు. గంటకు 128 కి.మీ. వేగంతో వస్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ లోకో గూడ్స్ రైలు బోగీపైకి వెళ్లినట్లు స్పష్టంగా కనిపిస్తున్నా అలాంటిదేమీ జరగలేదన్నట్లుగా రైల్వే అధికారులు చేస్తున్న ప్రకటనలు మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. ఈ ప్రమాదంపై పూర్తిస్థాయి దర్యాప్తునకు రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది.

దేశద్రోహానికి ఏడేళ్ల జైలు శిక్ష

భారత న్యాయ కమిషన్ సిఫార్సు

న్యూఢిల్లీ: దేశద్రోహం కేసుల్లో దోషులకు విధించే జైలుశిక్షను కనిష్టంగా మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకూ పెంచాలని భారత న్యాయ కమిషన్ సిఫార్సు చేసింది. దీనివల్ల నేర తీవ్రతను బట్టి శిక్ష విధించే అవకాశం న్యాయస్థానాలకు లభిస్తుందని వెల్లడించింది. ఈ మేరకు ఈ నివేదికను న్యాయ కమిషన్ చైర్మన్ జస్టిస్ రితూరాజ్ అవస్థీ (రిటైర్డ్) ఇటీవల కేంద్ర న్యాయ శాఖ మంత్రి మేఘ్వాల్‌కు సమర్పించారు. దేశద్రోహానికి జైలు శిక్షను ఏడేళ్లకు పెంచాలంటూ న్యాయ కమిషన్ సిఫార్సు చేయడాన్ని కాంగ్రెస్ ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ తప్పుబట్టారు. దేశద్రోహ చట్టాన్ని మరింత క్రూరంగా మార్చేయడానికి బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు.


మెక్సికోలో కలకలం.. డజన్ల కొద్దీ బ్యాగుల్లో మానవ శరీర భాగాలు

మెక్సికో సిటీ: మెక్సికోలో పదుల సంఖ్యలో బ్యాగుల్లో మానవశరీర భాగాలు లభ్యమైన ఘటన సంచలనం రేపుతోంది. గ్వాడలజర శివారులోని లోయలో బయటపడిన ఈ బ్యాగుల్లో ఇటీవల అదృశ్యమైన ఏడుగురి శవాలు కూడా ఉండి ఉంటాయని వారి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారం నుంచి 8 మంది కనిపించడం లేదంటూ సంబంధీకులు ఇచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్న అధికారులు అటవీ ప్రాంతంలోని లోయలో అనుమానాస్పద బ్యాగులు పడి ఉన్నాయంటూ గురువారం స్థానికులిచ్చిన సమాచారంతో అప్రమత్తమయ్యారు. మిస్సయిన వారి శరీరభాగాలు ఇందులో ఉన్నాయా అనే దిశగా దర్యాప్తు చేపట్టారు. దీని వెనుక మాదకద్రవ్యాల ముఠాల హస్తం ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

కేంద్ర ఆర్డినెన్స్‌పై ఆప్‌కు జేఎంఎం మద్దతు

రాంచీ: దేశ రాజధాని న్యూఢిల్లీలో పాలనా యంత్రాంగంపై నియంత్రణ కోసం కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఆప్‌కు మద్దతిస్తామని జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) ప్రకటించింది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, పంజాబ్ సీఎం మాన్ శుక్రవారం రాంచీలో జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌తో భేటీ అయ్యారు. అనంతరం కేజ్రీవాల్, మాన్, సోరెన్ మీడియాతో మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఆర్డినెన్స్ స్థానంలో కేంద్రం ప్రవేశపెట్టే బిల్లును తప్పకుండా ఓడించాలన్నారు. కేంద్ర ఆర్డినెన్స్ విషయంలో ఆప్‌కు జేఎంఎం మద్దతుగా నిలుస్తుందని ఆ పార్టీ చీఫ్, సీఎం సోరెన్ చెప్పారు. ఆర్డినెన్స్‌పై మద్దతు కూడగట్టేందుకు కేజ్రీవాల్ బీజేపీయేతర పార్టీల నేతలను కలుస్తున్న విషయం తెలిసిందే.

కోర్టు బోనెక్కి సాక్ష్యం చెప్పనున్న ప్రిన్స్ హ్యారీ



లండన్: బ్రిటన్ రాజు చార్లెస్ –3 చిన్న కుమారుడు ప్రిన్స్ హ్యారీ సాక్ష్యం ఇవ్వడానికి వచ్చే వారంలో కోర్టుకు హాజరుకానున్నారు. రాజకుటుంబానికి చెందినవారు ఇలా కోర్టు బోనెక్కడం 130 ఏళ్లలో ఇది తొలిసారి. డైలీ మిర్రర్, సండే మిర్రర్ వంటి వార్తా పత్రికల ప్రచురణ సంస్థ మిర్రర్ గ్రూప్ న్యూస్‌పేపర్స్ (ఎంజీఎన్) సెలిబ్రిటీల వ్యక్తిగత అంశాలను సేకరించడం కోసం చట్ట విరుద్ధంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందన్న ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలపై 100 మంది సెలిబ్రిటీలతో పాటు ప్రిన్స్ హ్యారీ కూడా మిర్రర్ గ్రూప్‌పై కోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసును విచారిస్తున్న లండన్ హైకోర్టులో ప్రిన్స్ హ్యారీ హాజరై ఫోన్ ట్యాంపింగ్‌పై సాక్ష్యం ఇవ్వనున్నారు. గతంలో 1870లో ఎడ్వర్డ్–7 ఒక విడాకుల కేసులో సాక్ష్యమిచ్చారు.

ఎన్ఐఏ కస్టడీకి పీఎఫ్ఐ సభ్యులు

సాక్షి, చెన్నై: నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)కి చెందిన ఐదుగురిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) శుక్రవారం కస్టడీలోకి తీసుకుంది. ఐసిస్‌కు అనుకూలంగా, దేశంలో మైనారిటీ పాలనే లక్ష్యంగా పీఎఫ్ఐ సాగిస్తున్న ప్రయత్నాలపై అనుమానంతో వివిధ ప్రాంతాల్లో దాడులు జరిపి తమిళనాడుకు చెందిన 10 మంది సహా దేశ వ్యాప్తంగా 106 మందిని ఎన్ఐఏ ఇటీవల అరెస్టు చేసింది. వీరిచ్చిన సమాచారం ఆధారంగా చెన్నై, మదురై, దిండుగల్, తేనిలకు చెందిన అయిదుగురిని ఎన్ఐఏ అదుపులోకి తీసుకుంది.

బీజేపీని త్వరలో మట్టికరిపిస్తాం

ప్రతిపక్షాల ఐక్యత సాధిస్తాం: రాహుల్
- సాధారణ ఎన్నికల్లో ఆశ్చర్యకర ఫలితాలు
- ఐయూఎంఎల్ పూర్తి సెక్యులర్ పార్టీ



వాషింగ్టన్: త్వరలో మూడు, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు జరగనున్న ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత ప్రజానీకంలో అత్యధికుల మద్దతు లేని బీజేపీని ఓడించేందుకు అవసరమైన సాధనసంపత్తి, సత్తా తమ పార్టీకున్నాయని తెలిపారు. అమెరికాలో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ గురువారం భారతీయ అమెరికన్లతో, నేషనల్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రముఖ భారతీయ అమెరికన్ ఫ్రాంక్ ఇస్లాం ఇచ్చిన విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వివిధ అంశాలపై మాట్లాడారు. ‘ఆర్ఎస్ఎస్, బీజేపీలను ఎవరూ అడ్డుకోలేరనే ఒక రకమైన ధోరణి ప్రజల్లో ఉంది. కానీ, అది నిజం కాదు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటకలో మాదిరిగానే ఆ పార్టీని ధీటుగా ఢీకొంటాం. ముఖాముఖి పోరులో బీజేపీ ఓటమి ఖాయం’అని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. రానున్న సాధారణ ఎన్నికల్లో ఆశ్చర్యకరమైన ఫలితాలు రానున్నాయని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీల ఐక్యత మరింత బలపడుతుందన్నారు. కేరళలో కాంగ్రెస్–ఐయూఎంఎల్ పొత్తుపై రాహుల్ గాంధీ స్పందిస్తూ..ముస్లింలీగ్ పూర్తి సెక్యులర్ పార్టీ. ఆ పార్టీలో సెక్యులర్ కాదని చెప్పేందుకు ఏమీ లేదు’అంటూ రెండు పార్టీల మైత్రిని సమర్థించుకున్నారు. ప్రధాని మోదీకి ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆదరణపై ఆయన స్పందిస్తూ..దేశంలోని మీడియా సహా అన్ని వ్యవస్థలపై మోదీ ప్రభుత్వం పట్టుబిగించింది. మోదీకి ఆదరణ అంటూ వస్తున్న వార్తలను నేను నమ్మను’అని అన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థలు కుప్పకూలితే యావత్ ప్రపంచంపైనే ప్రభావం పడుతుందని చెప్పారు. కాగా, ఐయూఎంఎల్‌ను సెక్యులర్ పార్టీ అంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ విభజన కారకుడు అలీ జిన్నా స్థాపించిన ఆలిండియా ముస్లిం లీగ్ సిద్ధాంతాలనే ఐయూఎంఎల్ పాటిస్తోందంటూ ఆరోపించింది. హిందూ టెర్రరిజం అంటూ మాట్లాడే రాహుల్, ముస్లింలీగ్‌ను మాత్రం సెక్యులర్ అంటున్నారని విమర్శించింది.



వివాహానంతరం అమ్మాన్‌లో ఆహూతులకు అభివాదం చేస్తున్న జోర్డాన్ యువరాజు హుసేన్, రజ్వా అల్ సైఫ్ దంపతులు. గురువారం అంగరంగ వైభవంగా జరిగిన వారి వివాహ వేడుకల్లో పలు దేశాల రాచ కుటుంబీకులు పాల్గొన్నారు. సౌదీ అరేబియా రాజ కుటుంబానికి చెందిన రజ్వా ఆర్కిటెక్ట్‌గా పని చేస్తున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 3 : జూన్ : 2023



మండ్య : మండ్య జిల్లా కేఆర్ పేటె తాలూకా బూకనకెరె గ్రామంలో శుక్రవారం డింకమ్మదేవి వేడుకల సందర్భంగా అమ్మవారికి హారతులు తీసుకెళ్తున్న మహిళలు

న్యూస్‌రీల్

ఉప ముఖ్యమంత్రి పూజలు



దేవాలయంలో పూజలు చేస్తున్న డీకే శివకుమార్ దంపతులు

దొడ్డబళ్లాపురం: మొదటిసారిగా మంత్రివర్గ సమావేశానికి హాజరయ్యేందుకు బయలుదేరిన ఉప ముఖ్యమంత్రి శుక్రవారం టెంపుల్ రన్ చేపట్టారు. కనకపుర పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం రాత్రి జరిగిన కుంభాభిషేకంలో డీకే శివకుమార్ దంపతులు పాల్గొన్నారు. అక్కడే ఎక్కువ సమయం గడిపి ప్రసాదం స్వీకరించారు. శుక్రవారం మంత్రివర్గ సమావేశం ఉన్నందున గురువారం అర్ధరాత్రి తిరిగి బెంగళూరుకు బయలుదేరారు. శనివారం ఆయన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపేందుకు కనకపుర తాలూకాలో పర్యటించనున్నారు.

యావజ్జీవ ఖైదీకి పెరోల్

శివాజీనగర: యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఖైదీకి హైకోర్టు మూడు వారాల పెరోల్ ఇచ్చింది. వివరాలు... ఓ హత్య కేసులో శివప్ప బెల్లద బెంగళూరు గ్రామీణ జిల్లాలోని దేవనహళ్లి ఆరు బయలు జైలులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నారు. అనారోగ్యంతో ఉన్న తన తల్లితో కొద్ది రోజులు కలిసి ఉండేందుకు అనుమతి ఇవ్వాలని జైలు అధికారులకు విన్నవించారు. అధికారులు నిరాకరించారు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను సింగిల్ బెంచ్ న్యాయమూర్తి కృష్ణ ఎస్ దీక్షిత్ విచారణ చేశారు. మరణశయ్యపై ఉన్న తల్లిని చూడటానికి బిడ్డకు హక్కు ఉందని, నిరాకరించడం సబబు కాదన్నారు. తల్లిని కలుసుకునేందుకు శివప్పకు మూడు వారాల పెరోల్ ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పాలికెకు బ్యాటరీ ఆటోలు



అందజేసిన ఆటోలు

మైసూరు: ఐసీఐసీఐ ఫౌండేషన్ సంస్థ తన సామాజిక బాధ్యత నిధి ద్వారా మైసూరు మహా నగర పాలికెకు 15 బ్యాటరీ ఆటోలు అందజేసింది. శుక్రవారం పాలికె కార్యాలయంలో మేయర్ శివకుమార్‌కు ఐసీఐసీ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు సుకేశ్‌సుకుమార్ ఆటోలను అందజేశారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు తరలించేందుకు ఈ ఆటోలను వినియోగిస్తారు.

డీసీఎంకు మళ్లీ ఊరట

శివాజీనగర: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు మళ్లీ భారీ ఊరట లభించింది. హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర స్టే పొడిగించారు. ప్రస్తుతం న్యాయమూర్తి ఎంపీ.నాగప్రసన్న ధర్మాసనానికి కేసు బదిలీ అయ్యింది. కేసు విచారణ చేసిన న్యాయమూర్తి హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర స్టేను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా స్టే ఎత్తివేసి విచారణకు అనుమతి ఇవ్వాలని సీబీఐ హైకోర్టులో అప్పీలు చేసిన విషయం తెలిసిందే.

డీకే సురేశ్‌పై నమోదైన కేసు కొట్టివేత

డీసీఎం డీకే శివకుమార్ తమ్ముడు, ఎంపీ డీకే సురేశ్‌పై నమోదైన కేసును రద్దుచేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో నగదు పంపిణీ చేశారని ఆరోపిస్తూ అప్పట్లో డీకే సురేశ్‌పై భద్రావతి పేపర్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. డీకే సురేశ్‌తో పాటు మొత్తం ఆరుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తనకు వ్యతిరేకంగా నమోదైన కేసు రద్దు చేయాలని ఆయన హైకోర్టుకు వెళ్లారు. పిటిషన్‌ను విచారణ చేసిన న్యాయమూర్తి ఎం.నాగ ప్రసన్న ఎఫ్ఐఆర్‌ను కొట్టి వేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఏ చెట్టు ఎప్పుడు కూలుతుందో?





ఇటీవల బెంగళూరు నగరంలో కురిసిన వర్షాలకు నేలకూలిన వృక్షాలు

ఉద్యాననగరిలో వర్షాకాలం ప్రారంభం కాగానే చిన్నపాటి గాలులకే వృక్షాలు, చెట్లుకొమ్మలు విరిగిపోతూ నగరవాసులను హడలెత్తిస్తున్నాయి. దారిలో వెళ్తున్న వాహనాలపై చెట్లు కూలి ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షంలో తడవకుండా చెట్టుకిందకు వెళ్లాలంటే జనం జంకుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు 300కు పైగా చెట్లు కూలిపోయాయి. నగరరోడ్లు కాంక్రీట్‌మయం కావడం, వేర్లలో పటుత్వం లేక వృక్షాలు కూలిపోతున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

- బెంగళూరు సిటీలో చిన్నపాటి గాలివానకే నేలవాలుతున్న వృక్షాలు
- భీతిల్లుతున్న నగర వాసులు
- రోడ్లు, ఫుట్‌పాత్‌ల కోసం పదేపదే తవ్వకాలు
- భూమిలోకి చొచ్చుకెళ్లలేని వేర్లు
- స్థానిక జాతుల మొక్కలు నాటాలంటున్న నిపుణులు
- పట్టించుకోని పాలికె అధికారులు

బనశంకరి: 1980లో రాష్ట్రంలో సామాజిక అరణ్య పథకం అమల్లోకి వచ్చింది. దీంతో నగర అటవీకరణ పేరుతో బెంగళూరులో మృదువైన స్పాదోడియా, డెలోనిక్స్‌రెజిమా తదితర మొక్కలు నాటారు. ఇవి బలమైన వేర్లతో భూమిలోకి వెళ్లి భారీ వృక్షాలుగా మారకముందే అభివృద్ధి పేరుతో ఫుట్‌పాత్ మార్గాలను కాంక్రీటీకరణ చేశారు. దీంతో వేర్లు భూమిలోకి వెళ్లలేక పటుత్వం కోల్పోయాయి. దీనికితోడు వేర్లకు నీరు, పోషకాలు సరిగా అందక చెట్లు నిర్వీర్యం అవుతున్నాయి. ఫలితంగా గాలివానకు చెట్లు కూలిపోతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైన అనంతరం చెట్లు కూలిపోయే సంఖ్య మరింత పెరుగుతుందని యుఏఎస్ బెంగళూరు అటవీ పరిసరవిజ్ఞాన విభాగ మాజీ చీఫ్ డాక్టర్ సీ.నాగరాజయ్య అంటున్నారు. 'బెంగళూరులాంటి మహానగరంలో వేప చెట్లు నాటడం ఉత్తమం. వీటి వేర్లు భూమిలోపల చొచ్చుకువెళ్లడంతో పాటు వాయు కాలుష్యాన్ని తగ్గించే గుణం కూడా ఉంది. బీబీఎంపీ అప్పుడప్పుడు చెట్ల కొమ్మలు కత్తిరించడం కూడా ప్రమాదాలకు కారణం. చెట్లు ఆరోగ్యస్థితిగతి, చెట్ల గణన చేస్తే ఎన్ని చెట్లు దురవస్థలో ఉన్నాయనేది లెక్క తేలుతుంది. చెట్ల సంరక్షణ, వాటి ఎదుగుదలను పరిశీలించాలని గతంలో బీబీఎంపీకి ప్రతిపాదన అందజేశాం. కానీ ఎలాంటి స్పందనలేదు' అని నాగరాజయ్య అంటున్నారు.

మొక్కలు నాటేటప్పుడు జాగ్రత్త వహించాలి

చెట్లు కూలిపోవడాన్ని నియంత్రించాలంటే స్థానిక పరిసరాలకు అనుగుణమైన వృక్షజాతుల మొక్కలను ఎంచుకోవాలి. మూడు అడుగుల లోతులో చెట్లు నాటాలి. ఆ స్థలంలో సిమెంటు, తారురోడ్లు వేయరాదు. మొక్కల వేర్లు నాలుగునుంచి ఐదు అడుగుల లోతులోకి వెళ్లాలి. క్రమేణా ఏడాదిలోగా రెండు అడుగుల వరకు చెట్లు పెరిగితే భారీ గాలి వర్షానికి తట్టుకునే శక్తి కలిగి ఉంటుంది. స్థానిక వృక్షజాతుల మొక్కలు నాటడంపై బీబీఎంపీ దృష్టిసారించాలి. గతంలో బీబీఎంపీకి ప్రతిపాదన అందజేశా. కానీ పాలికె దీనిపై దృష్టి సారించలేదు.

– పరిసరవాది యల్లప్పరెడ్డి

పచ్చదనం దెబ్బతింటోంది

రోడ్లు, కేబుల్ తదితర పనులకు పదేపదే తవ్వకాలు జరగడంతో చెట్ల వేర్లు పట్టుత్వం కోల్పోయి వృక్షాలు నేలకూలుతున్నాయి. ఫలితంగా పచ్చదనం కోల్పోయి పర్యావరణం దెబ్బతింటోంది. ఈ సమస్యలు పరిష్కరించాలంటే పదేపదే రోడ్లు తవ్వడం నిలిపివేయాలి. వాహనాల సంచార ఒత్తిడి తట్టుకునే బలమైన వేర్లు భూమిలోకి వెళ్లే విభిన్నజాతుల మొక్కలు నాటాలి

–రవీంద్రరేష్మ, వృక్షశాస్త్ర అధ్యాపకుడు

పథకాలు గ్యారంటీగా అమలు



మాట్లాడుతున్న సిద్దరామయ్య, చిత్రంలో డీకే.శివకుమార్ తదితరులు

- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం
- ఐదు హామీలను నెరవేరుస్తాం
- సీఎం సిద్దరామయ్య

బనశంకరి: ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 5 గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పష్టం చేశారు. శుక్రవారం విధానసౌధలో మంత్రివర్గ సమావేశం అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి పథకాల అమలుకు సంబంధించి ప్రకటన చేశారు. ప్రతి కుటుంబ యజమానికి నెలకు రూ.2 వేలు, కేఎస్ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం , ప్రతి కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్, అన్నభాగ్య కింద ప్రతి ఒక్కరికీ ఉచితంగా 10 కిలోల బియ్యం, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అందిస్తామని ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని సీఎం తెలిపారు. ప్రతి ఇంటికీ ఈ ఐదు హామీలను అమలు చేస్తామని చెప్పారు. హామీల అమలుపై ప్రతిపక్షాల నేతలు విమర్శలు చేశారని, మీడియాలో ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేశారన్నారు. మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించామని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదుగ్యారంటీలు అమల్లోకి తీసుకురావాలని తీర్మానించామన్నారు. కుతమతాలకు అతీతంగా ఈ పథకాలను ప్రజలుకు అందిస్తామని తెలిపారు.

శక్తియోజన : ఏసీ, స్లీపర్ బస్సులు మినహా మిగిలిన కేఎస్ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి శక్తియోజన పథకాన్ని జూన్ 11నుంచి అమలు చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికైనా ఈ బస్సుల్లో ప్రయాణించవచ్చు. ఇతర రాష్ట్రాలకు వెళ్లడానికి ఈ పథకం వర్తించదు.

గృహజ్యోతి : 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే గృహజ్యోతి జులైనుంచి అమలు చేస్తారు.

గృహలక్ష్మి: ఇంటి యజమానికి ప్రతినెల రూ.2 వేలు అందించే గృహలక్ష్మి పథకాన్ని ఆగస్టు 15నుంచి అమలు చేస్తారు.

అన్నభాగ్య: ప్రతి కార్డుదారుడికీ పదికిలోలు బియ్యం ఉచితంగా అందించే అన్నభాగ్య పథకాన్ని జూలై 1నుంచి అమలు చేస్తామన్నారు.

యువనిధి: డిగ్రీ పట్టభద్రులకు రూ.3వేలు, డిప్లొమా అభ్యర్థులకు రూ.15వేలు అందించే యువనిధి పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఈ పథకానికి తేదీ ప్రకటించలేదు.

హామీల అమలుపై గందరగోళం

- మాజీ సీఎం బసవరాజ బొమ్మై

బనశంకరి: ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని సీఎం సిద్దరామయ్య ప్రకటించినా వాటి అమలులో గందరగోళం నెలకొందని మాజీ సీఎం బసవరాజ బొమ్మై వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పథకాల అమలుపై ఆదేశాలు వచ్చినప్పుడే వాటి అమలుపై స్పష్టత వస్తుందన్నారు. ఐదు పథకాల అమలు నేపథ్యంలో గత పథకాలను నిలిపివేస్తారా ? అని ఆయన ప్రశ్నించారు. జలజీవన్‌మిషన్‌కు గతంలో తమ ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. శక్తి యోజన కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారని, కానీ రాష్ట్రానికి మాత్రమే పరిమితం చేశారన్నారు. కేంద్రం ఇప్పటికే ఉచితంగా 5 కిలోలు బియ్యం అందిస్తుండగా కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన 5 కిలోలు మాత్రమే అందిస్తుందన్నారు. ఉచితంగా ఇచ్చే పది కిలోల్లో రాగులు, జొన్నలు ఉంటాయా? లేక అదనంగా ఇస్తారా? అన్న విషయంలో గందరగోళం నెలకొందన్నారు.

ఓబీసీ రిజర్వేషన్‌కు మఠాధిపతుల డిమాండ్

శివాజీనగర: రాష్ట్రంలో రిజర్వేషన్ ప్రతిపాదన మళ్లీ తెరపైకి రాగా, వీరశైవ లింగాయత్ ఉప కులాలకు కేంద్ర ప్రభుత్వం ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని వందకు పైగా మఠాధిపతులు ఐక్యతతో ప్రతిపాదించి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని విజయనగర బసవేశ్వర సుజ్ఞాన మంటపంలో జరిగిన రిజర్వేషన్ సమావేశంలో శ్రీశైల పీఠం జగద్గురు చన్నసిద్ధరామ పండితారాధ్య స్వామి, కాశీపీఠం జగద్గురు డాక్టర్ చంద్రశేఖర్ స్వామి, విభూతీపుర మఠం మహాంతలింగ స్వామి, వీరశైవ లింగాయత్ మండలి మాజీ అధ్యక్షుడు పరమశివయ్య, న్యాయవాది గంగాధర గురుమఠ్‌తో పాటు పలువురు పాల్గొని, కేంద్ర ఓబీసీ రిజర్వేషన్‌లో అన్ని వీరశైవ లింగాయత్ అనుబంధ శాఖలను ఐక్యపరచాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించారు. ఆ తరువాత చెన్న సిద్దరామ పండితరాధ్య స్వామి మాట్లాడుతూ... ఓబీసీ జాబితాలో వీరశైవ లింగాయత్ సమాజపు అనుబంధ కులాలను చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సమావేశం ఏర్పాటు చేశామని, దశాబ్దాల నుంచి తమ సామాజిక వర్గం పోరాటం చేస్తూనే ఉందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వీరశైవ లింగాయత్ సముదాయానికి చెందిన అన్ని ఉప కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

'భౌ'తిక దాడులతో జనం బెంబేలు



కుక్కల దాడిలో చిన్నారి చేతికి గాయం



గాయపడిన చిన్నారి

- కుక్కల సంతతి నియంత్రణలో అధికారులు విఫలం

తుమకూరు : తుమకూరు జిల్లా తిపటూరు తాలూకాలోని రంగాపుర గ్రామంలో వీధిశునకాల బెడద తీవ్రంగా మారింది. మందలుగా సంచరిస్తూ రోడ్లపై వెళ్తున్న వృద్ధులు, చిన్నారులపై దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. దీంతో రోడ్డుపైకి వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. గ్రామంలోని గాంధీనగర, అరసు నగర, చాముండేశ్వరి నగరలో శునకాల బెడద తీవ్రంగా ఉంది. ఆదివారం నుంచి ఇప్పటివరకు ముగ్గురు చిన్నారులు గాయపడ్డారు. రంగాపుర రోడ్డులో నివాసం ఉంటున్న 8 సంవత్సరాల నూరాని బాను, 8 సంవత్సరాల షరీఫ్, సిద్దిక్ అనే బాలుడు కుక్కలదాడిలో తీవ్రంగా గాయపడ్డారు. వీధిశునకాలను నియంత్రించాలని కోరుతున్నా నగరసభ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కుక్కల సంతతిని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.



బనశంకరిలో లక్ష కుంకుమార్చన

బనశంకరి: బనశంకరీదేవి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా శుక్రవారం సాయంత్రం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున ఈ పూజలో పాల్గొన్నారు.

యువతిపట్ల అసభ్య ప్రవర్తన

- ప్రశ్నించిన యువకుడిపై బీర్‌బాటిల్‌తో దాడి
- కేరళ యువకుల వీరంగం

బనశంకరి: యువతి దుస్తులు, శరీర ఆకృతిపై అసభ్యంగా మాట్లాడటమే కాకుండా ప్రశ్నించిన యువకుడిపై కేరళకు చెందిన యువకులు బీర్‌బాటిల్‌తో దాడి చేశారు. ఈఘటన బెంగళూరులోని కొత్తనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. తిలక్ అనే యువకుడు తన బంధువైన సంధ్యాకుమార్‌తో కలిసి కొత్తనూరులోని ఒయూ పబ్‌కు వెళ్లారు. ఈ సమయంలో యువతి పట్ల కేరళకు చెందిన ముగ్గురు యువకులు అసభ్యకరంగా వ్యవహరించారు. ఈ విషయంపై ప్రశ్నించిన తిలక్‌ను అసభ్యపదజాలంతో దూషించి బీర్‌బాటిల్‌తో దాడిచేసి అంతుచూస్తామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి



రవి మృతదేహం



మృతుడు రవి(ఫైల్)

మైసూరు: ఏనుగు దాడిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా సరగూరు తాలూకా బీ.మట్టకెరె గ్రామంలో చోటు చేసుకుంది. హిరెహళ్లికి చెందిన రవి కుమార్ అనే వ్యక్తి సీగేవాడి ఎనే అడవి సమీపంలోని తన పొలానికి వెళ్లాడు. ఆహారం కోసం వచ్చిన ఏనుగు అతనిపై దాడి చేసి కాళ్లతో తొక్కి హతమార్చింది. అటవీశాఖ అధికారులు, పోలీసులు వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

యడియూరప్పతో బొమ్మై భేటీ



బీఎస్.యడియూరప్పతో సమావేశమైన బసవరాజ బొమ్మై

బనశంకరి: శాసనసభలో ప్రతిపక్షనేత ఎంపికపై చర్చించేందుకు బీజేపీ సీనియర్ నేత యడియూరప్పతో మాజీ సీఎం బసవరాజ బొమ్మై శుక్రవారం భేటీ అయ్యారు. ప్రతిపక్ష స్థానం ఎవరికి అప్పగించాలనే దానిపై చర్చలు జరిపారు. కానీ ఎలాంటి నిర్ణయానికి రాలేదు. నూతన నేత ఎంపిక ప్రక్రియ త్వరగా ముగించాలని చర్చించారు. గతంలో ఉప నేతగా ఉన్న ఆర్.అశోక్, సీనియర్ ఎమ్మెల్యే బసవగౌడపాటిల్ యత్నాళ్, సునీల్‌కుమార్‌తో పాటు కొందరు ప్రతిపక్షస్థానం కోసం లాబీయింగ్ చేస్తున్నారు. అయితే బొమ్మైను కొద్దిరోజుల పాటు కొనసాగించాలని తీర్మానించినట్లు సమాచారం.

పెళ్లి సందడి



పసుపుశాస్త్రంలో అభిషేక్

యశవంతపుర: దివంగత నటుడు అంబరీశ్ ఇంటిలో పెళ్లి సందడి మొదలైంది. అంబరీశ్, ఎంపీ సుమలత దంపతుల కుమారుడు అభిషేక్ వివాహం వధువు అవివా బిడ్డప్పతో ఈనెల 5న ప్యాలెస్ మైదానంలో జరగనుంది. ఇందులో భాగంగా శుక్రవారం శాస్త్రబద్ధంగా పసుపుశాస్త్రం కార్యక్రమం జరిగింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యాయి.

కేఎస్‌ఆర్టీసీ బస్సుపై ఏనుగు దాడి

యశవంతపుర: బస్‌ను ఏనుగు అడ్డుకొని దంతాలతో పొడిచి బీభత్సం సృష్టించింది. దీంతో ప్రయాణికులు భీతిల్లారు. వివరాలు... కేఎస్ ఆర్టీసీ స్లీపర్ కోచ్ బస్సు గురువారం రాత్రి దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరు నుంచి కాణియూరు, సుబ్రహ్మణ్య మార్గంలో బెంగళూరుకు బయల్దేరింది. అర్ధరాత్రి సమయంలో కెంద్యాల గ్రామం వద్ద ఏనుగు అడ్డుగా వచ్చింది. దంతాలతో బస్‌బాడీని పొడిచి బీభత్సం సృష్టించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. డ్రైవర్ చాకచక్యంతో బస్‌ను నెమ్మదిగా ముందుకు తీసుకెళ్లి నిలిపివేశాడు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారి రాఘవేంద్ర సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఏనుగు అక్కడినుంచి వెళ్లిన అనంతరం బస్ బెంగళూరుకు బయల్దేరింది.



కూలిన చెట్లు, రేకులషెడ్డు



వర్షం నీరు నిలవడంతో వాహనదారుల ఇబ్బందులు

గాలివాన బీభత్సం

తుమకూరు : జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు కురిసిన వర్షాలు బీభత్సం సృష్టించాయి. గాలివానకు పలు గ్రామాల్లో చెట్లు కూలిపోయాయి. మిద్దెలపై రేకులు ఎగిరిపోయాయి. రేకులషెడ్డులు కుప్పకూలాయి. హుళియారు మార్గంలో ఉన్న జాతీయ రహదారి-69లో వరద నీరు నిలిచి వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళూరు నుంచి విశాఖపట్టణం వెళ్లే ఈ రహదారిలో హుళియారులో కొన్ని నెలలుగా రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇక్కడ వర్షం నీరు నిలవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

క్లుప్తంగా

వైభవంగా కంచు మారెమ్మ జాతర మహోత్సవం



భక్తులతో కలిసి ఉత్సవంలో పాల్గొన్న శాంతమల్ల శివాచార్య స్వామీజీ

రాయచూరు రూరల్: నగరంలోని హరిజనవాడలో వెలసిన కంచు మారెమ్మ జాతర వైభవంగా జరిగింది. గురువారం రాత్రి ఆలయం వద్ద శాంతమల్ల శివాచార్య స్వామీజీ, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, వందలాది మంది భక్తుల సమక్షంలో రథాన్ని లాగారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరి మృతి

- 11కు పెరిగిన మృతుల సంఖ్య
- ఇంకా తేరుకోని సంగనకల్లు

సాక్షి,బళ్లారి: మూడు రోజుల క్రితం మైసూరు సమీపంలోని టీ.నరసీపుర వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తాలూకాలోని సంగనకల్లు గ్రామానికి చెందిన 9 మందితో పాటు ఇన్నోవా కారు డ్రైవరుతో కలిపి 10 మంది మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడి మైసూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. వీరిలో సందీప్ అనే యువకుడు శుక్రవారం మృతి చెందడంతో మృతుల సంఖ్య 11కు చేరింది. గ్రామానికి చెందిన మూడు కుటుంబాల వారు విహారయాత్రకు వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఆ విషాదం నుంచి గ్రామం ఇంకా తేరుకోలేదు.

నేటి నుంచి జిల్లాలో మంత్రి పర్యటన



మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్ : నగరానికి చెందిన చిన్న నీటిపారుదల, సైన్స్ టెక్నాలజీ శాఖా మంత్రి బోసురాజు శనివారం నుంచి జిల్లాలో చేపట్టనున్న పర్యటన ఖరారైంది. శుక్ర వారం రాత్రి మంత్రాలయంలో బస చేసి శనివారం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయనకు సన్మానం చేస్తారు. మధ్యాహ్నం దేవదుర్గ తాలూకా రేకల మరడిలో అతిసార బాధితులను పరామర్శిస్తారు. ఆదివారం లింగసూగూరు, మస్కిల్లో, సోమవారం నగరంలోని మున్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో చేపట్టే ఎద్దుల పోటీల ప్రారంభోత్సవం, 11 గంటలకు జెడ్పీ సభాభవనంలో సమావేశంలో మంత్రి పాల్గొంటారని ప్రకటనలో తెలిపారు.

కలుషిత ఆహారం తిని 20 మందికి అస్వస్థత

సాక్షి,బళ్లారి: కలుషిత ఆహారం తిని 20 మంది అస్వస్థతకు గురైన ఘటన విజయపుర జిల్లాలో చోటు చేసుకుంది. శుక్రవారం చడచణ తాలూకా డోణ గ్రామానికి చెందిన వారు మొక్కు తీర్చుకునేందుకు ఆళంద తాలూకా లాడ్లే మషాక్ దర్గాకు వెళ్లారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేసిన తర్వాత ఇంటి నుంచి తెచ్చిన ఆహారాన్ని దర్గా వద్దే సామూహికంగా తిన్నారు. ఆహారం తీసుకున్న కొద్దిసేపటికి ఒకరి తర్వాత మరొకరికి వాంతులు, విరేచనాలు కావడంతో భక్తులంతా దర్గా వద్దనే కుప్పకూలిపోయారు. దీంతో ఆందోళన చెంది వెంటనే వారిని ఆళందలోని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యుడు ప్రమోద్ తక్షణం స్పందించి చికిత్స చేయగా ప్రస్తుతం అందరూ కోలుకుంటున్నారని తెలిపారు.

అతిసారతో 20 మందికి అనారోగ్యం



చికిత్స పొందుతున్న బాధితులు

రాయచూరు రూరల్: కలుషిత నీరు తాగి 20 మంది అస్వస్థతకు గురైన ఘటన శుక్రవారం లింగసూగూరు తాలూకా యర్రగుంటలో జరిగింది. అనారోగ్యం బారిన పడిన వారికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. నాలుగు రోజులుగా గ్రామంలోని శుభ్రం చేయని నీటి ట్యాంక్ నుంచి సరఫరా అయిన కలుషిత నీటిని తాగడంతో వాంతులు, విరేచనాలతో ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ ఉదంతంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. కాగా బాధితులను తహసీల్దార్ జామదార్, డీహెచ్ఓ సురేంద్ర బాబు, టీహెచ్ఓ, పీడీఓ, పంచాయతీ అధికారి రామకృష్ణ పరామర్శించారు.

సఫాయి కర్మచారుల ధర్నా

కోలారు: తమ వివిధ డిమాండ్ల సాధన కోసం సఫాయి కర్మచారులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాన్యువల్ స్కావెంజర్ల నియామకాలను నిషేధించాలని, పునర్వసతి-2013 చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాన్యువల్ స్కావెంజర్లకు ప్రత్యామ్నాయ ఉద్యోగం, సహాయధనం అందించాలని, 60 ఏళ్లు పైబడిన వారికి రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని ఒత్తిడి చేశారు. ధర్నాలో కావలు సమితి రాష్ట్ర సంచాలకురాలు ఎం.పద్మ, జాగృతి ఇన్‌ఛార్జి సమితి సభ్యుడు లక్ష్మీసాగర్, వెంకటరాం తదితరులు పాల్గొన్నారు.

నాడు వైభవం.. నేడు అధ్వానం



మరమ్మతుకు నోచుకోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం



నిరుపయోగంగా ఉన్న మూత్రశాల

- శిథిలావస్థలో నిజాం కాలంలో నిర్మించిన పాఠశాల భవనం
- రూ.31 లక్షల గ్రాంట్ వచ్చినా నాసిరకం పనులతో అభివృద్ధికి గ్రహణం

గంగావతి రూరల్: రెక్కాడితే కానీ డొక్కాడని పేద కూలీ కార్మికులు, రిక్షా, ఆటోవాలాలు, హమాలీ, బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకునే పాఠశాలలపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎంత నిర్లక్ష్యమో పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల దుస్థితిని చూస్తే అర్థం అవుతుంది. ప్రభుత్వాలు పాఠశాలల అభివృద్ధి పనులకు వేల కోట్లు వెచ్చిస్తున్నా అవినీతి రాజకీయ నాయకులు, లంచగొండి అధికారుల వల్ల పాఠశాలలు అభివృద్ధికి నోచుకోలేకపోతున్నాయి. ఈ హైస్కూల్‌కు 2017-18వ సంవత్సరంలో గదుల మరమ్మతు కోసం రూ.31 లక్షల నిధులు మంజూరయ్యాయి. వచ్చిన గ్రాంట్‌తో నాసిరకపు పనులను చేపట్టి ప్రజాప్రతినిధుల పర్సంటేజీ, అధికారుల ముడుపుల పేరుతో పనులను గాలికి వదిలి తమ జేబులు నింపుకోవడంతో ఐదేళ్లు గడిచినా కూడా ఈ పాఠశాలకు ఇంకా మోక్షం కలగలేదు.

భూత్ బంగ్లాగా మారిన విద్యాలయం

ప్రస్తుతం ఈ పాఠశాలలో 326 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 18 గదులు కలిగి పట్టణ నడిబొడ్డున వెలసినా కానీ నాసిరకపు పనులతో ఏ గదికి కూడా తలుపులు, కిటికీలు లేవు. క్లాస్ రూమ్‌లో గుంతలతో పాటు కరెంటు వ్యవస్థ సరిగా లేక బూత్ బంగ్లాలా మారింది. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గద్దెప్ప తరచు ప్రజా ప్రతినిధులకు, సంబంధిత అధికారులకు లేఖలు, మనవి పత్రాలు రాసినా ఎలాంటి ఉపయోగం లేకపోయింది. పైగా స్థానిక ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ నుంచి ప్రధానోపాధ్యాయుడికి నాసిరకపు పనులతో నిర్మాణమైన గదులను మీరు హస్తగతం చేసుకోవాలని ఒత్తిడి వచ్చినా అందుకు ప్రధానోపాధ్యాయుడు ససేమిరా అనడంతో పాఠశాల అభివృద్ధి అర్థంతరంగానే మిగిలింది. ఈనేపథ్యంలో నూతన ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి ఈ పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి వీలుగా పాఠశాల గదులు, మరుగుదొడ్ల మరమ్మతులకు నిధులను కేటాయించాలని నగరవాసులతో పాటు పేద విద్యార్థులు మొరపెడుతున్నారు.



ఇనుప చువ్వలు తేలిన పాఠశాల పైకప్పు



విరిగిన తరగతి గది తలుపులు

జేజేఎం పథకం నిధుల వృథా



మాట్లాడుతున్న శివశరణప్ప జానేకల్

రాయచూరు రూరల్: జిల్లాలోని ఏడు తాలూకాల్లో జల జీవన్ మిషన్(జేజేఎం) పథకంలో రూ.2500 కోట్ల నిధులను అధికారులు వృథా చేశారని మాన్వి టీపీ సభ్యుడు శివశరణప్ప జానేకల్ ఆరోపించారు. శుక్రవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2020-21వ సంవత్సరంలో తాగునీటి పథకాల పనులను నాసిరకంగా చేపట్టి నిధులను ఇంజనీర్లు దిగమింగారన్నారు. జెడ్పీ సీఈఓ శశిధర్‌ను బదిలీ చేయాలని, జేజేఎం పథకం ఇంజినీర్లు శశికాంత్, నాగరాజ్, ప్రభులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

వరుడి దారుణహత్య



నింగప్ప(ఫైల్)

హుబ్లీ: జిల్లాలోని కలఘటిగి తాలూకా జిన్నూరు గ్రామంలో ఈనెల 7న పెళ్లి పీటలు ఎక్కాల్సిన ఓ యువకుడు దారుణహత్యకు గురైన ఘటన చోటు చేసుకుంది. యువకుడు నింగప్ప బూదప్ప నవలూరు(28) అనే యువకుడు తోటలోని ఇంట్లో నిద్రపోతుండగా కళ్లల్లో కారం పొడి చల్లి గొంతు నులిమి దుండగులు చంపేశారు. నింగమ్మ తావరగేరా అనే యువతితో ఈ నెల 7న పెళ్లి నిశ్చయమైంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటున్నారు. ఈక్రమంలో హత్య జరగడంపై హతుడి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ హత్యకు కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కమిషనర్ బదిలీకి డిమాండ్



మాట్లాడుతున్న మహావీర్

రాయచూరు రూరల్: నగరసభ కమిషనర్ గురులింగప్పను బదిలీ చేయాలని ఉస్మానియా కూరగాయల మార్కెట్ క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు మహావీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలో పరిశుభ్రత లోపించిందని, పౌర కార్మికులతో విధులు నిర్వహించకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు.

పాఠశాలలో ఎమ్మెల్యే తనిఖీ



జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటె టౌన్‌లో ఉన్న కేజీ కేబీఎంఎస్ పాఠశాలను హొసకోటె ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు ఆయన స్వీట్లు పంచిపెట్టి తరగతులను ప్రారంభించారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి



గుడ్డేసాబ్ (ఫైల్)

రాయచూరు రూరల్: జిల్లాలోని లింగసూగూరు తాలూకా బెండోణకు చెందిన గుడ్డేసాబ్ ముల్లర్(22) అనే యువకుడు పిడుగుపాటుకు మృతి చెందాడు. గురువారం సాయంత్రం పొలంలో పని చేస్తుండగా పిడుగులతో కూడిన వర్షం కురవడంతో పిడుగుపాటుతో మరణించినట్లు రెవిన్యూ అధికారి రామకృష్ణ తెలిపారు.

కూలీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గంగావతి: నరేగ పథకం కూలీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని హేరూరు గ్రామ పంచాయతీ పీడీఓ రఘుశాస్త్రి అన్నారు. పంచాయతీ పరిధిలోని నాగల చెరువులో ఈ పథకం కింద పూడికతీత పని చేసే కూలీలకు ఏర్పాటు చేసిన ఉచిత చికిత్స శిబిరంలో 198 మంది కూలీలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. శిబిరంలో నరేగ పథకం అధికారి బసవరాజ్ జటగి, ఆరోగ్య శాఖాధికారి శరణబసవ, శివప్ప చౌహాన్, వెంకోబ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎద్దుల పండుగ



మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: మున్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో శనివారం నుంచి నగరంలో మూడు రోజుల పాటు ఎద్దుల పండుగ జరుగుతుంది. ఉత్సవాల నిర్వహణ కోసం ఏపీఎంసీ మైదానంలో ఏర్పాట్లను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఏ.పాపారెడ్డి పరిశీలించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎద్దులకు ఏరువాక పున్నమి సందర్భంగా రాతి దూలం లాగే పోటీలు, పురుష, మహిళా పైల్వాన్లకు కుస్తీ పోటీలు, కళాకారులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మైనార్టీ మహిళలపై అశ్లీల వీడియో వైరల్

- పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన ప్రజలు
- లింగసూగూరులో గట్టి పోలీస్ బందోబస్తు



పోలీస్ స్టేషన్ వద్దకు చేరిన ఆందోళనకారులు

రాయచూరు రూరల్: లింగసూగూరులో రాజు తంబాకు అనే ఆరెస్సెస్ కార్యకర్త సామాజిక మాధ్యమాల్లో మైనార్టీ మహిళలపై పోస్ట్ చేసిన అసభ్యకరమైన వీడియో వైరల్ కావడంతో గురువారం రాత్రి పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీబీ ఫ్యాక్టరీ పేరుతో పోస్టులో రాజు తంబాకు మొబైల్‌లో స్టేటస్ పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న మైనార్టీ సోదరులు ఏకంగా మైనార్టీ మహిళలను నిందించారనే ఆరోపణలతో స్టేషన్ ముందు అర్ధరాత్రి ఆందోళనకు దిగారు. కాగా లింగసూగూరు డీఎస్పీ వేణుగోపాల్ వెంటనే జోక్యం చేసుకుని అశ్లీల వీడియోను పోస్టు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేశారు.

చెరువుల పునశ్చేతనం అవసరం



చెరువు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాలో గ్రామీణ ప్రాంతాలు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నందున అధికారులను చెరువుల పునశ్చేతనానికి చర్యలు చేపట్టాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ అసిస్టెంట్ కమిషనర్ మోతీరామ్ పేర్కొన్నారు. శుక్రవారం సిరవార తాలూకా చాగబావిలో చెరువును ఆయన పరిశీలించారు. శాస్త్రి క్యాంప్, జాలాపూర్ క్యాంప్‌ల్లో అమృత్ సరోవర్ మిషన్ ద్వారా చేపట్టిన పథకాలను విశ్లేషించారు. అనంతరం నరేగ పథకం కింద పనులు చేస్తున్న వ్యవసాయ కూలీ కార్మికులతో సంవాదం జరిపారు. ఆయన వెంట జెడ్పీ డీడీ ప్రకాష్, ఇంజినీర్లు హీరాలాల్, వెంకటేష్, శర్ఫునుషా బేగం, సోమనాథ్, పీడీఓ ప్రసాద్‌లున్నారు.

ఖాళీ కుర్చీలపై మండిపాటు



నగరసభ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఉపవిభాగాధికారిణి వెంకటలక్ష్మి

కేజీఎఫ్: పాలనాధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటి సారిగా నగరసభకు వచ్చిన ఉప విభాగాధికారిణి వెంకటలక్ష్మికి కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమివ్వడంతో ఆమె అధికారులపై మండిపడ్డారు. నగరసభలో విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదే సమయంలో కార్యాలయానికి వచ్చిన నగర ప్రజలు నగరసభలో అధికారులు, సిబ్బంది ప్రజా పనులపై తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని, సిబ్బందితో పాటు కమిషనర్ కూడా కార్యాలయంలో కనిపించరని, వీరిని వెతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. స్పందించిన ఆమె నగరసభ కార్యాలయంలో ప్రజలకు జరుగుతున్న అసౌకర్యాన్ని సరి చేసి పాలనను గాడిలో పెడతానని హామీ ఇచ్చారు.

కిమ్స్ ఆస్పత్రికి అత్యాధునిక సౌలభ్యం

- క్షణాల్లోనే ఆరోగ్య పరీక్ష నివేదిక ఆన్‌లైన్‌లో అందుబాటులోకి



పేద రోగుల పాలిట కామధేనువు కిమ్స్ ఆస్పత్రి

హుబ్లీ: కిమ్స్ ఆస్పత్రి అంటే ఉత్తర కర్ణాటక పేద రోగుల పాలిట ఆరోగ్య కామధేనువు. నిత్యం ఆయా జిల్లాల నుంచి వందలాది రోగులు ఇక్కడికి వస్తుంటారు. ఆ మేరకు వారు రోగ నిర్ధారణ కోసం గంటల పాటు వేచి ఉండక తప్పడం లేదు. ఎక్స్‌రే, స్కానింగ్ ఇతర రక్త పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో అందించే కొత్త టెక్నాలజీ నిర్వహణ ప్రారంభం కావడంతో సర్వత్రా ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి. కిమ్స్‌లో ఎముకలు, కీళ్లు, గర్భిణిలు, కేన్సర్‌తో పాటు నానా రోగాలకు పరీక్ష కోసం ఎక్స్‌రే, డాప్లర్, ఈసీజీ, సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌ల ఫలితాల నివేదికతో పాటు రక్త పరీక్షల ఫలితాల కోసం ఎక్స్‌రే, ల్యాబ్ విభాగాల ముందు రోగులు పడిగాపులు పడేవారు. అయితే ప్రస్తుతం అన్ని విభాగాల వైద్యులకు ఆన్‌లైన్ ద్వారానే ఈ సౌకర్యం లభించనుంది. ఇటీవల ప్రారంభమైన ఈ సౌకర్యం వల్ల రోగులకు అనుకూలమైంది. ఇక్కడ రోజు 700 నుంచి 900 వరకు రోగులు ఎక్స్‌రే, స్కానింగ్ పరీక్షలు చేయించుకుంటారు. ఈ క్రమంలో వాటి నివేదికల కోసం మధ్యాహ్నం, సాయంత్రం వరకు అక్కడ కదలకుండా ఉండి రిపోర్ట్ తీసుకోవాల్సి ఉంది. అయితే ఆన్‌లైన్ వ్యవస్థ జారీ కావడంతో ఇక వేచి ఉండే ప్రక్రియ అవసరం ఉండదని, రక్త పరీక్షలతో పాటు అన్ని కూడా డాక్టర్ టేబుల్‌పై ఉన్న కంప్యూటర్‌లోనే ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. ఈ విషయంపై కిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రామలింగప్ప అంతరసాని మాట్లాడుతూ ఏడాది క్రితమే ఈ ప్రక్రియ రూపొందినా సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడిందన్నారు. ప్రస్తుతం విజయవంతంగా ఈ ట్యాక్స్ వ్యవస్థ ద్వారా కిమ్స్‌లో ఇక కాగితం, ఎక్స్‌రే, స్కానింగ్ సిల్స్‌కు ఖర్చు చేస్తున్న సుమారు రూ.కోటి ఖర్చు మిగిలిందన్నారు. ప్లాస్టిక్ రహిత పరిసరాల నిర్మాణంతో తోటి ఆస్పత్రులకు ఆదర్శంగా నిలిచామని, అత్యాధునిక వసతులతో రోగులకు సదా అందుబాటులో ఉంటున్నట్లు ఆయన తెలిపారు.

ధార్వాడ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎవరో?

హుబ్లీ: ధార్వాడ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగిరి కోసం కాంగ్రెస్‌లో అంతర్గతంగా తీవ్ర పోటీ నెలకొందని తెలుస్తోంది. జిల్లాలో సంతోష్‌లాడ్‌కు మంత్రి పదవి లభించినా పొరుగునే ఉన్న బెళగావి జిల్లా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ఈ పదవి పట్ల చాలా ఆసక్తి చూపుతున్నారు. సీఎం సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారులో జిల్లాకు ఒకే ఒక్క మంత్రి పదవి లభించిన సంగతి తెలిసిందే. తీవ్ర పోటాపోటీ మధ్య కలఘటిగి ఎమ్మెల్యే, బళ్లారి జిల్లా గనుల దొర సంతోష్‌లాడ్ ఈ పదవిని దక్కించుకున్న విషయం విదితమే. కాగా సంప్రదాయం ప్రకారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కావాలి. అయితే మొదటి సారిగా బెళగావి జిల్లాలో మహిళా ఎమ్మెల్యే లక్ష్మీ హెబ్బాళ్కర్ ఈ పదవిపై చాలా ఉత్సాహం చూపుతున్నట్లు సమాచారం. ఆమెకు ఈ పదవి లభిస్తే పొరుగున ఉన్న హావేరి జిల్లాకు సంతోష్‌లాడ్ ఇన్‌చార్జ్ మంత్రి కావచ్చని భోగట్టా. సీఎం సిద్దరామయ్య ఆప్తుడైన సంతోష్‌లాడ్ ఎట్టి పరిస్థితిలోను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తప్ప వేరే జిల్లాకు వెళ్లే అవకాశాలు తక్కువేనన్న వాదన కూడా వినబడుతోంది. ఇస్తే గిస్తే ధార్వాడ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బాధ్యతలనే ఇవ్వాలని సంతోష్‌లాడ్ గట్టిగా పట్టుబడుతున్నట్లు వినికిడి.

దుస్థితిలో సోమప్ప చెరువు పరిసరాలు



సోమప్ప చెరువు

కంప్లి: నిర్వహణ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేసిన సోమప్ప చెరువు నేడు దుస్థితికి చేరింది. 2019 మే 29న రూ.7.6 కోట్లు ఖర్చు చేసి చెరువును ఆధునీకరించారు. 2022 ఏప్రిల్ 16న ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై చేతుల మీదుగా ప్రజలకు అంకితం చేశారు. 39 ఎకరాల విస్తీర్ణం గల చెరువు ప్రాంతంలో 30 ఎకరాల్లో ఉద్యానవనం, పిల్లలకు ఉల్లాసం కల్గించేందుకు క్రీడా సామగ్రి, విద్యుత్ దీపాల అలంకరణ, హైమ్యాక్స్ లైట్లు ఏర్పాటు చేశారు. సేద తీరేందుకు వచ్చే వారికి గ్రంథాలయం, చెరువు గట్టు చుట్టు బందోబస్తుగా రోడ్డును నిర్మించి ఉదయం, సాయంత్రం ప్రజలు వాకింగ్ చేసుకునేలా సౌకర్యాలు కల్పించారు. విశ్రాంతి కోసం విచ్చేసే వారికి మరుగుదొడ్లు కూడా నిర్మించారు. అయితే ఇటీవల ఆకతాయిలు కొందరు ఆడుకునే సామగ్రిని విరగ్గొట్టి మూలకు వేశారు. గ్రంథాలయం కిటికీల అద్దాలను పగులగొట్టారు. ఆలనాపాలన లేకపోవడంతో ప్రజలు బహిరంగంగానే మలమూత్ర విసర్జన చేసి సందర్శకులకు అసౌకర్యం కల్గిస్తున్నారు. రాత్రిళ్లు మందు బాబులకు నిలయంగా మారింది. పట్టణ ప్రజలు ఎన్నో ఏళ్లుగా కన్న కలలు నేడు నీరుగారిపోతున్నాయి. చెరువు ఎదురుగా మున్సిపల్ కార్యాలయం ఉన్నా పట్టించుకునే నాథులే లేరు. ఇకనైనా చెరువు రక్షణకు మున్సిపాల్టీ పరంగా ఇద్దరిని ఏర్పాటు చేసి చెరువును కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

మొబైళ్లు స్వాధీనం

శివమొగ్గ: శివమొగ్గ నగరంలోని వివిధ ప్రాంతాల్లో మొబైళ్ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు మైనర్లను తుంగా నగర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 3.25 లక్షల విలువైన 23 మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. కొద్ది రోజుల క్రితం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు బాలురను అదుపులోకి విచారణ చేయగా చోరీ విషయం బయటపడింది. వారి సమాచారం మేరకు మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.

కోలారు వార్తలు...

కుంభకోణంపై దర్యాప్తునకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: నకిలీ బోనఫైడ్ సర్టిఫికెట్ల కుంభకోణాన్ని సీబీఐతో విచారణ చేయించి నిందితులను కఠినంగా శిక్షించాలని, సంబంధిత ఆర్‌టీఓ అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని రైతు సంఘం పదాధికారులు శుక్రవారం తహసీల్దార్ ద్వారా రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ ఎవరిదో భూమికి వేరెవరో ట్రాక్టర్ యజమాని నకిలీ బోనఫైడ్ దాఖలాలు సృష్టించి ప్రభుత్వానికి కోట్ల రూపాయల మేర లభించాల్సిన పన్నులను అధికారులు వంచించారని ఆరోపించారు. అక్రమ ఆర్టీ నెంబర్లను సృష్టించడం ద్వారా వేల ట్రాక్టర్లు, ట్రాలీలను రిజిస్టర్ చేశారన్నారు. ప్రతి నకిలీ బోనఫైడ్ దాఖలాకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు అధికారులు లంచం తీసుకున్నారని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని ఒత్తిడి చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫారూక్ పాషా, జిల్లా కార్యాధ్యక్షుడు హెబ్బణి ఆనందరెడ్డి, బంగారి మంజు తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీలతో కాంగ్రెస్ వంచన

కోలారు: గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలను వంచనకు గురిస్తోందని కోలారు లోక్‌సభ సభ్యుడు ఎస్.మునిస్వామి ఆరోపించారు. శుక్రవారం నగరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు పూర్వం కాంగ్రెస్ ఎలాంటి షరతులు లేకుండా గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని వాగ్దానాలు చేసి ఎన్నికల్లో గెలిచిన తరువాత పథకాల అమలుకు షరతులను విధిస్తూ మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్లుగా కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్కరికీ గ్యారంటీ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మనోశుద్ధితో లక్ష్య సిద్ధి



ప్రతిభా పురస్కారాలను అందించిన దృశ్యం

మాలూరు: మరొకరిపై ద్వేషం, అసూయ, చెడు ఆలోచనలను చేయకుండా విద్యార్థుల మనస్సు పరిశుద్ధంగా ఉంటే జీవితంలో లక్ష్యాన్ని సాధించవచ్చని నివృత్త ప్రధానోపాధ్యాయుడు మునియప్ప తెలిపారు. ఆయన శుక్రవారం లక్కూరు జూనియర్ కళాశాల గడినాడు సాంస్కృతిక భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో 2022-23వ విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పాఠశాలల్లో మౌల్యాధారిత ఉన్నత విద్యాభ్యాసంతో ఉత్తమ జీవితాన్ని రూపొందించుకోవాలన్నారు. పటిష్ట దేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలన్నారు. తద్వారా దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బి మునియప్ప, రాష్ట్ర అనికేతన సాంస్కృతిక వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె మునికృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మద్దూరమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మాలూరు: తాలూకాలోని మరపనహళ్లి క్రాస్‌లో వెలసిన మద్దూరమ్మ దేవి జాతర మహోత్సవ వేడుకలను గ్రామస్తులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా సిడి ఉత్సవం, కుందేలు సారోటి కార్యక్రమాన్ని నెరవేర్చారు. కుందేలుతో సిడీరణ్ణకు వివాహం చేయడం సాంప్రదాయ బద్ధంగా వస్తున్న ఆచారం. జాతరలో భాగంగా పాల్గొన్న వేలాది భక్తులకు అన్నదానం చేశారు.

ఈతకు వెళ్లి యువకుడు మృత్యువాత



భగవంత్ సతీష్‌కుమార్(ఫైల్)

సాక్షి, బళ్లారి: సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు మృతి చెందిన ఘటన కలబుర్గి జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు..శుక్రవారం చించోళి తాలూకా భక్తంపల్లి గ్రామానికి చెందిన భగవంత్ సతీష్‌కుమార్(18) అనే యువకుడు బ్యారేజీ నీటిలో స్నానానికి వెళ్లి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న చించోళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో యువకులు



శివమొగ్గ: శివమొగ్గ నగరంలోని వినోభనగర పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్జన ప్రాంతాల్లో అనుమానస్పదంగా సంచరిస్తున్న 22 మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 1వ తేదిన అర్ధరాత్రి సదరు యువకులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు పక్కా సమాచారంతో ప్రొబేషన్ ఐపీఎస్ అధికారిణి బిందుమణి ఆధ్వర్యంలో సీఐ సంజీవకుమార్, పోలీసులు దాడి నిర్వహించారు. సదరు యువకులను స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

శ్రమతో లక్ష్యసాధన సులభం

కోలారు: విద్యార్థులు తమ కలల సాకారానికి నిరంతరం శ్రమించాలని, కఠోరశ్రమ ద్వారా లక్ష్యాలను సులువుగా చేరుకోగలమని జెడ్పీ సాంఖ్యిక అధికారి కృష్ణమూర్తి అన్నారు. ఆయన శుక్రవారం నగరంలోని జెడ్పీ సభాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందించి మాట్లాడారు. జిల్లాలో 75 న్యానో ఉపగ్రహాల లాంచింగ్ పథకంలో భాగంగా విద్యార్థుల్లో అంతరిక్ష పరిసరాలు, ఉపగ్రహాలు ఇతర సంబంధిత విషయాలపై అవగాహన, వివిధ విజ్ఞాన విషయాలపై వ్యాసరచన పోటీలను ఆన్‌లైన్ ద్వారా ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో వందలాది మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో విజేతలుగా నిలిచిన 9 మందికి బహుమతులు, సర్టిఫికెట్లను అందించారు.

క్లుప్తంగా

మఠంలో ఎమ్మెల్యే పూజలు



తుమకూరు: తుమకూరు నగరంలోని సిద్దగంగ మఠంలో శుక్రవారం శిర నియోజకవర్గం ఎమ్మెల్యే టీబీ జయచంద్ర దంపతులు లింగైక్య శ్రీ శివకుమార స్వామీజీ సమాధికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠాధ్యక్షుడు సిద్దలింగ స్వామిని కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాది శివరామ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శశి హులికుంటె మఠ్ తదితరులు పాల్గొన్నారు.

కొప్పళ వర్సిటీ లోగో ఆవిష్కరణ

శివాజీనగర: కొప్పళ విశ్వవిద్యాలయం లోగోను రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ శుక్రవారం రాజభవన్‌లో ఆవిష్కరించారు. కొప్పళ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ బీ.కే.రవి, కొడుగు వర్సిటీ వీసీ డాక్టర్ అశోక్ ఆలూర్, బాగలకోటె వర్సిటీ వీసీ డాక్టర్ దేశపాండె, చామరాజనగర వర్సిటీ వీసీ డాక్టర్ గంగాధర్, బీదర్ వర్సిటీ వీసీ డాక్టర్ బిరాదార్, హాసన్ వర్సిటీ వీసీడాక్టర్ తారానాథ్, హావేరి వర్సిటీ వీసీ డాక్టర్ సురేశ్ హెచ్.జంగమశెట్టి పాల్గొన్నారు.

నగర స్వచ్ఛతకు సహకరించండి



జాతాను ప్రారంభిస్తున్న మేయర్ శివకుమార్

మైసూరు: మైసూరు నగరాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు నగరవాసులు పాలికెతో చేతులు కలపాలని మేయర్ శివకుమార్ కోరారు. నగర పాలికె, భారతీయ గ్రాహక పంచాయతీ, విద్యారణ్య ట్రస్టు, కేఎంపీసీకే ట్రస్టు ఆధ్వర్యంలో విద్యారణ్యపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జీవన నన్న స్వచ్ఛ నగర జాగృతి జాతా కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మొక్కలు నాటి నగరంలో పచ్చదనం పెంపొందించాలన్నారు. వృథా వస్తువులను పాలికెకు అందజేస్తే అవసరమైన వారికి అందజేస్తామన్నారు.

నోట్లు మార్పించి ఇస్తామని మోసం



పట్టుబడిన నిందితులు

యశవంతపుర: రెండు వేల రూపాయల నోట్లు మార్పించి ఇస్తామని నకిలీ నోట్లతో మోసగిస్తున్న ముగ్గురిని చిక్కోడి పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రకు చెందిన సాగర జాధవ్, అరీఫ్ సాగర, లక్ష్మణ్ నాయక్‌ను కాగవాడ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

జీపీ కార్యాలయానికి కరెంట్ కట్

బనశంకరి: కొడగు జిల్లా కుశాలనగర తాలూకా కూడిగె గ్రామపంచాయతీకి రూ.9.91 లక్షల కరెంటు బిల్లు పెండింగ్ ఉండటంతో విద్యుత్‌శాఖ అధికారులు కనెక్షన్ కట్ చేశారు. నాలుగైదు నెలల నుంచి గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లు చెల్లించలేదు. విద్యుత్ కనెక్షన్ కట్ చేయడంతో గ్రామపంచాయతీ అధికారులు చీకట్లోనే విధులు నిర్వహిస్తున్నారు. పీడీఓ కూడా మొబైల్ టార్చ్ వెలుగులో పనిచేస్తున్నారు.

గౌరవభావం పెంచుకోవాలి



పట్టాలు అందుకున్న విద్యార్థులు

చిక్కబళ్లాపురం: గురువులు, పెద్దల పట్ల గౌరవ భావం పెంచుకోవాలని మండ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పుట్టరాజు అన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్‌జేసీఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులకు పట్టాలు అందజేసి మాట్లాడారు. విద్యనేర్చిన పాఠశాలను జీవితాంతం గుర్తుంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆదిచుంచనగిరి ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీ నిర్మలానందనాథస్వామీజీ, పూజ్య మంగళానందనాథస్వామీజీ, పాలక మండలి అధికారి డాక్టర్ ఎన్ శివరామరెడ్డి, డాక్టర్ కెపి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బెస్కాం కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి

కృష్ణరాజపురం: ఇంధన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేజే.జార్జ్ శుక్రవారం తొలిసారిగా నగరంలోని కేఆర్ సర్కిల్ వద్ద ఉన్న బెస్కాం కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బెస్కాం ఎండీ మహంతేష్, బిళగి, డైరెక్టర్ దర్శన్ జై, టెక్నికల్ విభాగం అధికారి రమేష్, ఇతర అధికారులు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

బెల్లం తయారీలో పూర్వ వైభవం వచ్చేనా ?

- గౌరిబిదనూరు తాలూకాలో కనుమరుగవుతున్న బెల్లం తయారీ యూనిట్లు
- నాడు బెల్లం తయారీలో నంబర్ వన్
- చెరకు ఫ్యాక్టరీ మూతతో రైతుల అవస్థలు



బెల్లం పాకం తయారు చేస్తున్న దృశ్యం



ఉంటల బెల్లం

గౌరిబిదనూరు: తీయటి పదార్థం తింటే నోటికే కాదు మనస్సుకు సంతృప్తి ఉంటుంది. తీపి లేకుండా మన జీవితాన్ని ఊహించలేము. ఎంతో ఆరోగ్యాన్ని కలిగించే, నాణ్యమైన బెల్లం తయారీలో గౌరిబిదనూరు తాలూకా రాష్ట్రంలోనే పేరుగాంచింది. పరంపరగా కొనసాగిన బెల్లం తయారీ 1960–70 వరకు చెరకు పండించడానికి ఎంతో అనువుగా ఉండేది. దీన్ని చూసి చక్కెర ఫ్యాక్టరీని స్థాపించారు. అడవులు నశించి వర్షాలు తగ్గి చెరకు వేసే రైతులు చాలా వరకు తగ్గిపోయారు. దీంతో ఫ్యాక్టరీ సైతం మూతపడింది.

దారినాయకన పాళ్య హోబళీలో బెల్లం తయారీ

గత ఏడాది వర్షాలు బాగా పడినందున తాలూకా దారినాయకన పాళ్య హోబళీలోని నామగొండ్లు, బెల్లాళబొమ్మసంద్ర, ఎర్రనాగేనహళ్లి, చీలంనహళ్లి, చించానహళ్లి తదితర గ్రామాలలో రైతులు చెరకు పండించి బెల్లం తయారు చేస్తూ వున్నారు. ఇక్కడ చెరకు పండించడానికి భూమి చాలా అనువైనదని చీలంనహళ్లి బెల్లం తయారీ రైతు సీఎస్ నరసింహారెడ్డి తెలిపారు. తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో చెరకు పండించి 25 రోజుల పాటు బెల్లం గానుగను పెట్టినట్లు తెలిపారు. నేటి రోజులలో నాణ్యత కల బెల్లం ఉత్పాదనకు కార్మికుల సమస్యగా వుంది. బాగా అనుభవం వున్న వారిచే బెల్లం ఉత్పత్తి చేయించాలి. గతంలో ఎద్దుల ద్వారా గానుగను తిప్పి చెరకు రసం తీసేవారు. ప్రస్తుతం కరెంటు మోటార్ల ద్వారా చెరకు రసం తీసి కొప్పెర్లలో వేసి వేడి చేసి దానికి తగిన పాకం వచ్చినపుడు వంటసోడా, సున్నం, చెక్క, వేరుశెనగ నూనెను తగిన పాళ్లలో కలపాల్సి ఉంది. ఆర్గానిక్ బెల్లం తయారీకి వీటిని వెయ్యకుండా కేవలం సున్నం మాత్రం కలుపుతారని నరసింహారెడ్డి తెలిపారు.

ఉంటలు చేయడం కళ

బెల్లం తయారైన పిదప దానిని ఉంటలుగా చేయడం సైతం ఒక కళగా చెప్పవచ్చు. తాలూకాలో అచ్చు బెల్లాన్ని తయారు చేయరు. లాభం రాని, నష్టం రాని పరంపరగా వస్తున్న ఈ బెల్లం ఉత్పాదనను విడువలేక పోతున్నామని ఇక్కడి రైతులు అంటున్నారు.

ఉంట బెల్లం వాడుతున్నాం



శతాబ్దాల కాలం నుంచి మా దేవాలయంలో ఈ తాలూకాలో ఉత్పత్తి అయ్యే ఉంట బెల్లాన్నే వాడుతున్నాం. ఇక్కడి బెల్లం చాలా రుచిగా ఉంటుంది.

– .భీమేశ్వర జోషి
హొరనాడు అన్నపూర్ణేశ్వరీ దేవాలయం ధర్మాధికారి

తాతల కాలం నుంచి ఇదే జీవనాధారం



50 ఏళ్లుగా బెల్లం తయారీ చేస్తున్నాం, ఎకరా చెరకు పంటకు లక్ష రూపాయల ఖర్చు వస్తుంది. సుమారు రూ. 80 వేల నుంచి 90 వేల వరకు లాభం రావచ్చు. చక్కెర కలిపిన బెల్లం ఉత్పాదన చేసే వారికి కేజీ రూ. 45 నుంచి రూ. 50 విక్రయిస్తే మేము నాణ్యతకల బెల్లాన్ని కేజీ రూ.75 విక్రయించాల్సి వస్తుంది.

– నరసింహారెడ్డి, రైతు

సబ్సిడీ సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకుని తాలూకాలో బెల్లం ఉత్పాదనకు పూర్వ వైభవం రావాలి. చెరకు విత్తనాలు, దానికి సంబంధించిన అన్ని విషయాలు వ్యవసాయ శాఖలో తెలుసుకోవాలి.

– మోహన్,
వ్యవసాయ శాఖాధికారి

అప్పులు తీర్చేందుకే హత్య

- వీడిన వృద్ధురాలి హత్యకేసు మిస్టరీ
- ముగ్గురు నిందితుల అరెస్ట్



అరెస్టయిన నిందితులు

బనశంకరి: మహాలక్ష్మీపురం వెస్ట్ ఆఫ్ కార్డ్ రోడ్డు రెండోస్టేజ్ 12వ క్రాస్ 4 మెయిన్‌లో గతనెల 27న చోటుచేసుకున్న వృద్ధురాలు కమలమ్మ హత్యోదంతాన్ని మహాలక్ష్మీలేఔట్ పోలీసులు ఛేదించారు. అశోక్,సిద్దరాజు, అంజనామూర్తి అనే నిందితులను అరెస్ట్ చేశారు. ఐపీఎల్ బెట్టింగ్‌లో చేసిన అప్పులు తీర్చేందుకు నిందితులు హత్యోదంతానికి పాల్పడి నగలు చోరీ చేశారని పోలీసులు తెలిపారు. వివరాలు.. హతురాలు ఎస్.కమల అనే వృద్ధ మహిళ ఒంటరిగా నివసించేది. ఆమె కుమారులు ఇదే నగరంలో వేరోచోట ఉంటున్నారు. ఈమె ఇంటికి మూడునెలల క్రితం ప్లంబింగ్ పనులు చేయడానికి నిందితుడు అశోక్ వచ్చాడు. ఈమె వద్ద ఎక్కువ బంగారం ఉంటుందని, దోచుకుంటే అప్పులు తీర్చి ప్రశాంతంగా ఉండవచ్చునని ఆలోచించాడు. స్నేహితులైన సిద్దరాజు, అంజనామూర్తితో చర్చించి ఆమె ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. గతనెల 27 తేదీ ఉదయం ఆమె ఇంటికి వెళ్లారు. బిస్కెట్ గోదాముకోసం కార్‌షెడ్ అద్దెకు ఇస్తారా అని అడిగారు. లేదని చెప్పడంతో వెళ్లిపోయారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు సిద్దరాజు, అంజనామూర్తి వెళ్లి కమల ఇంటిలోకి చొరబడి ఆమెను బంధించి నోటిలో బట్టలు కుక్కి ఊపిరాడకుండా చేసి హత్యచేశారు. ఆమె ఒంటిపై ఉన్న 40 గ్రాముల రెండు బంగారుచైన్లు, చెవిదుద్దులు దోచుకుని ఉడాయించారు. నిందితులు మైసూరులో తలదాచుకొని ఉండగా అరెస్ట్ చేశారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కోసం చేసిన అప్పులు తీర్చేందుకు నిందితులు ఈ దారుణానికి పాల్పారని పోలీసులు తెలిపారు.

సోదరి మరణాన్ని జీర్ణించుకోలేక..



ఆత్మహత్య చేసుకున్న వేణుగోపాల్

మండ్య: సోదరి మరణాన్ని తట్టుకోలేక ఓ వైద్యుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండ్య జిల్లాలోని మద్దూరు తాలూకా కుదరగుండి గ్రామంలో చోటు చేసుకుంది. మండ్య సమీపంలోని స్యంజో ఆస్పత్రిలో వైద్యుడుగా పనిచేస్తున్న వేణు గోపాల్ (57) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇటీవల ఆయన సోదరి మృతి చెందారు. అప్పటి నుంచి ఆయన తీవ్ర మనో వేదనతో ఉన్నారు. గురువారం రాత్రి ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన వేణుగోపాల్ గ్రామ సమీపంలోని చెరువు కట్ట వద్ద ఓ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

- సీఎంను కలిసిన కాంట్రాక్టర్ల సంఘం

శివాజీనగర: బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 40 శాతం కమీషన్ ఆరోపణ చేసిన కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు కెంపణ్ణ నేతృత్వంలోని కాంట్రాక్టర్ల బృందం శుక్రవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్యను భేటీ చేసింది. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని కోరింది. గ్రామీణ నీటి సరఫరా, ప్రజాపనుల శాఖ, గ్రామీణాభివృద్ధితో పాటుగా వివిధ బోర్డు, కార్పొరేషన్ల పనులను కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయించింది. బిల్లుల చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. దీంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. దీంతో కాంట్రాక్టర్లు తమ సంఘం ఆధ్వర్యంలో సీఎంను కలిసి సమస్యలు విన్నవించారు. బిల్లులు నిలిచిపోవడంతో మౌలిక సదుపాయాల నిర్మాణానికి ఆటంకం ఏర్పడుతోందని, పనులు కొనసాగేందుకు ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరారు.

కనుల పండువగా కుంభాభిషేక మహోత్సవం



బనశంకరీ, శాకంబరీదేవి, చౌడేశ్వరిదేవి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ

బనశంకరి: భక్తుల మొక్కులు తీర్చే దాక్షాయణిగా పేరుగడించిన బనశంకరీదేవి ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా జేష్ఠ శుద్ధ త్రయోదశి శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయ ఆవరణలో ప్రధాన అర్చకులు ఆర్.సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్ బృందం ఆధ్వర్యంలో లక్ష మోదక శ్రీమహాగణపతి హోమం నిర్వహించి మధ్యాహ్నం పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు లక్ష కుంకుమార్చన ఆచరించారు. మహామంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కుంభాభిషేకం నేపథ్యంలో శుక్ర, శనివారం రెండు రోజుల పాటు బనశంకరీదేవి మూలవిరాట్ దర్శనం నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కే.పద్మ, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బసవరాజ్, సమితి సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారి కలశాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

పశ్చిమ బెంగాల్‌వాసులకు బెయిల్



జైలు నుంచి విడుదలైన దంపతులు

బనశంకరి: బంగ్లాదేశ్ అక్రమవలసదారులనే అనుమానంతో అరెస్ట్ అయి 301 రోజుల పాటు జైలు జీవితం గడిపిన పశ్చిమబెంగాల్‌కు చెందిన పలశ్‌అధికారి, శుక్లా అధికారి అనే దంపతులకు బెయిల్ లభించింది. పశ్చిమబెంగాల్ పూర్వబుద్వాన్ జమాల్పుర నివాసులైన పలశ్‌అధికారి, శుక్లాఅధికారి ఉపాధి కోసం ఏడాదిన్నర పసికందుతో బెంగళూరుకు చేరుకున్నారు. చెత్త విభజన పనులు చేసుకుంటూ మారతహళ్లిలో నివాసం ఉంటున్నారు. 2022 జూలైలో అక్రమ బంగ్లాదేశ్ వలసదారులపై చర్యలు చేపట్టిన పోలీసులు.. ఈ దంపతులను కూడా అరెస్ట్‌చేసి పరప్పన అగ్రహార జైలుకు తరలించారు. దీంతో దంపతులు జైలునుంచే న్యాయ పోరాటం చేశారు. పోలీసులు వెళ్లి జమాల్పుర బీడీఓను సంప్రదించి వారు జమల్పురవాసులని తేల్చారు. వీరికి ఏప్రిల్ 28 బెయిల్ మంజూరైంది. అక్కడివారి సంతకాలు లేక విడుదల ఆలస్యమైంది. చట్టప్రక్రియ పూర్తికావడంతో దంపతులను గురువారం పరప్పనఅగ్రహార జైలు నుంచి విడుదలచేసి పశ్చిమ బెంగాల్‌కు పంపించారు.

హోసూరు వార్తలు..

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

హోసూరు: ద్విచక్ర వాహనాన్ని మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... హోసూరుకు చెందిన వసంతకుమార్ (32) ప్రైవేట్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారి కామనదొడ్డి వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వసంత్ కుమార్ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ లావణ్యమధు

క్రిష్ణగిరి: సూళగిరి సమితి పన్నపల్లి పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి శుక్రవారం యూనియన్ చైర్‌పర్సన్ లావణ్యమధు భూమిపూజ చేశారు. గ్రామంలోని నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో 30 వేల లీటర్ల సామర్థ్యంతో రూ.16 లక్షలతో కొత్త ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. బీడీవోలు గోపాలకృష్ణన్, విమల్‌రవికుమార్, ఇంజినీర్ శ్యామల, పంచాయతీ అధ్యక్షుడు మంజునాథ్‌గౌడ, యూనియన్ కౌన్సిలర్ లక్ష్మమ్మరాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టర్ శరయు

హోసూరు: క్రిష్ణగిరి కొత్త బస్టాండు వద్ద రూ. 5.20 కోట్లతో జరుగుతున్న చిన్న చెరువు అభివృద్ధి పనులను కలెక్టర్ శరయు గురువారం పరిశీలించారు. చెరువు సుందరీకరణ, విద్యుత్ దీపాలంకరణ, పక్షుల నివాస స్థలం, పడవ వసతులు, చెరువు కట్టపై మొక్కల పెంపకం, నడక దారి తదితర పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ పరితానవాబ్, కమిషనర్ వాసంతి పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

హోసూరు: హోసూరు తాలూకాలో వ్యవసాయ శాఖ ద్వారా అందజేసే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హోసూరు వ్యవసాయ శాఖ ఉపడైరెక్టర్ భువనేశ్వరి ఒక ప్రకటనలో తెలిపింది. ఆ వినతిపత్రంలో హోసూరు తాలూకాలో ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, ఈ ఖరీఫ్ సీజన్‌లో హోసూరు తాలూకాకు చెందిన రైతులు సుమారు 6 వేల హెక్టార్లలో రాగి పంట సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారని, ఇందుకోసం హోసూరు వ్యవసాయ శాఖ కార్యాలయం రైతులకు సరిపడ 18 టన్నుల మేలురకమైన రాగి విత్తనం, 7 టన్నుల కంది సిద్ధంగా ఉంచినట్లు, 50 శాతం రాయితీతో అందజేస్తున్నామని, వేరుసెనగ 1600 కిలోల విత్తనం నిలువ ఉంచామని, విత్తనంతో పాటు 50 శాతం రాయితీతో ఎరువులు వినియోగం చేస్తామని, చిన్నసన్నకారు రైతులకు ప్రధాన మంత్రి బిందుసేద్యం ద్వారా 100 శాతం రాయితీతో బిందుసేద్యం ఉపకరణాలు, ఇతరులకు 75 శాతం రాయితీతో ఉపకరణాలు, విద్యుత్ మోటార్, డీజిల్ పంప్‌సెట్, పైప్‌లైన్, వర్షపునీటి సేకరణ తొట్టీలకు 50 శాతం రాయితీ కల్పిస్తుందని, దీంతో పాటు ప్రధాని పంటల బీమా పథకం ద్వారా రైతులకు బీమా అందజేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నివృత ఉద్యోగికి సత్కారం



కెలమంగలం: రహదార్ల శాఖలో సేవలందజేస్తూ పదవీ విరమణ పొందిన ఇంజినీర్‌కు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. రహదార్ల శాఖ హోసూరు డెప్యూటీ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సెందిల్ కుమార్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ ప్రైవేట్ మహాల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డెంకణీకోటకు చెందిన సామాజిక సేవాకర్త, డెంటల్ డాక్టర్ సుబ్రమణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోసూరు, డెంకణీకోట ప్రాంతాల్లో ఇంజనీర్ సెందిల్‌కుమార్ ఉత్తమ సేవలందజేశారని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డెంకణీకోటకు చెందిన డి.ఎస్ పాండ్యన్, ఆరిఫ్‌ఉల్లా, సూర్య, వెంకటరాజ్, రహదార్ల శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జమాబందీలో సమస్యల వెల్లువ



వినతిపత్రాలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శరణ్య

కెలమంగలం: క్రిష్ణగిరి జిల్లాలోని తాలూకా కేంద్రాల్లో శుక్రవారం జమాబందీ కార్యక్రమాలను నిర్వహించారు. డెంకణీకోట తాలూకా కార్యాలయంలో హోసూరు సబ్‌కలెక్టర్ శరణ్య అధ్యక్షతన జమాబందీ కార్యక్రమం జరిగింది. తాలూకాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు సమస్యలపై ఫిర్యాదులు చేశారు. తహసీల్దార్ శరవణకుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అన్న కుమారుడి హత్య

- తాగిన మత్తులో పినతండ్రి దారుణం

యశవంతపుర: సొంత అన్న కుమారుడిని పినతండ్రి దారుణంగా హత్య చేసిన ఘటన కెంగేరి హొయ్సళ సర్కిల్లో జరిగింది. వివరాలు...నవీన్ (32), కుమార్‌కు సొంత అన్న కుమారుడు. తాగిన సమయంలో తనకు మర్యాద ఇవ్వలేదనే కక్షతో నవీన్‌పై కుమార్ కక్ష పెంచుకున్నాడు. గురువారం రాత్రి కెంగేరి ఉపనగర సమీపంలోని ఓ బార్‌కు తీసుకెళ్లి మద్యం తాపించాడు. అనంతరం బార్ పక్కకు తీసుకెళ్లి దారుణంగా హత్య చేశాడు. పశ్చిమ విభాగం డీసీపీ లక్షణ్ నింబరగి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కార్మికుడి మృతి

యశవంతపుర: ఇంటి పైనుంచి జారిపడి కార్మికుడు మృతి చెందిన ఘటన కడబలో శుక్రవారం జరిగింది. మృతుడిని అలంకారు గ్రామానికి చెందిన శరవూరు పద్మనాభ కుమారుడు హరిప్రసాద్‌గా గుర్తించారు. పట్టణంలోని మేరోంజిలో నిర్మాణంలో ఉన్న ఇంటి పైనుంచి జారి పడ్డారు. తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నలుగురి అరెస్ట్

యశవంతపుర: మంగళూరు సోమేశ్వర బీచ్‌లో విద్యార్థులపై దాడికి పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళూరులోని ప్రైవేట్ విద్యాసంస్థలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు బీచ్‌కు వెళ్లారు. యువతులతో ఉన్నవారు ముస్లిం సముదాయానికి చెందిన వారనే ఉద్దేశంతో కొందరు వెంబడించి దౌర్జన్యం చేశారు. దాడిలో గాయపడిన విద్యార్థులను దేరళకట్టె ఆస్పత్రికి తరలించారు. నలుగురిని అరెస్ట్ చేశారు.

రుద్రభూమి ప్రారంభం

తుమకూరు: తుమకూరు నగరంలో వీరశైవ సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో తుమకూరు నగరంలోని గంగసంద్ర గ్రామంలో కొత్తగా నిర్మాణం చేసిన వీరశైవ లింగాయత్ రుద్రభూమిని శ్రీ సిద్దేశ్వర స్వామి, అటవీ సక్షేత్ర అటవీ శివలింగ స్వామిజీ హిరె మఠానికి చెందిన శివానంద శివాచార్య స్వామిజీ, మాకనహళ్లి జంగమ మఠానికి చెందిన గంగాధర స్వామీజీ, సిద్దరబెట్టకు చెందిన వీరభద్ర శివాచార్య స్వామీజీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ జీఎస్ బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత జయప్రకాశ్‌కు బెదిరింపు లేఖ

దొడ్డబళ్లాపురం: రచయిత బంజగెరె జయప్రకాశ్‌కు అపరిచితుల నుండి బెదిరింపు లేఖ వచ్చింది. ఇందుకు సంబంధించి ఆయన లేఖను హొరోహళ్లి పోలీసులకు అందజేసి ఫిర్యాదు చేసారు. రాష్ట్రంలో హిందూ వ్యతిరేక పార్టీ ప్రభుత్వం ఏర్పడిందని, ఇది హిందువులకు కష్టకాలమని, మీ లాంటి దేశ ద్రోహులకు, ముస్లిం, క్రిస్టియన్ ప్రియులకు అంత్యకాలం సమీపించిందని రాసి ఉంది. చివరిలో జై హిందూ దేశం అని రాశారు.

ఆలయంలో ప్రదోష పూజలు



విశేష అలంకరణతో శ్రీ సోమేశ్వరస్వామి మూలవిరాట్

హోసూరు: హోసూరు కార్పొరేషన్ రామ్‌నగర్‌లో వెలసిన ప్రసిద్ధి శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి ప్రదోష పూజలను విశేషంగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు, నంది విగ్రహాలకు పాలు, పెరుగు, వెన్న, కొబ్బరినీరు, పన్నీర్, పసుపు, కుంకుమ, చందనం, పంచామృతాలతో విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను జరిపించారు. ఈ సందర్భంగా పార్వతీసమేత శ్రీ సోమేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. కార్యక్రమమంలో హోసూరు పట్టణంలోని వివిద ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులకు మహామంగళారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

కరెంటు తీగ తెగిపడి నాలుగు ఆవుల మృతి

హోసూరు: కరెంటు తీగ తెగిపడి నాలుగు పాడిఆవులు మృతి చెందాయి. ఈ ఘటన ఉద్దనపల్లి సమీపంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకొంది. సూళగిరి సమీపంలోని సీభం గ్రామానికి చెందిన రైతు చిన్నమాదయ్యన్. పాడిఆవులను పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పశువులను మేతకు తీసుకెళ్లాడు. ఈ సమయంలో విద్యుత్ తీగ తెగి పశువులపై పడడంతో నాలుగు పశువులు విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో విద్యుత్ శాఖ సిబ్బంది, పోలీసులు వచ్చి పరిశీలించారు. కాగా వేల రూపాయల విలువ చేసే ఆవుల మృతితో జీవనాధారం కోల్పోయానని, తనకు పరిహారం ఇవ్వాలని బాధితుడు చిన్నమాదయ్యన్ విజ్ఞప్తి చేశారు.



మీకు తెలుసా

అల్లం, కీరదోసతో జ్యూస్ తయారు చేసుకుని.. తాగితే.. మనం చాలా సులభంగా బరువు తగ్గవచ్చు. ముందుగా కీరదోసపై ఉండే చెక్కును తీసేయాలి. ముక్కలుగా చేసుకుని జార్‌లోకి వేసుకోవాలి. తర్వాత ఒకటిన్నర అంగుళాల అల్లం తీసుకుని శుభ్రం చేసి ముక్కలుగా చేయాలి. ఇప్పుడు జార్ లోకి వేసుకోవాలి. తర్వాత ఇందులో అరగ్లాస్ నీళ్లు పోసి.. మెత్తగా మిక్సీ పట్టాలి. ఆ తర్వాత దీనిని వడకట్టుకుని ఒక గ్లాసులోకి తీసుకోవాలి. రుచికోసం నిమ్మరసం కూడా కలుపుకోవచ్చు. ఇలా చేసుకున్న జ్యూస్ రోజూ ఉదయం పరగడుపున తాగాలి. అల్పాహారానికి అరగంట ముందు అయినా తీసుకోవచ్చు. ఇలా క్రమం తప్పకుండా తీసుకోవడం వలన చాలా సులభంగా బరువు తగ్గొచ్చు. ఈ జ్యూస్‌తో మలబద్ధక సమస్య తగ్గుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

హెల్త్ టిప్స్



● గుప్పెడు యూకలిప్టస్ ఆకుల్ని దంచి గుజ్జుచేసి నుదుటిమీద అంటించుకొని మెత్తటి గుడ్డతో కట్టుకొని, గంటసేపు పడుకుంటే తలనొప్పి పోతుంది. ● పెద్ద ఉసిరికాయంత అల్లం, రెండు పసుపుకొమ్ములు కలిపి దంచి దానికి ఒక కాయ నిమ్మరసం, మూడు చెంచాల ఆముదం కలిపి గోరువెచ్చ చేయాలి. తలకి పట్టువేసి గుడ్డతో గట్టిగా కట్టి గంటసేపు నిద్రపోతే తలనొప్పి తగ్గుతుంది. ● తులసి రసాన్ని నాలుగు చుక్కలు తీసుకుని ఎడమ వైపు నొప్పి వస్తే కుడి ముక్కులో, కుడివైపు నొప్పి వస్తే ఎడమవైపు ముక్కులో వేసుకుని నిద్రపోతే పార్శ్వపు నొప్పి తగ్గుతుంది. ● ఉసిరికాయ రసం పంచదారతో కలిపి పూటకు పది గ్రాముల వంతున రెండుపూటలు తీసుకుంటే కీళ్ళనొప్పులు తగ్గుతాయి. ● పుదీనా కట్టలు నాలుగు, పది గ్రాముల మిరియాలు, పది గ్రాముల శొంఠి కలిపి మెత్తగా నూరి. శనగ గింజంత మాత్రలు చేసుకుని నీడలో ఆరబెట్టాలి. రోజుకు మూడు మాత్రల చొప్పున మూడునెలలు తీసుకుంటే స్థూలకాయం తగ్గుతుంది.





జుట్టు సమస్యలకు చెక్ చెప్పేయ్యండి

వేసవిలో జుట్టు సమస్యలు రావడం సర్వసాధారణమైపోయింది. జుట్టు సమస్యలతో బాధపడేవారు కొన్ని రకాల జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అంతేకాకుండా అనారోగ్యకరమైన ఆహారాలు తీసుకోవడం మానుకోవాల్సి ఉంటుంది. ఈ కింది చిట్కాలను పాటించడం వల్ల కూడా సులభంగా జుట్టు చిట్లిపోవడం సమస్యల నుంచి ఉపశమనం పొందొచ్చని నిపుణులు చెబుతున్నారు.

వాతావరణంలో మార్పుల కారణంగా చాలామందిలో జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఈ సమస్యల నుంచి సులభంగా ఉపశమనం పొందడానికి మార్కెట్‌లో లభించే వివిధ రకాల సాధనాలను, కాస్మెటిక్ ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. అయినా, సరైన ఫలితాలను పొందలేక పోతున్నారు. అయితే కొన్ని జాగ్రత్తలు పాటించడం, కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండటం ద్వారా కూడా జుట్టు రాలకుండా చూసుకోవచ్చు.

ఎక్కువ చక్కెర కలిగిన ఆహారాలు తినడం వల్ల తీవ్ర చర్మ సమస్యలతో పాటు, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ముఖ్యంగా జుట్టు రాలడం వంటి సమస్యలతో బాధపడేవారు చక్కెర గల ఆహారాలు తీసుకోవడం మానుకోవాల్సి ఉంటుంది.

జంక్ ఫుడ్ ఎక్కువ తీసుకోవడం వల్ల జుట్టు రాలడం, తెల్ల జుట్టు సమస్యలు కూడా వస్తాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. కాబట్టి జుట్టు సమస్యలతో బాధపడుతున్నవారు జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండడం చాలా మంచిది.

ఆహారంలో పచ్చి గుడ్లను తీసుకోవడం వల్ల వాటిలో ఉండే హానికరమైన బ్యాక్టీరియా జుట్టుకు కూడా హాని కలిగిస్తుంది. కాబట్టి ఇప్పటికే జుట్టు రాలడం వంటి సమస్యలతో బాధపడేవారు ఆహారంలో పచ్చి గుడ్లను తీసుకోకపోవడం ఉత్తమం.

ఆల్కహాల్ సేవించడం వల్ల కూడా సులభంగా జుట్టు రాలడం మొదలవుతుందని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇందులో ఉండే హానికరమైన విషపదార్థాలు తీవ్ర జుట్టు సమస్యలకు దారి తీస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి కాబట్టి జుట్టును కాపాడుకోవాలనుకునేవారు ఆల్కహాల్‌కు దూరంగా ఉండటం మేలు.

తేనె, పెరుగు హెయిర్ మాస్క్‌తో సులభంగా ఉపశమనం లభిస్తుంది:

ప్రస్తుతం చాలామందిలో జుట్టు చివరి భాగాల్లో చిట్లిపోవడం వంటి సమస్యలు వస్తున్నాయి. వీటినే స్ప్లిట్ ఎండ్స్ అంటారు. ఇలాంటి సమస్యలతో బాధపడేవారు తేనె, పెరుగు హెయిర్ మాస్క్ వినియోగించడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు. ఈ మాస్క్‌ను ఎలా తయారు చేసుకోవాలో మనం ఇప్పుడు తెలుసుకుందాం.. ముందుగా ఒక బౌల్ తీసుకుని అందులో అరకప్పు పెరుగు, 6 చెంచాల తేనె వేసి రెండూ బాగా కలిసేలా కలుపుకోవాలి. ఇలా తయారు చేసుకున్న మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని జుట్టు కుదుళ్లకు పట్టేలా రాసుకుని మృదువుగా మసాజ్ చేయాలి. ఆ తర్వాత ఒక గంటపాటు అలా వదిలేయాలి. బాగా ఆరిన తర్వాత జుట్టును తక్కువ గాఢత గల షాంపూతో శుభ్రం చేసుకుంటే మంచి ఫలితాలు కలుగుతాయి.

వేసవిలో జుట్టు రాలడానికి సాధారణ కారణాలు

● అధిక ఉష్ణోగ్రత, సూర్యరశ్మికి గురికావడం వల్ల జుట్టు చిట్లడం, పల్చబడడం జరుగుతుంది. ● స్విమ్మింగ్ వల్ల కూడా జుట్టు రాలుతుంది. ఎందుకంటే పూల్ నీటిలో ఉండే క్లోరిన్ జుట్టుపై ప్రతికూల ప్రభావం చూపి జుట్టు రాలేలా చేస్తుంది. ● వేసవిలో చెమట వల్ల జుట్టు రాలడం అనేది సర్వసాధారణం. ● వేడి వాతావరణం చుండ్రును తీవ్రతరం చేస్తుందని అంటారు. దీనికి చికిత్స చేయకుండా వదిలేస్తే, తాత్కాలికంగా జుట్టు రాలిపోతుంది.

అలోవెరా జెల్

అలోవెరా జెల్‌ను జుట్టు మీద అప్లై చేయడం చాలా మంచిది. దానివల్ల జుట్టు మెరవడంతోబాటు మృదువుగా కూడా మారుతుంది. అంతేకాదు, చుండ్రు లేదా జుట్టు రాలడానికి కారణమయ్యే ఇతర ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌తో పోరాడుతుంది. అలోవెరా జ్యూస్ తాగడం వల్ల జుట్టు లోపలి భాగంలో బలపడుతుంది.


కొబ్బరి పాలతో మసాజ్

జుట్టు రాలడానికి శీఘ్ర రెమెడీ కొబ్బరి పాలతో తలకు సున్నితంగా మసాజ్ చేయడం. ఆ తర్వాత తలకు వెచ్చని టవల్ చుట్టడం. రెగ్యులర్ హెయిర్ వాష్, కండిషనింగ్‌తో ఈ చిట్కాను అనుసరించడం వల్ల హెయిర్ ఫాల్ సమస్య అదుపులోకి వస్తుంది.



వేసవిలో ఆకలి చచ్చిపోయి తీపిపదార్థాలు, చల్లని ఆహారం వైపు మనసు మళ్లేలా చేస్తుంది. కానీ వీటివల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. పేగు ఆరోగ్యం బాగుంటే అసిడిటీ, బ్లోటింగ్, మలబద్ధకం సమస్యలు వేసవిలో వేధించవు. ఆహారంలో అవసరమైనంత ప్రొబయాటిక్స్, చలువ చేసే పదార్థాలు చేర్చుకోవడం మంచిది. పప్పన్నం బదులుగా పెరుగన్నం, బార్లీ, రాగులను తినడం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరకు రసం తాగడం వల్ల జీర్ణ సమస్యలు రావు.

కడుపు చల్లగా.. నోటికి రుచిగా...



బార్లీ సలాడ్... మలబద్ధకం,పేగు సమస్యలు రాకుండా చలువ చేసే తాజా, పోషకాలతో కూడిన రుచికరమైన ఆహారం ఇది. బార్లీలో పీచు ఎక్కువగా ఉంటుంది. ఆహారం తేలికగా జీర్ణమయ్యేలా చేస్తుంది. దీంట్లో ఉండే పీచువల్ల కడుపు నిండిన భావన వస్తుంది. ఎక్కువ తినాలనిపించకుండా చేస్తుంది. బార్లీలో విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఐరన్, మెగ్నీషియం, సెలేనియం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పాదాల వాపును, కిడ్నీ ఇన్ఫెక్షన్‌ను తగ్గించి మలబద్ధకం లాంటి సమస్యలు రాకుండా చేస్తుంది. ఉడికించిన బార్లీగింజలతోపాటూ కూరగాయలు, పండ్లు, నట్స్ కలుపుకుని తినొచ్చు. రుచిగా ఉండాలంటే తేనెలో కొన్ని మూలికలు, ఉప్పు, రుచికి తగ్గట్లు కలిపి బార్లీ గింజల్లో కలుపుకోవచ్చు. వేసవిలో చలువ చేసే ఆహారం ఇది.



పెసర మొలకలతో... మొలకెత్తిన పెసలతో చేసిన సలాడ్ ఆరోగ్యానికి మంచిది. ఫైబర్, ఎంజైములు, విటమిన్లు ఆహారం తొందరగా జీర్ణమయ్యేలా చేస్తాయి. దీంట్లో కొవ్వు తక్కువ, పోషకాలెక్కువ. మొలకెత్తిన పెసలలో కాస్త పెరుగు కలుపుకుని తింటే ఇంకా మంచిది. లేదంటే మొలకలతోపాటూ కూరగాయలు, మూలికలు, పెరుగు కలుపుకోండి. మీద కాస్త ఉప్పు, మిరియాల పొడి, నిమ్మరసం పిండుకోవచ్చు. చాలా తేలికగా ఉండి, కడుపు నింపే ఆహారం ఇది.



బూడిద గుమ్మడికాయ జ్యూస్... వేసవిలో పొట్ట ఆరోగ్యానికి ఇది చాలా మేలు చేస్తుంది. చలువ చేసే లక్షణం కూడా చాలా ఎక్కువ. దీంట్లో నీళ్ల శాతం ఎక్కువ ఉండటం వల్ల శరీరాన్ని ఎక్కువసేపు హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. శరీరంలో పీహెచ్ స్థాయులను నియంత్రణలో ఉంచుతుంది. అజీర్తి, బ్లోటింగ్ సమస్యలు రాకుండా చూస్తుంది.



పెరుగన్నం... దీంట్లో పుష్కలంగా ఉన్న ప్రోబయాటిక్స్ వల్ల జీర్ణసమస్యలు తగ్గుతాయి. ఆహారం తొందరగా జీర్ణమవుతుంది. క్యాల్షియం, ప్రొటీన్ మన శరీరానికి అవసరమైనంత దొరుకుతుంది. దీనికున్న చలువ చేసే లక్షణాల వల్ల శరీర ఉష్ణోగ్రత కూడా నియంత్రణలో ఉంటుంది. ఇంకేం, వేసవిలో పెరుగన్నం తప్పకుండా తినండి.



మజ్జిగ... వేసవిలో మజ్జిగ చేసే మేలు అంతా ఇంతా కాదు. పెరుగులో నీళ్లు కలిపి మజ్జిగ చేసుకోవచ్చు. దీంట్లో కూడా ప్రోబయాటిక్స్ ఉంటాయి. జీర్ణక్రియ వేగవంతం చేస్తాయి. తక్కువ కొవ్వు, కేలరీలుంటాయి దీంట్లో. మజ్జిగలో ఆవాలు, పుదీనా, కరివేపాకు కలిపి రుచి పెంచుకోవచ్చు. నూనె లేకుండా ఒక చెంచా ఆవాలు, కరివేపాకు వేయించుకోవాలి. చల్లారాక పుదీనా ఆకులతో కలిపి మిక్సీ పట్టుకోవాలి. దీన్ని మజ్జిగలో కలుపుకుంటే చాలు. ఆరోగ్యంతో పాటూ రుచీ వస్తుంది.

సినిమా

పల్లెకు పోదాం..

'పల్లెకు పోదాం సినిమా చేద్దాం. ఛలో చలో' అని పాడుకుంటున్నారు కొందరు హీరోలు. ఈ హీరోలతో వెండితెరపై పల్లె కథలను చూపించేందుకు రెడీ అవుతున్నారు దర్శకులు. ఈ పల్లెటూరి కథల్లోకి వెళదాం.



● నాగార్జున
● రామ్‌చరణ్

1990లో ఓ గ్రామం

నాగార్జున కెరీర్‌లో విలేజ్ బ్యాక్‌డ్రాప్ మూవీస్ చాలానే ఉన్నాయి. మరోసారి నాగార్జున ఓ విలేజ్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారట. రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ ఈ విలేజ్ స్టోరీని డెవలప్ చేశారు. అంతే కాదు... ఈ సినిమాతో ఆయన దర్శకుడిగా పరిచయం కానున్నారని సమాచారం. అభిషేక్ అగర్వాల్ ఈ సినిమాను నిర్మిస్తారని తెలిసింది. 1990 నేపథ్యంలో సాగే ఈ చిత్రం షూటింగ్ ఈ నెలలోనే ఆరంభం కానుంది.



● రవితేజ

కేరాఫ్ స్టువర్టుపురం

1970లలో స్టువర్టుపురంలోని నాగేశ్వరరావు గురించి తెలియనివాళ్లు ఉండి ఉండరు. ఆయన జీవితంతో 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రం రూపొందింది. రవితేజ హీరోగా వంశీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో గాయత్రీ భరద్వాజ్, నూపుర్ సనన్ నాయికలు. టైగర్ నాగేశ్వరరావు జీవితం ఏ విధంగా గడిచింది? ఆయన్ను కొందరు దొంగ అని, మరి కొందరు పేదలకు హెల్ప్ చేసే ఆపద్బాంధవుడు అని ఎందుకు చెప్పుకుంటున్నారు? అనే కోణంలో ఈ సినిమా ఉంటుందట. అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 20న రిలీజ్ కానుంది.

పల్లెటూరి ఆటగాడు

హీరో రామ్‌చరణ్ కెరీర్‌లో 'రంగస్థలం' చిత్రం ఎంతటి ఘనవిజయం సాధించిందో తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో చిట్టిబాబు పాత్రలో రామ్‌చరణ్ సూపర్బ్. ఇప్పుడు సుకుమార్ శిష్యుడు, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సనతో ఓ సినిమా చేసేందుకు రామ్ చరణ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇది పల్లెటూరి నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ ఫిల్మ్ అని, ఇందులో అన్నదమ్ములుగా రామ్‌చరణ్ డ్యూయల్ రోల్ చేయనున్నారని భోగట్టా. ఉత్తరాంధ్ర ప్రాంతంలోని ఓ విలేజ్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్ ఇదని సమాచారం. వెంకట సతీష్ కిలారు నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.



● సందీప్ కిషన్



● సుధీర్‌బాబు

భైరవకోన మిస్టరీ

శ్రీకృష్ణదేవరాయల కాలంలో చెలామణిలో ఉన్న గరుడ పురాణానికి, ఇప్పటి గరుడ పురాణానికి నాలుగు పేజీలు తగ్గాయట. ఆ గరుడ పురాణంలో మిస్ అయిన ఆ నాలుగు పేజీల కథే భైరవకోన అని హీరో సందీప్ కిషన్ అంటున్నారు. మరి.. ఆడియన్స్‌కు ఈ మిస్టరీ తెలియాలంటే థియేటర్స్‌కు రానున్న 'ఊరిపేరు భైరవకోన' సినిమా చూడాలి. సందీప్ కిషన్ హీరోగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన సినిమా ఇది. రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది.




● నాగశౌర్య



● వైష్ణవ్ తేజ్

రంగబలి రాజకీయం

రంగబలి అనే విలేజ్‌లో జరిగే ఘటనలు, రాజకీయ కోణాల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'రంగబలి'. నాగశౌర్య, యుక్తి తరేజ జంటగా నటిస్తున్నారు. ఈ సినిమాకు పవన్ బాసంశెట్టి దర్శకుడు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం జూలై 7న విడుదల కానుంది.



● విశ్వక్ సేన్

కుప్పంలో హరోంహర

చిత్తూరు జిల్లా కుప్పంలో 'హరోంహర' అంటున్నారు సుధీర్‌బాబు. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న చిత్రం 'హరోం హర'. 1989 చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగే కథగా 'హరోం హర' సాగుతుంది. సుమంత్ జి. నాయుడు నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 22న రిలీజ్ కానుంది. తెలుగు, తమిళ, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.

ఆదికేశవ ఆగమనం

రాయలసీమలోని ఓ గ్రామంలో ఉన్న దేవాలయంపై మైనింగ్ మాఫియా చూపు పడింది. ఈ మాఫియాకు అడ్డుగా నిలబడతాడు రుద్రకాళేశ్వర్ రెడ్డి. ఈ గ్రామాన్ని రుద్రకాళేశ్వర్ రెడ్డి ఏ విధంగా రక్షించాడు అనేది తెలుసుకోవాలంటే జూలైలో వచ్చే 'ఆదికేశవ' సినిమా చూడాలి. రుద్రకాళేశ్వర్ రెడ్డి పాత్రలో హీరోగా వైష్ణవ్ తేజ్ నటిస్తున్నారు. శ్రీలీల హీరోయిన్. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వంలో ఎస్. నాగవంశీ, సాయిసౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

స్మగ్లింగ్ నేపథ్యంలో...

కథ ప్రకారం రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో జరుగుతున్న స్మగ్లింగ్‌ను అడ్డుకోవాలనుకుంటున్నారట విశ్వక్ సేన్. 1994 నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఈ సినిమాకు కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో కాస్త గ్రే షేడ్స్ ఉన్న హీరో క్యారెక్టర్‌లో విశ్వక్ సేన్ నటిస్తున్నారు. ఇది రూరల్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

వాస్తవ ఘటన ఆధారంగా....

'గంగతలపై ఉన్నంత వరకే శివుడు చల్లగా ఉంటాడు. కంట్లోంచి గానీ జారిందా శివమెత్తుతాడు' అనే పవర్‌ఫుల్ డైలాగ్ సాయిరామ్ శంకర్ నోట వచ్చింది ఓ సినిమా కోసం. విలేజ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. ప్రకాష్ జూరెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, రమణి జూరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయారాజా సంగీతం అందిస్తుండటం విశేషం. ఇలా విలేజ్ బ్యాక్‌డ్రాప్ కథలతో ప్రేక్షకులను అలరించేందుకు మరి కొందరు హీరోలు రెడీ అవుతున్నారు.



● సాయిరామ్ శంకర్

ఒక వర్ణం చేరెలే...

'రెయిన్ బో చివరే.. ఒక వర్ణం చేరెలే...' అంటూ కారులో వెళుతూ, దారిలో కలిసినవారితో సరదాగా గడుపుతూ పాడుకుంటున్నారు సిద్ధార్థ్, దివ్యాంశా కౌశిక్. ఈ ఇద్దరూ జంటగా నటించిన 'టక్కర్' చిత్రంలో పాట ఇది. సినిమాలో వచ్చే ఈ నాలుగో పాట వీడియోను శుక్రవారం రిలీజ్ చేశారు. చిత్ర సంగీతదర్శకుడు నివాస్ కె. ప్రసన్న స్వరపరచిన ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. బెన్నీ దయాల్, వృషబాబు పాడారు. కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ప్యాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ''ఈ చిత్రంలో సిద్ధార్థ్ సరికొత్త మేకోవర్‌తో కనిపిస్తారు. ఈ రొమాంటిక్ యాక్షన్ రైడ్ ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మయాంక్.



● సిద్ధార్థ్, దివ్యాంశా కౌశిక్

బోటు డ్రైవర్..?



● నాగచైతన్య

హీరో నాగచైతన్య బోటు డ్రైవర్‌గా మారనున్నారట. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా ఓ సినిమా రూపొందనుందనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. అల్లు అరవింద్ ఈ సినిమాను నిర్మించనున్నారట. ఈ సినిమా వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కనుందని, కథ రీత్యా నాగచైతన్య బోటు డ్రైవర్ పాత్రలో కనిపిస్తారనే వార్త తెరపైకి వచ్చింది. అంతేకాదు.. ఈ చిత్రం సూరత్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందట. ఈ అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఓ సామాన్యుడి సంతకం

'కొత్త బంగారులోకం', 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు', 'నారప్ప' వంటి సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల తర్వాతి చిత్రానికి 'పెద కాపు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాతో విరాట్ కర్ణ హీరోగా పరిచయం అవుతున్నారు. మిర్యాల సత్యనారాయణ సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌పై 'పెదకాపు 1' అని ఉంది. సో... ఈ సినిమా రెండు భాగాలుగా రానున్నట్లుగా తెలుస్తోంది. అలాగే పోస్టర్‌పై 'ఓ సామాన్యుడి సంతకం' అనే ట్యాగ్‌లైన్ ఉంది. ఈ సినిమా కథ 1990 నేపథ్యంలో సాగుతుందని తెలిసింది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.



● విరాట్ కర్ణ

ప్రేమ తగ్గిపోతుందా?



● చాందిని, అర్జున్

అర్జున్ అంబటి, చాందిని తమిళరసన్ జంటగా వెంకటరమణ మిద్దె స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'వెడ్డింగ్ డైరీస్'. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''విడిపోవాలనుకున్న భార్యాభర్తలు తమ ప్రేమను బలపర్చుకొని వైవాహిక బంధాన్ని ఎలా కొనసాగించారు? ఆ భార్యాభర్తల నడుమ ఎలాంటి సంఘర్షణ జరిగింది? అనేది ఈ సినిమాలోని మెయిన్ పాయింట్. 'పెళ్లి తర్వాత ప్రేమ తగ్గిపోతుందా..?' అనేది కాన్సెప్ట్'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

లవ్... క్రైమ్

ప్రదీప్ విరాజ్, దివ్య ఖుష్వా జంటగా మనోజ్ ఎల్లుమహంతి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వి. సముద్ర కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా క్లాప్ ఇచ్చారు. బిజినెస్ మ్యాన్ రామ్ ఎర్రమ్ స్క్రిప్ట్‌ని చిత్రయూనిట్‌కు అందించారు. లవ్ అండ్ క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని బీఎన్‌కే (బంగారు నవీన్ కుమార్) నిర్మించనున్నారు. దర్శకుడు మనోజ్ మాట్లాడుతూ– ''క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలోని ప్రతి సీన్ ఉత్కంఠభరితంగా ఉంటుంది'' అన్నారు. ''అన్ని కమర్షియల్ అంశాలు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు బీఎన్‌కే. ఈ సినిమాకు కెమెరా: పంకజ్ తట్టోడ.



● ప్రదీప్, దివ్య

సరికొత్త కథతో...



● సాయి సునీల్, విశ్వక్ సేన్

విరాట్ కార్తీక్, యామినీ రాజ్, ప్రియాంక రెవ్రి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమదేశపు యువరాణి'. సాయి సునీల్ నిమ్మల దర్శకత్వంలో ఆనంద్ వేమూరి, హరిప్రసాద్ సీహెచ్ నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని హీరో విశ్వక్ సేన్ విడుదల చేశారు. ''లవ్, కామెడీ, మంచి ఎమోషన్స్‌తో ఓ సరికొత్త కథతో ఈ సినిమాని రూపొందించాం. అజయ్ పట్నాయక్ సంగీతం, శివ ఫొటోగ్రఫీ ఈ సినిమాకి ఓ హైలైట్'' అని సాయి సునీల్ నిమ్మల అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	119	62,547
నిఫ్టీ ▲	46	18,534

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	13,240	▲ 139
డోజోన్స్	33,731	▲ 669
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,607	▲ 117
డాక్స్	16,051	▲ 198
షాంఘై	3,230	▲ 25
నికాయ్	31,524	▲ 376

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో – ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	60,308	▲ 151
బంగారం (99.5 స్వచ్ఛత)	60,067	▲ 151
వెండి (కిలో)	71,372	0

తనిష్క్ 100 టన్నుల బంగారు మార్పిడి ఉత్సవాలు



హైదరాబాద్: టాటా గ్రూప్ ఆభరణాల బ్రాండ్ తనిష్క్– బంగారం మార్చుకోవడానికి సంబంధించి కీలక 1,00,000 కిలోల (100 టన్నులు) మైలురాయికి చేరుకుంది. ఈ మేరకు కంపెనీ ఒక ప్రకటన చేస్తూ, రెండు లక్షల మంది బంగారాన్ని మార్చుకున్నట్లు వెల్లడించింది. 'నేటి అధిక ధరలు, లాకర్లలో పడి ఉన్న పాత బంగారం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే, వినియోగదారులకు మార్పిడి మంచిది. ఇది దిగుమతులను తగ్గిస్తుంది కాబట్టి దేశ ఆర్థిక వ్యవస్థకూ శుభదాయకమే. పాత బంగారం మార్పిడి వేడుకల్లో మాతో చేరి, తమ పాత ఆభరణాలను మార్చుకోవాలని మేము ఈ సందర్భంగా అందర్నీ ఆహ్వానిస్తున్నాము'' అని టైటాన్ కంపెనీ లిమిటెడ్ జ్యువెలరీ విభాగం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అజోయ్ చావ్లా తెలిపారు. తనిష్క్‌లో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ఆఫర్ ఏడాది పొడవునా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని స్టోర్‌లలో అమలవుతుంది. 20 క్యారెట్లు, అంతకంటే ఎక్కువ పాత బంగారంపై 100% విలువను అందించే ఆఫర్ సంస్థ షాపింగ్ సైన్‌లో లభ్యమవుతుంది.

గ్రామీణ భారతంపై హ్యుందాయ్ ఇండియా దృష్టి



హైదరాబాద్: డిజిటల్ ఫ్లోట్ వ్యాన్ల ద్వారా గ్రామీణ కొనుగోలుదారులను ఆకర్షించాలని హ్యుందాయ్ ఇండియా వ్యూహరచన చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన ప్రకారం కారును స్వయంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శించడం ఈ చొరవ ఉద్దేశం. ఇందులో భాగంగా, గ్రాండ్ ఐ10 నియోస్‌ను వినియోగదారుల ఇళ్ల వద్దకే పంపాలని నిర్ణయించింది. 36 డిజిటల్ ఫ్లోట్‌లు వచ్చే రెండు నెలల్లో 27 రాష్ట్రాల్లోని దాదాపు 582 గ్రామీణ ప్రాంతాలను కవర్ చేయాలన్నది కంపెనీ లక్ష్యం. తెలుగు రాష్ట్రాల్లో 61 గ్రామీణ ప్రాంతాలను కవర్ చేయడానికి 4 డిజిటల్ ఫ్లోట్‌లను సిద్ధం చేసింది. తెలుగు రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాలకు బయలుదేరిన డిజిటల్ ఫ్లోట్ వ్యాన్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులను చిత్రంతో తిలకించవచ్చు. ''భారత్ డైనమిక్ మార్కెట్‌లో చివరి మైలు ను చేరుకోవడానికి వినూత్న విధానాలను అవలంబించాలని మేము విశ్వసిస్తున్నాము. ఉత్పత్తులను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాము'' అని హ్యుందాయ్ మోటార్ ఇండియా సీఓఓ తరుణ్ గార్గ్ పేర్కొన్నారు.

స్థానిక కరెన్సీల్లో వాణిజ్యానికి ప్రాధాన్యం

బ్రిక్స్ దేశాల తీర్మానం



కేప్ టౌన్: అంతర్జాతీయ వాణిజ్యంలో, ఆర్థిక లావాదేవీల్లో స్థానిక కరెన్సీలను వినియోగించాల్సిన అవసరం ఉందని బ్రిక్ కూటమి దేశాలు అభిప్రాయపడ్డాయి. నిబంధనల ఆధారిత స్వేచ్ఛా, పారదర్శక గ్లోబల్ వాణిజ్యానికి కట్టుబడి ఉండాలని పేర్కొన్నాయి. రెండు రోజుల పాటు జరిగిన బ్రిక్స్ కూటమి దేశాల విదేశీ వ్యవహారాల మంత్రుల సమావేశం సందర్భంగా 'ది కేప్ ఆఫ్ గుడ్ హోప్' పేరిట ఈ మేరకు ఒక సంయుక్త తీర్మానం విడుదల చేశాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో పక్షపాత రహిత, పారదర్శక, స్వేచ్ఛాయుత బహుళపక్ష ట్రేడింగ్ వ్యవస్థకు పెద్ద పీట వేయాలని .. అభివృద్ధి చెందుతున్న దేశాలను ప్రత్యేకంగా పరిగణించాలని ఇందులో తెలిపాయి. పర్యావరణ పరిరక్షణ పేరిట దేశాలు ఏకపక్షంగా రక్షణాత్మక చర్యలకు పూనుకోవడం తగదని స్పష్టం చేశాయి. ఇలాంటివి అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, వీటి వల్ల ప్రపంచ ఎకానమీపై ప్రతికూల ప్రభావం పడుతుందని బ్రిక్స్ దేశాలు తెలిపాయి. ఆంక్షలు, నిషేధాల రూపంలో ఆర్థికంగా ఇబ్బందులు పెట్టే చర్యలు చేపడుతుండటం వల్ల పరిస్థితి మరింత జటిలమవుతోందని పేర్కొన్నాయి. ఆర్థిక అభివృద్ధి, సామాజిక స్థిరత్వం, దేశ భద్రత, ప్రపంచవ్యాప్తంగా దేశాల సంక్షేమానికి ఇంధన భద్రతను సాధించడం కీలకమని తెలిపాయి. అయిదు అతి పెద్ద వర్ధమాన దేశాలైన భారత్, బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా.. బ్రిక్స్ కూటమిలో ఉన్నాయి.

కోల్ ఇండియా ఓఎఫ్ఎస్ సక్సెస్



న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియాలో ప్రభుత్వం చేపట్టిన ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) విజయవంతమైంది. అటు సంస్థాగత ఇన్వెస్టర్లు, ఇటు రిటైలర్ల నుంచి భారీగా బిడ్స్ దాఖలయ్యాయి. వారాంతాన రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 2.58 కోట్ల షేర్లకు, సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి 5.12 కోట్ల షేర్లకు దరఖాస్తులు లభించాయి. గురువారం సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి రూ. 6,500 కోట్ల విలువైన బిడ్స్ దాఖలైన సంగతి తెలిసిందే. వెరసి ప్రభుత్వానికి ప్రభుత్వానికి సుమారు రూ. 4,160 కోట్లు అందనున్నాయి. కంపెనీలో 3% వాటా విక్రయించేందుకు కేంద్రం ఓఎఫ్ఎస్‌ను చేపట్టింది. ఇందుకు రూ. 225 ఫ్లోర్ ధరను నిర్ణయించింది. ఓఎఫ్ఎస్‌లో భాగంగా ప్రభుత్వం తొలుత దాదాపు 1.5% వాటాను విక్రయానికి ఉంచింది. ఆఫర్‌కు అత్యధిక స్పందన లభిస్తే మరో 1.5 శాతం వాటాను సైతం విక్రయించేందుకు గ్రీన్ షూ ఆప్షన్ ఎంచుకుంది.

గెయిల్ చేతికి జేబీఎఫ్ కెమ్

- పూర్తి అనుబంధ సంస్థగా ఏర్పాటు
- రూ. 2,101 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: దివాలా చట్ట ప్రకారం జేబీఎఫ్ పెట్రోకెమికల్స్‌ను యుటిలిటీ రంగ పీఎస్‌యూ గెయిల్ ఇండియా చేజిక్కించుకుంది. ఇందుకు వీలుగా ప్రైవేట్ రంగ సాల్వెంట్ కంపెనీ జేబీఎఫ్‌లో రూ. 2,101 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. తద్వారా ఈ జూన్ 1 నుంచి సొంత అనుబంధ సంస్థగా మార్చుకుంది. జేబీఎఫ్‌ను కొనుగోలు చేసేందుకు మార్చిలో దివాలా చట్ట సంబంధ కోర్టు గెయిల్‌ను అనుమతించిన సంగతి తెలిసిందే. రుణ పరిష్కార ప్రణాళిక ప్రకారం జేబీఎఫ్‌కు ఈక్విటీ రూపేణా రూ. 625 కోట్లు, రుణాలుగా రూ. 1,476 కోట్లు అందించినట్లు గెయిల్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తాజాగా వెల్లడించింది. కాగా.. జేబీఎఫ్ కొనుగోలుకి ఇతర పీఎస్ యూ దిగ్గజాలు ఐవోసీ, ఓఎన్‌జీసీలతో పోటీపడి గెయిల్ బిడ్ చేసింది. రూ. 5,628 కోట్ల బకాయిల రికవరీకిగాను ఐడీబీఐ బ్యాంక్ దివాలా ప్రక్రియను చేపట్టింది.

కంపెనీ బ్యాక్‌గ్రౌండ్

జేబీఎఫ్ పెట్రోకెమికల్స్ 2008లో ఏర్పాటైంది. మంగళూరు సెజ్‌లో 1.25 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో ప్యూరిఫైడ్ టెరిఫ్తాలిక్ యాసిడ్(పీటీఏ) ప్లాంటును నెలకొల్పేందుకు కంపెనీకి ఐడీబీఐసహా ఇతర బ్యాంకులు రుణాలందించాయి. బీపీ సాంకేతిక మద్దతుతోపాటు 60.38 కోట్ల డాలర్ల రుణాలను మంజూరు చేశాయి. అంతేకాకుండా ముడిసరుకుగా నెలకు 50,000 టన్నుల పారాగ్జిలీన్‌ను సరఫరా చేసేందుకు ప్రభుత్వ రంగ కెమికల్ సంస్థ ఓఎంపీఎల్ సైతం అంగీకరించింది. ప్రధానంగా జేబీఎఫ్ ఇండస్ట్రీస్ పాలియస్టర్ ప్లాంట్లకు అవసరమైన ముడిసరుకును రూపొందించేందుకు ఈ సంస్థ ఏర్పాటైంది. 2017లో కార్యకలాపాలు ప్రారంభించిన సంస్థ రుణ చెల్లింపుల్లో విఫలంకావడంతో అదే ఏడాది మూతపడింది. వెరసి కార్పొరేట్ దివాలా ప్రక్రియకు లోనైంది. కాగా.. గెయిల్ యూపీలోని పటాలో వార్షికంగా 8,10,000 టన్నుల సామర్థ్యంతో పెట్రోకెమికల్ ప్లాంటును కలిగి ఉంది. వచ్చే ఏడాదికల్లా మహారాష్ట్రలోని ఉసార్‌లో ప్రొపేన్ డీహైడ్రోజనేషన్ ప్లాంటును నిర్మించే లక్ష్యంతో ఉంది. తద్వారా ఏడాదికి 5,00,000 టన్నుల పాలీప్రొపిలీన్‌ను రూపొందించాలని ప్రణాళికలు వేసింది.

ఈ వార్తల నేపథ్యంలో గెయిల్ షేరు ఎన్ఎస్ఈలో 0.6 శాతం నీరసించి రూ. 105 వద్ద ముగిసింది.

విమాన టికెట్ల ధరలకు రెక్కలు

- ఉద్యోగుల్లో పెరిగిన అనిశ్చితి
- గోఫస్ట్ మూతపడడంతో మారిన పరిస్థితులు
- కార్యకలాపాల పునఃప్రారంభంపై చర్చలు



న్యూఢిల్లీ: గోఫస్ట్ ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలు నిలిపివేసిన తర్వాత ఈ పరిశ్రమలో పరిస్థితులు మారిపోయాయి. ముఖ్యంగా విమాన ప్రయాణికులపై చార్జీల భారం పెరిగింది. అన్ని ఎయిర్‌లైన్స్ సంస్థలు పలు మార్గాల్లో టికెట్ చార్జీలను పెంచేశాయి. గోఫస్ట్ దివాలా పరిష్కారం కోరుతూ ఎన్‌సీఎల్‌టీ ముందు పిటిషన్ దాఖలు చేసుకుంది. ఫలితంగా పౌర విమానయాన సేవల్లో కొంత పోటీ తగ్గింది. ఇది మిగిలిన ఎయిర్‌లైన్స్ సంస్థలకు అనుకూలించే పరిణామం కాగా, ఉద్యోగుల్లో అనిశ్చితి పెరిగింది. వారికి ఉద్యోగ భద్రత కరువైంది. మరో వైపు ప్రయాణికులపై చార్జీల భారం పడింది. ఈ పరిణామాలను నివారించేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తన వంతు ప్రయత్నాలు ప్రారంభించింది. కార్యకలాపాల పునరుద్ధరణ ప్రణాళికలపై సంస్థ ఉన్నతోద్యోగులతో చర్చలు నిర్వహించింది. గోఫస్ట్ ఎయిర్‌లైన్స్ కింద మొత్తం 7,000 వరకు పనిచేస్తున్నారు. ఇందులో ఒక వర్గం ఉద్యోగులు సంస్థ కార్యకలాపాలు తిరిగి ప్రారంభం అయ్యే విషయంలో ఆశావహంగా ఉన్నారు. మరో వర్గం ఉద్యోగులు మాత్రం కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్, జెట్ ఎయిర్‌వేస్ పరిణామాలను గుర్తు తెచ్చుకుని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైలట్లలో ఎక్కువ మంది ఇతర సంస్థల్లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం. ప్రాట్ అండ్ విట్నీ ఇంజిన్లలో సమస్యలతో సగం విమానాలు అందుబాటులో లేకపోవడం వల్ల నిర్వహణ అసాధ్యమంటూ.. గోఫస్ట్ తన కార్యకలాపాలను మే 3 నుంచి నిలిపివేయడం గమనార్హం. గోఫస్ట్ దివాలా పిటిషన్‌ను ఆ సంస్థకు విమానాలను లీజుకు ఇచ్చిన సంస్థలు సవాలు చేయడం తెలిసిందే.

22 శాతం పెరుగుదల

విమాన సర్వీసుల లభ్యత తగ్గడం టికెట్ చార్జీలు పెరగడానికి దారితీసినట్టు క్లియర్‌ట్రిప్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ పట్వారీ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా డీ15 ప్రయాణ చార్జీలు 22 శాతం (ఏప్రిల్‌తో పోల్చినప్పుడు) పెరిగినట్టు తెలిపారు. అంటే తదుపరి 15 రోజుల్లో ప్రయాణ సర్వీసులపై రేట్లు పెరిగినట్టు అర్థం చేసుకోవాలి. సాధారణంగా వేసవి సీజన్ ఎయిర్‌లైన్స్ సంస్థలకు రద్దీగా ఉంటుంది. ఈ సమయంలో గోఫస్ట్ సేవలు నిలిపివేయడంతో ఒక్క రోజులో చేసే ప్రయాణ టికెట్ల బుకింగ్‌లపై రేట్లు 40 శాతం వరకు పెరిగినట్టు పట్వారీ తెలిపారు. జూన్ చివరి వరకు ఇదే పరిస్థితి కొనసాగొచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మెటల్, ఆటో షేర్లకు డిమాండ్

- రెండు రోజుల నష్టాలకు చెక్
- వారాంతాన స్వల్ప లాభాల ముగింపు



ముంబై: మెటల్, ఆటో, బ్యాంకింగ్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్పలాభపడ్డాయి. అమెరికా ఉద్యోగ గణాంకాల వెల్లడి, కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల పెంపు ఆందోళనల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ఉదయం సెన్సెక్స్ 173 పాయింట్ల పెరిగి 62,602 వద్ద, నిఫ్టీ 63 పాయింట్లు బలపడి 18,551 వద్ద మొదలయ్యాయి. సానుకూలంగా ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు మిడ్ సెషన్‌లో కొంత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలు కలిసి రావడంతో తిరిగి లాభాల బాటపట్టాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 340 పాయింట్ల పరిధిలో 62,380 వద్ద కనిష్టాన్ని, 62,720 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 18,478 – 18,574 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి సెన్సెక్స్ 119 పాయింట్లు బలపడి 62,547 వద్ద ముగిసింది. నిఫ్టీ 46 పాయింట్లు పెరిగి 18,534 వద్ద నిలిచింది. బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. ఐటీ, వినిమయ, ఇంధన షేర్లు మాత్రమే అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 45 పాయింట్లు, నిఫ్టీ 35 పాయింట్లు స్వల్పంగా లాభపడ్డాయి. ''అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. దేశీయంగా మే నెల ఆటో అమ్మకాలు మెరుగ్గా ఉండటం, జీఎస్టీ ఆదాయ వృద్ధి, తయారీ కార్యకలాపాలను సూచించే పీఎంఐ సూచీ 31 నెలల గరిష్టానికి చేరుకోవడం వంటి అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను పెంచాయి'' అని మోతీలాల్ ఓస్వాల్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమా తెలిపారు.



భారత 'ఎ' జట్టులో త్రిష, అనూషలకు చోటు

మహిళల ఎమర్జింగ్ ఆసియా కప్ -2023లో లో పాల్గొనే భారత మహిళల 'ఎ' జట్టును శుక్రవారం బీసీసీఐ ప్రకటించింది. హైదరాబాద్‌కు చెందిన గొంగడి త్రిష, ఆంధ్ర ప్లేయర్ బరెడ్డి అనూషలకు ఇందులో చోటు దక్కింది. 14 మంది సభ్యుల ఈ జట్టుకు శ్వేత సెహ్రావత్‌ను కెప్టెన్‌గా, సౌమ్య తివారిని వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. నూషీన్ అల్ ఖదీర్ ఈ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తుంది. ఈ నెల 13నుంచి హాంకాంగ్‌లో జరిగే టోర్నీలో ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. భారత్‌తో పాటు హాంకాంగ్, థాయిలాండ్ పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, మలేసియా, యూఏఈ పాల్గొంటున్నాయి.




లక్ష్యసేన్ సెమీస్‌కు...

థాయ్‌లాండ్ ఓపెన్



బ్యాంకాక్: భారత షట్లర్లకు థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో స్టార్ ప్లేయర్ లక్ష్యసేన్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లగా... యువ షట్లర్ కిరణ్ జార్జి పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో లక్ష్యసేన్ 21–19, 21–11తో మలేసియాకు చెందిన లియాంగ్ జున్ హావోపై అలవోక విజయం సాధించాడు. తొలి గేమ్‌లో ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనప్పటికీ నెట్ వద్ద చురుకైన ప్రదర్శన కనబరిచిన లక్ష్యసేన్ స్మాష్‌లతో రాణించాడు. ఇక రెండో గేమ్‌నయితే భారత స్టార్ ఏకపక్షంగా వశం చేసుకున్నాడు. చివరకు 41 నిమిషాల్లో ప్రత్యర్థి ఆటకట్టించాడు. శనివారం జరిగే సెమీఫైనల్లో లక్ష్యసేన్... స్థానిక ఆటగాడు, రెండో సీడ్ కున్లావుత్ వితిద్సర్న్ (థాయ్‌లాండ్)తో తలపడతాడు. మరో క్వార్టర్స్‌లో క్వాలిఫయర్ కిరణ్ 16–21, 17–21 టొమా జూనియర్ పొపొవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యాడు.

పట్టు బిగించిన ఇంగ్లండ్



పోప్

లండన్: ఐర్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో ఇంగ్లండ్ రెండో రోజే శాసించే స్థితికి చేరింది. శుక్రవారం 152/1 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌ను 82.4 ఓవర్లలో 524/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు ఒలీ పోప్ (205; 22 ఫోర్లు, 3 సిక్సర్లు) డబుల్ సెంచరీ, డకెట్ (182; 24 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదం తొక్కారు. జో రూట్ (56; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 352 పరుగుల ఆధిక్యం పొందింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన ఐర్లాండ్ ఆట నిలిచే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసింది. టెక్టర్ (33 బ్యాటింగ్), టక్కర్ (21 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. జోష్ టంగ్‌కు 3 వికెట్లు దక్కాయి. ప్రస్తుతం ఐర్లాండ్ మరో 255 పరుగులు వెనుకబడి ఉంది.

దాచిన కీచక పర్వాలెన్నో...

- ఎన్నో సార్లు లైంగిక వేధింపులు ఎదుర్కొన్నాం
- బ్రిజ్‌భూషణ్‌పై రెజ్లర్ల తీవ్ర ఆరోపణలు
- ఎఫ్ఐఆర్‌లో సంచలన వివరాలు



నేను దోషిగా తేలితే నన్ను ఉరి తీయండి, నేను ఏ తప్పూ చేయలేదు... రెజ్లర్ల నిరసన మొదలైన రోజునుంచి భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ చెబుతున్న మాట... ఏమైనా సాక్ష్యాలు ఉంటే చూపించండంటూ అతనికి మద్దతు ఇస్తున్నవారి వ్యాఖ్యలు... ఇప్పటి వరకు బహిరంగ వేదికలపైనే నిరసనలు కనిపించగా, అసలు రెజ్లర్లు ఏమని ఫిర్యాదు చేశారో, పోలీసులు ఆ స్టేట్‌మెంట్‌లను ఎలా రికార్డు చేశారో స్పష్టత లేదు. అయితే మెల్లగా ఒక్కో విషయం వెలుగులోకి వస్తోంది. బ్రిజ్‌భూషణ్ చేసిన పనుల గురించి, రెజ్లర్లు అనుభవించిన వేదన గురించి కొత్త అంశాలు వెల్లడవుతున్నాయి. ఒకటి, అరా మామూలు ఆరోపణలు కాదు... ఆ వ్యక్తి మహిళా రెజ్లర్లతో ఎలా వ్యవహరించాడనేది పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో వివరంగా ఉంది. ఈ ఎఫ్ఐఆర్‌తో కేసు కీలక మలుపు తిరగడం ఖాయం.



న్యూఢిల్లీ: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు సంబంధించి బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌లో పలు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. అనుచిత రీతిలో అమ్మాయిలను తాకడం మొదలు వారినుంచి సెక్స్‌ను ఆశించడం వరకు వేర్వేరు అంశాలు ఇందులో కనిపిస్తున్నాయి. బ్రిజ్‌భూషణ్‌పై ఐపీసీ 34, ఐపీసీ 354తో పాటు పోక్సో చట్టం (సెక్షన్ 10) కింద కేసులు నమోదయ్యాయి. ఎఫ్ఐఆర్‌లో వేర్వేరు రెజ్లర్లు వేర్వేరు సమయాల్లో జరిగిన కనీసం 15 ఘటనల గురించి ప్రస్తావించారు. బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులతో తమ అమ్మాయి మానసికంగా దెబ్బ తిందని, ఇప్పటికీ కోలుకోలేదని ఆరోపణలు చేసిన మైనర్ రెజ్లర్ తండ్రి పేర్కొన్నాడు. వాటిలో కొన్నింటిని వారి మాటల్లోనే వింటే...

- 'హోటల్ రెస్టారెంట్‌లో భోజనానికి వెళ్లిన సమయంలో ఆయన తన డిన్నర్ టేబుల్‌పైకి నన్ను విడిగా పిలిచాడు. ఛాతీ పైన చేతులు వేసి తన వైపు లాక్కోవడం, ఛాతీ కింది భాగంలో తడమడం ...ఇలా 3–4 సార్లు చేయడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాను. ఆయన ఆఫీస్‌లో కూడా ఇదే తరహాలో వ్యవహరించడంతో భయంతో వణికిపోయాను'
- 'నేను ప్రాక్టీస్ మ్యాట్‌పై పడుకొని ఉన్న సమయంలో కోచ్ లేని సమయం చూసి నా వద్దకు వచ్చిన ఆయన ఒక్కసారి నా టీ షర్ట్ తీసేసి శరీరమంతా తడుముతూ ఊపిరి చెక్ చేస్తున్నానని చెప్పాడు. ఒక సారి ఆఫీస్ లోపలికి పిలిచాడు. నాతో పాటు ఉన్న మా అన్నను బయటకు పంపించి తలుపు మూసేసి అనుచితంగా ప్రవర్తించాడు'
- 'ఆరంభంలో నా వద్ద మొబైల్ ఫోన్ లేకపోవడంతో తన ఫోన్‌తో మా తల్లిదండ్రులతో మాట్లాడించే సాకుతో తన గదిలోకి పిలిచి గట్టిగా కౌగిలించుకున్నాడు. తాను చెప్పినట్లు సెక్స్‌కు అంగీకరిస్తే రెజ్లర్లకు అవసరమైన సప్లిమెంట్‌లు ఇస్తానని కూడా చెప్పారు'
- 'నాతో కూడా భోజన సమయంలో పూర్తిగా ఇబ్బందికరంగా ప్రవర్తించాడు. అప్పటినుంచి భయం వేసి డిన్నర్‌కు విడివిడిగా కాకుండా బృందాలుగా వెళ్లాలని నిర్ణయించుకున్నాం'
- మేం ఒకసారి టీమ్ ఫోటో తీసుకుంటున్నాం. నేను చివర్లో నిలబడ్డా. ఒక్కసారిగా నా వద్దకు వచ్చి నా వెనక భాగంలో చేతులు వేయడం మొదలు పెట్టాడు. నిర్ఘాంతపోయిన నేను దూరం జరిగే ప్రయత్నం చేసినా భుజాలపై చేతులు వేసి దగ్గరకు లాక్కున్నాడు'
- 'నాతో కూడా ఫోటో దిగే సమయంలో అసభ్యంగా ప్రవర్తించాడు. నేను అతడిని నిరోధిస్తూ పూర్తి బలంతో తప్పించుకునే ప్రయత్నం చేయగా...చాలా అతి చేస్తున్నావు, ముందు ముందు పోటీల్లో పాల్గొనాలని లేదా అని హెచ్చరించాడు'

1983 బ్యాచ్ మద్దతు...

రెజ్లర్లకు మద్దతు ఇస్తున్నవారిలో 1983 వరల్డ్ కప్ నెగ్గిన భారత మాజీ క్రికెటర్లు చేరారు. కపిల్‌దేవ్ నేతృత్వంలో ఈ బృందం సంయుక్తంగా ఒక ప్రకటన జారీ చేసింది. 'మన చాంపియన్ రెజ్లర్ల పట్ల వ్యవహరించిన తీరు చూస్తే చాలా బాధ వేసింది. వారి ఫిర్యాదులు విని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అయితే తమ పతకాలను పడేయడం వంటి తీవ్రమైన పనులు చేయవద్దని రెజ్లర్లను కోరుతున్నాం. ఎన్నో ఏళ్ల శ్రమ, పట్టుదల, త్యాగాల ఫలితం ఆ పతకాలు' అని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఈ 'సంయుక్త ప్రకటన'తో తనకు సంబంధం లేదని, తాను ఎలాంటి ప్రకటన జారీ చేయలేదని ఈ జట్టులో సభ్యుడైన బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ స్పష్టం చేశారు. మరో వైపు నిందితుడిని ప్రధాని మోదీ రక్షిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. '25 అంతర్జాతీయ పతకాలు తెచ్చిన మన బిడ్డలు న్యాయం కోసం వీధికెక్కారు. 15 తీవ్ర ఆరోపణలతో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదైన వ్యక్తి ప్రధాన రక్షణ కవచంలో ఉన్నాడు' అని రాహుల్ ట్వీట్ చేశారు.



ప్రిక్వార్టర్స్‌లో సబలెంక, జొకోవిచ్



- మూడో సీడ్ పెగులా అవుట్
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ ప్రిక్వార్టర్స్‌లో ప్రవేశించాడు. అయితే శుక్రవారం పురుషుల, మహిళల విభాగాల్లో సంచలన ఫలితాలు నమోదయ్యాయి. అమెరికన్ అమ్మాయి మూడో సీడ్ జెస్సికా పెగులా ఆట మూడో రౌండ్లోనే ముగిసింది. పురుషుల ఈవెంట్‌లో రష్యన్ ప్లేయర్, ఏడో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్‌పై అన్‌సీడెడ్ సొనెగో అద్భుత విజయం సాధించాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ జొకోవిచ్ మూడో రౌండ్లో వరుస సెట్లలో గెలుపొందాడు. కానీ స్పెయిన్ ఆటగాడు డెవిడోవిచ్ ఫొకినా ప్రతీ సెట్‌లోనూ గట్టి పోటీ ఇచ్చాడు. దీంతో తొలి రెండు సెట్లు కైవసం చేసుకునేందుకు జొకోవిచ్ టైబ్రేక్ ఆడక తప్పలేదు. 3 గంటల 36 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో చివరకు జొకోవిచ్ 7–6 (7/4), 7–6 (7/5), 6–2 స్కోరుతో 29వ సీడ్ ఫొకినాపై గెలిచాడు. మిగతా మ్యాచ్‌ల్లో ఏడో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా) 7–5, 6–0, 3–6, 6–7 (5/7), 3–6తో లొరెంజొ సొనెగొ (ఇటలీ) చేతిలో కంగుతిన్నాడు. సొనెగొకు తన కెరీర్‌లో టాప్–10 ప్లేయర్‌ను ఓడించడం ఇది ఆరోసారి! ఇటలీకి చెందిన ప్రపంచ 48వ ర్యాంకర్ సొనెగొ ప్రిక్వార్టర్ ఫైనల్లో 11వ సీడ్ కరెన్ ఖచనోవ్ (రష్యా)తో తలపడతాడు. మూడో రౌండ్లో ఖచనోవ్ 6–4 6–1, 3–6, 7–6 (7/5)తో కొక్కినకిస్ (ఆస్ట్రేలియా)పై గెలుపొందాడు.

సబలెంక అలవోకగా...

మహిళల సింగిల్స్‌లో బెలారస్ స్టార్ సబలెంక అలవోక విజయంతో ప్రిక్వార్టర్స్ చేరింది. మూడో రౌండ్‌లో రెండో సీడ్ సబలెంక 6–2, 6–2తో కమిల్లా రఖిమొవ (రష్యా)పై విజయం సాధించింది. జెస్సికా పెగులా (అమెరికా) 1–6, 3–6తో 28వ సీడ్ ఎలైస్ మెర్టెన్స్ (బెల్జియం) చేతిలో చిత్తుగా ఓడింది. తొమ్మిదో సీడ్ దారియా కసత్కినా (రష్యా) 6–0, 6–1తో పెటన్ స్టియర్న్స్ (అమెరికా)పై, ఎలినా స్విటోలినా (ఉక్రెయిన్) 2–6, 6–2, 7–5తో అన్నా బ్లింకొవా (రష్యా)పై గెలుపొందగా... పవ్లుచెంకొవా (రష్యా) 4–6, 6–3, 6–0తో 24వ సీడ్ పొటపొవా (రష్యా)కు షాకిచ్చింది. పురుషుల డబుల్స్‌లో భారత్ పోరాటం ముగిసింది. రెండో రౌండ్లో సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ జోడీ 4–6, 5–7తో తొమ్మిదో సీడ్ గొంజాలెజ్ (మెక్సికో)–రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

చాంప్ శాన్విత-కోయిమిచ్



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జూనియర్ టోర్నీలో తెలంగాణ అమ్మాయి నూకల శాన్వితా రెడ్డి డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచింది. ఉగాండా రాజధాని కంపాలాలో జరిగిన ఈ టోర్నీలో జర్మనీకి చెందిన మిచెలి కోయిమిచ్‌తో జోడీ కట్టిన శాన్విత టైటిల్ సాధించింది. శుక్రవారం జరిగిన బాలికల డబుల్స్ ఫైనల్లో భారత్–జర్మనీ జంట 3–6, 6–4, 10–4తో సీహా మహాజన్ (భారత్)– లీలియా అకోమిటోవా (రష్యా) జోడీపై విజయం సాధించింది. అంతకుముందు జరిగిన క్వార్టర్స్‌లో శాన్విత–కోయిమిచ్ 6–1, 6–0తో అజం కపూరి–తమన్న వాలియాపై నెగ్గారు. సెమీఫైనల్లో 6–2, 6–3తో సహన మార్టిన్‌మహో– శిశు మకేనా తోమేగా (టాంజానియా) జంటపై గెలుపొందారు.

క్లుప్తంగా...

మల్లన్న సేవలో కేంద్ర సహాయ మంత్రి



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను కేంద్ర సహకార సంఘాలు, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి సహాయ మంత్రి బి.ఎల్.వర్మ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ రాజగోపురం వద్ద అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు జరిపించారు. స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు.

తిరుమల ఘాట్ రోడ్డులో కారు ప్రమాదం

- ప్రయాణికులు సురక్షితం



ప్రమాదానికి గురైన కారు

తిరుమల : తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా శుక్రవారం ఓ కారు ప్రమాదానికి గురైంది. తెలంగాణకు చెందిన భక్తులు కారులో తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుమల నుంచి తిరుపతికి మొదటి ఘాట్ రోడ్డు మీదుగా కిందకు దిగుతుండగా చివరి మలుపు వద్ద కారు అదుపు తప్పి రక్షణగోడకు ముందు ఉన్న బారికేడ్‌ను ఢీకొంది. కారులోని ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది కారును పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

రేపల్లెలో కొనసాగుతున్న ఐటీ సోదాలు



ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్న గృహం

రేపల్లె: బాపట్ల జిల్లా రేపల్లెలోని రొయ్యల వ్యాపారి, టీడీపీ నాయకుడు దండుప్రోలు పిచ్చయ్య, ఆయన సోదరుడు వెంకటేశ్వరరావు ఇళ్లతో పాటు వారి రొయ్యల కంపెనీలో ఐటీ అధికారుల సోదాలు రెండోరోజు శుక్రవారం కూడా కొనసాగాయి. ఒడిశాలోని పాలకెన్ రొయ్యల మేత, రొయ్యల ఎగుమతి కంపెనీతో పాటు పాల్కన్‌తో వ్యాపార లావాదేవీలు నడుపుతున్న పలువురు వ్యాపారుల ఇళ్లల్లో ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. దీన్లో భాగంగా రేపల్లెలో పిచ్చయ్య నివాసం, వ్యాపార కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. పాలకెన్ కంపెనీతో జరిపిన లావాదేవీలకు సంబంధించిన బిల్లులు, రైతుల దగ్గర నుంచి రొయ్యలను కొనుగోలు చేసి నగదు చెల్లించిన బిల్లులను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

• తెలంగాణ

వేడుకగా తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు

- రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకలు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు వివిధ పార్టీలు ఈ వేడుకలను పెద్దఎత్తున నిర్వహించాయి. గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. 1969లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న 30 మందిని ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారందరినీ గవర్నర్ తమిళిసై శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను సీఎం కె.చంద్రశేఖరరావు ప్రారంభించారు. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి.. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం తొమ్మిదేళ్లలో రాష్ట్రం సాధించిన విజయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గోల్కొండ ఖిల్లాలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ జాతీయ జెండా ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా గాంధీభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తవుతున్నందుకు సంతోషంగా ఉందని, అదే సమయంలో ఈ తొమ్మిదేళ్లలో కూడా ప్రజల కష్టాలు తీరనందుకు బాధగా ఉందని ఆమె అన్నారు.



ఏపీ జెన్‌కో ప్రస్తుతం 5,810 మెగావాట్ల థర్మల్, 1773.6 మెగావాట్ల హైడల్, 405.426 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉంది. లోయర్ సీలేరులో 230 మెగావాట్ల అదనపు ఉత్పత్తి కోసం రెండు అదనపు యూనిట్లను 2024 ఏప్రిల్‌కి అందుబాటులోకి తేనుంది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా ఉమ్మడి ప్రాజెక్టు అయిన మాచ్‌ఖండ్ పవర్ హౌస్ సామర్థ్యాన్ని కూడా 120 నుంచి 150 మెగావాట్లకు పెంచి

తగ్గనున్న కొనుగోళ్లు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పునర్నిర్మించాలని కూడా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వేసవిలో ఎనిమిదేళ్ల తరువాత అనూహ్యంగా డిమాండు పెరిగినప్పటికీ ఏపీ జెన్‌కో రోజూ సగటున 105 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు అందిస్తోంది. రాష్ట్ర మొత్తం వినియోగంలో 40 నుంచి 45 శాతం విద్యుత్ ఏపీ జెన్‌కో నుంచే వస్తోంది. కొత్తగా లైట్‌అప్ చేసిన యూనిట్ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభిస్తే రోజూ మరో 15 నుంచి 20 మిలియన్ యూనిట్లను జెన్‌కో అదనంగా సరఫరా చేస్తుంది. జెన్‌కో ఉత్పత్తి సామర్థ్యం ఎంత మేరకు పెరిగితే అంత మేరకు బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలును డిస్కంలు తగ్గించుకోవచ్చు.

పుష్కలంగా కరెంటు

అందుబాటులోకి మరో 800 మెగావాట్లు • విజయవాడ థర్మల్ కేంద్రంలో 8వ యూనిట్ మొదలు

ఆగస్టు నుంచి పూర్తిస్థాయిలో వాణిజ్య ఉత్పత్తి

దీంతో 8,789 మెగావాట్లకు ఏపీ జెన్‌కో ఉత్పత్తి సామర్థ్యం

ఏడాదిలోనే అందుబాటులోకి వచ్చిన 1,600 మెగావాట్లు

సాక్షి, అమరావతి/ఇబ్రహీంపట్నం: రాష్ట్ర విద్యుత్ రంగంలో ప్రభుత్వం మరో మైలురాయిని అధిగమించింది. విజయవాడ ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (డాక్టర్ ఎన్‌టీటీపీఎస్)లో స్టేజ్–5 కింద 800 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించిన 8వ యూనిట్‌ను విద్యుత్ ఉత్పత్తికి సిద్ధం చేసింది. కోవిడ్ కష్ట కాలాన్ని, అనేక సవాళ్లను అధిగమించి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయించిన ఈ యూనిట్‌ను ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీ జెన్‌కో చైర్మన్ కె.విజయానంద్, మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎస్ చక్రధర్ బాబు శుక్రవారం ఉదయం 'లైట్ అప్' చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. ఆగస్టు నాటికి దీనిలో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే ఏపీ జెన్‌కో విద్యుదుత్పత్తి సామర్థ్యం 8,789 మెగావాట్లకు పెరుగుతుంది.

సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అధ్యాయాలు

• విజయానంద్

గత ఏడాది కాలంలో 1,600 మెగావాట్ల అదనపు సామర్థ్యం గల రెండు యూనిట్లు అందుబాటులోకి రావడం ఏపీ జెన్‌కో చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అధ్యాయాలని జెన్‌కో చైర్మన్ విజయానంద్ చెప్పారు. ఎన్‌టీటీపీఎస్ నూతన యూనిట్‌ను 'లైట్ అప్' చేశారు. ముందుగా బాయిలర్‌లో నీటి ద్వారా స్టీమ్ తయారీ ప్రక్రియను ప్రారంభించారు. కంట్రోల్ రూమ్‌లో స్టీమ్ రీడింగ్‌పై సంతృప్తి వ్యక్తం చేసి ఇంజినీర్లను అభినందించారు. ఆవిరి ప్రక్రియ పూర్తి స్థాయికి చేరగానే బొగ్గు ద్వారా స్టీమ్ రీడింగ్ పెరిగి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. అనంతరం ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రంలో 800 మెగావాట్ల సామర్థ్యం గల స్టేజ్–2 యూనిట్‌ను గతేడాది అక్టోబర్ 27న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జాతికి అంకితం చేశారని గుర్తు చేశారు. ఎన్‌టీటీపీఎస్‌లో 800 మెగావాట్ల యూనిట్‌ను ఆగస్టు నాటికి కమర్షియల్ ఆపరేషన్ డేట్ (సీఓడీ)కి వీలుగా సిద్ధం చేయాలని బీహెచ్‌ఈఎల్, బీజీఆర్ ప్రతినిధులకు సూచించారు. ట్రయల్ రన్‌లో వచ్చే లోటుపాట్లను సరిదిద్దుకుని, మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు తెలిపారు. ఈ విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారన్నారు. ఏపీ జెన్‌కో డైరెక్టర్లు చంద్రశేఖర్‌రాజు (థర్మల్), బి.వెంకటేశులురెడ్డి (ఫైనాన్స్), సయ్యద్ రఫీ (హెచ్‌ఆర్, ఐఆర్), సత్యనారాయణ (హైడల్), అంథోనీ రాజ్ (కోల్) తదితరులు పాల్గొన్నారు.

కేసును కోర్టు కొట్టేస్తే ఉద్యోగిని విధుల్లోకి తీసుకోవాల్సిందే

అవే ఆరోపణలపై తీసుకున్న శాఖాపరమైన చర్యలు చెల్లవు

- తొలగింపు తేదీ నుంచి నిర్దోషిగా తేలేవరకు జీతభత్యాలకు అర్హుడు కాదు
- ఆ తరువాత నుంచి అన్ని ప్రయోజనాలకు అర్హుడే
- హైకోర్టు ధర్మాసనం తీర్పు
- హైకోర్టు తీర్పుతో 28 ఏళ్లకు తిరిగి ఉద్యోగం దక్కించుకున్న ఖాసిం సాహెబ్
- ట్రిబ్యునల్ తీర్పును, అధికారుల ఉత్తర్వులను రద్దు చేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి : ఏ ఆరోపణలతో శాఖాపరమైన విచారణ జరిపి ఉద్యోగిని సర్వీసు నుంచి తొలగించారో అదే ఆరోపణలపై నమోదైన కేసును న్యాయస్థానం కొట్టేసినప్పుడు ఆ ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకోవాల్సిందేనని హైకోర్టు తేల్చి చెప్పింది. న్యాయస్థానం అతన్ని నిర్దోషిగా విడుదల చేసినప్పుడు అదే ఆరోపణలపై సర్వీసు నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. ఇలా కర్నూలు జిల్లా, నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో టైపిస్ట్ ఖాసిం సాహెబ్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. తనను సర్వీసు నుంచి తొలగించడాన్ని సవాలు చేస్తూ ఖాసిం సాహెబ్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ పరిపాలన ట్రిబ్యునల్ జారీ చేసిన ఉత్తర్వులను సైతం హైకోర్టు రద్దు చేసింది. ఖాసింను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. అయితే సర్వీసులోని తొలగించిన తేదీ నుంచి నిర్దోషిగా తేలిన తేదీ వరకు నో వర్క్, నో పే సూత్రం ఆధారంగా ఎలాంటి జీతభత్యాలకు అర్హుడు కాదని స్పష్టం చేసింది. నిర్దోషిగా తేలిన నాటి నుంచి సర్వీసులో చేరేంత వరకు అన్ని ప్రయోజనాలకు అర్హుడని చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ వెణుతురుమిల్లి గోపాలకృష్ణారావు ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. దీంతో సర్వీసు నుంచి తొలగింపునకు గురైన 28 ఏళ్లకు ఖాసిం తిరిగి ఉద్యోగంలో చేరుతున్నారు.

రూ.69 వేల దుర్వినియోగం ఆరోపణలు

నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో టైపిస్ట్ డి.ఖాసిం సాహెబ్ ఇతర ఉద్యోగుల సంతకాలు ఫోర్జరీ చేసి డూప్లికేట్ రసీదులతో రూ.69 వేల మేర నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలతో 1988లో స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఖాసిం దుర్వినియోగానికి పాల్పడినట్లు శాఖాపరమైన విచారణలో తేలింది. దీంతో 1995లో అతన్ని ఉద్యోగం నుంచి తొలగించారు. ఇదిలా ఉండగానే ఖాసింపై పోలీసులు నమోదు చేసిన కేసును నందికొట్కూరు జూనియర్ ఫస్ట్ క్లాజ్ మేజిస్ట్రేట్ కోర్టు 1997లో కొట్టివేసింది. దీనిపై పోలీసులు హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేయగా, దానిని హైకోర్టు 1998లో కొట్టేసింది. ఈ నేపథ్యంలో తనను ఉద్యోగం నుంచి తొలగిస్తూ మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జి ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ ఖాసిం 2001లో ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ (ఏపీఏటీ)లో పిటిషన్ వేశారు. ఖాసిం రెండున్నరేళ్లు జాప్యం చేశారన్న కారణంతో అతని పిటిషన్‌ను 2003లో పరిపాలన ట్రిబ్యునల్ కొట్టేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ 2003లో ఖాసిం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ ధర్మాసనం ఇటీవల తుది విచారణ జరిపి, తీర్పు వెలువరించింది.

కారు డోర్‌లాక్‌తో ఊపిరాడక మహిళ విలవిల

- కారు అద్దాలు పగులగొట్టి కాపాడిన శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్



మహిళతో మాట్లాడుతున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా): కారు డోర్‌లాక్ పడి అందులోని మహిళ ఊపిరాడక విలవిల్లాడుతుంటే కారు అద్దాలు పగులగొట్టి కాపాడిన ఘటన శ్రీకాళహస్తీశ్వరాలయ కారు పార్కింగ్ ప్రాంతంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... రాయచోటి నుంచి ఓ కుటుంబం శ్రీకాళహస్తీశ్వరాలయానికి కారులో వచ్చారు. ఓ మహిళను కారులో ఉంచి మిగిలిన కుటుంబ సభ్యులు దర్శనానికి వెళ్లిపోయారు. అయితే డోర్ లాక్ పడిపోవడంతో ఊపిరాడక ఆ మహిళ విలవిల్లాడుతోంది. ఆ సమీపంలో మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఈ విషయం తెలుసుకుని వెంటనే అక్కడికి చేరుకున్నారు. కారు అద్దాలను పగులగొట్టి ఆ మహిళను బయటకు తీసుకువచ్చి రక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కింగ్‌లో కార్లు పెట్టి దర్శనానికి వెళ్లే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

రాజధానిగా విశాఖనే కోరుకుంటున్నారు..

978వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: ఇప్పటికే అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన విశాఖనే రాజధానిగా చేయాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 978వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల సమానాభివృద్ధితోనే అభివృద్ధి సాధ్యమవుతుందనే నిపుణుల సూచనల మేరకే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు వెళ్లి కులవాదులు మాట్లాడితే ప్రజలు తగిన శాస్తి చేస్తారన్నారు. రాజధాని ప్రాంతంలో భూములిచ్చిన రైతులలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన భూములు లేవా అని ప్రశ్నించారు. చంద్రబాబు రాజధాని పేరుతో చేసిన అన్యాయాలు, అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ చేస్తేనే వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ చట్టానికి దొరకకుండా 29 కేసుల్లో స్టేలు తెచ్చుకున్న బాబును జైల్లో పెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. బాబు ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు ఆయనను నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, కారుమూరి పుష్పరాజ్, పులి దాసు, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో ఘనంగా జ్యేష్ఠాభిషేకం ప్రారంభం



ధ్వజస్తంభానికి మొక్కుతున్న సీఎస్ జవహర్ రెడ్డి

తిరుమల: శ్రీవారి ఆలయంలో 3 రోజుల పాటు జరుగనున్న జ్యేష్ఠాభిషేకం శుక్రవారం ప్రారంభమైంది. ఆలయంలోని సంపంగి ప్రదక్షిణంలో ఉన్న కల్యాణమండపంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం రుత్వికులు యాగశాలలో శాంతి హోమం నిర్వహించారు. శతకలశ ప్రతిష్ఠ ఆవాహన, నవకలశ ప్రతిష్ఠ ఆవాహన, కంకణ ప్రతిష్ఠ అనంతరం స్వామి, అమ్మవార్లకు కంకణధారణ చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వజ్రకవచాన్ని అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులు వజ్రకవచంతో మాడ వీధుల్లో దర్శనమిచ్చారు.

4న డయల్ యువర్ ఈవో

డయల్ యువర్ ఈవో కార్యక్రమం ఈ నెల 4న ఉదయం 8–9 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. భక్తులు 0877–2263261 కు ఫోన్ చేసి సందేహాలను, సూచనలను ఈవోకి తెలుపవచ్చు. కాగా, తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. టైం స్లాట్ టోకెన్లు ఉన్న వారికి సకాలంలో, లేని వారికి 24 గంటల్లో, ఎస్‌ఈడీ టోకెన్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది

స్వామి వారిని దర్శించుకున్న సుప్రీం న్యాయమూర్తి



ధ్వజస్తంభం వద్ద జస్టిస్ రామసుబ్రమణియన్

శ్రీవారిని శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామసుబ్రమణియన్, ఏపీ ప్రభుత్వ సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, డిప్యూటీ ఈవో లోకనాథం లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

అమల్లోకి ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చట్టం

2030 నాటికి జల రవాణాను మూడు రెట్లు పెంచడమే లక్ష్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జల రవాణాను పెద్ద ఎత్తున ప్రోత్సహించే విధంగా రూపొందించిన 'ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ యాక్ట్–2023' శుక్రవారం (జూలై 2) నుంచి అమల్లోకి వచ్చినట్లు రాష్ట్ర పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికాల వలవన్ శుక్రవారం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో వెల్లడించారు. జల రవాణాను 2030 నాటికి మూడు రెట్లు పెంచాలనే లక్ష్యంతో గత బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ యాక్ట్–2023ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం జలమార్గం ద్వారా రాష్ట్రం నుంచి 60 లక్షల టన్నుల సరుకు రవాణా అవుతుండగా, దానిని 2030 నాటికి 180 లక్షల టన్నులకు చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకోసం ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని ప్రధాన నదులు, కాలువలు కలిపితే 1,555 కి.మీ. జల రవాణాకు వినియోగించుకోవడానికి అనువుగా ఉంటుంది. ఇందులో కనీసం 27 టెర్మినల్స్‌ను అభివృద్ధి చేయడానికి అవకాశాలు ఉన్నట్లు గుర్తించగా, తొలి దశలో ఐదు టెర్మినల్స్‌ను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది.

వ్యాన్‌లో యువకుడు సజీవ దహనం

- చెట్టుకు ఢీ కొట్టిన పాల వ్యాన్
- షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- నెల్లూరు జిల్లాలో ఘటన



వెంకట సాయి (ఫైల్)

కందుకూరు రూరల్: పాల వ్యాన్ చెట్టుకు ఢీకొట్టిన ప్రమాదంలో డ్రైవర్ సజీవదహనం అయిన ఘటన నెల్లూరు జిల్లా కందుకూరు మండలంలోని ఓగూరు సమీపంలో ఉద్యానవన కళాశాల వద్ద శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం పేర్నమిట్టకు చెందిన దద్దాల వెంకట సాయి ఒంగోలు నుంచి సంగం పాల వ్యాన్ తీసుకుని పొన్నలూరులో పాలు దించాడు. తిరిగి సింగరాయకొండ వెళ్తుండగా ఓగూరు గ్రామ సమీపంలోని ఉద్యానవన కళాశాల వద్ద చెట్టుకు వ్యాన్ ఢీకొట్టింది. దీంతో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ వెంకట సాయి (27) బయటకు వచ్చే వీలు లేకపోవడంతో సజీవదహనం అయ్యాడు. మృతుడికి భార్య, ఒక పాప ఉన్నారు. రూరల్ ఎస్‌ఐ శివనాంచారయ్య ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ప్రత్యేక కేటగిరీ కింద వసతులు కల్పించండి

- వైఎస్ భాస్కర్‌రెడ్డి పిటిషన్‌పై జిల్లా మేజిస్ట్రేట్‌కు సీబీఐ కోర్టు సిఫార్సు

సాక్షి, హైదరాబాద్: చంచల్‌గూడ జైలులో తనకు ప్రత్యేక కేటగిరీ కింద సదుపాయాలు కల్పించాలని కోరుతూ వైఎస్ భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌కు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం అంగీకారం తెలిపింది. ఈ మేరకు వసతులు కల్పించాలని హైదరాబాద్ జిల్లా మేజిస్ట్రేట్‌కు శుక్రవారం సిఫార్సు చేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో భాస్కర్‌రెడ్డిని గత నెలలో సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రత్యేక న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించడంతో ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఈ క్రమంలో తన అనారోగ్యాన్ని, వయసును దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కేటగిరీ కింద సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ భాస్కర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న న్యాయస్థానం .. భాస్కర్‌రెడ్డికి వసతులు కల్పించాలని సూచించింది. అలాగే తనకు బెయిల్ ఇవ్వాలని ఇప్పటికే ఆయన పిటిషన్ దాఖలు చేసి సంగతి తెలిసిందే. అనారోగ్యంతో బాధపడుతున్నానని, దాదాపు నెలన్నరగా చంచల్‌గూడలో జైలులోనే ఉంటున్నానని తన పిటిషన్‌లో తెలిపారు. ఇప్పటికే తన కస్టడీ విచారణ కూడా ముగిసిందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై కూడా సీబీఐ కోర్టు విచారణ చేపట్టింది. తదుపరి విచారణను ఈ నెల 5కి వాయిదా వేసింది. ఈ అంశంలో కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐ అధికారులను ఆదేశించింది. మరోవైపు.. కోర్టు విచారణలో సీబీఐ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కి తాను సహకరించేందుకు అనుమతివ్వాలని కోరుతూ వైఎస్ వివేకా కుమార్తె సునీత ఇటీవల పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ విచారణను కూడా న్యాయస్థానం ఈ నెల 5కి వాయిదా వేసింది.

'నిన్‌హైడ్రిన్'పై విచారణ 5కు..

వివేకా హత్య కేసు దర్యాప్తులో భాగంగా ఆయన రాసిన లేఖను నిన్‌హైడ్రిన్ పరీక్షకు పంపాలని సీబీఐ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పరీక్ష ద్వారా ఆ లేఖపై ఉన్న వేలిముద్రలను స్పష్టంగా గుర్తించవచ్చని సీబీఐ భావిస్తోంది. నిన్‌హైడ్రిన్ పరీక్ష చేస్తే కంటికి కనిపించని, సాధారణ పరీక్షల్లో బయటపడని వేలిముద్రలను కూడా గుర్తించడానికి అవకాశం ఉంటుంది. దీంతో ఈ పరీక్షకు అనుమతించాలని కోరుతూ ప్రత్యేక న్యాయస్థానంలో సీబీఐ ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై గంగిరెడ్డి (ఏ–1), సునీల్ యాదవ్ (ఏ–2) కౌంటర్ దాఖలు చేశారు. సీబీఐ పిటిషన్‌పై శివశంకర్‌రెడ్డి(ఏ–5) అభ్యంతరం తెలిపాడు. దస్తగిరి (ఏ–4) మాత్రం కౌంటర్ వేయడం లేదని పేర్కొన్నాడు. రాతపూర్వక వాదనలు సమర్పిస్తామని భాస్కర్‌రెడ్డి న్యాయవాది తెలియజేయడంతో న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 5కి వాయిదా వేసింది. కాగా, ప్రధాన కేసు విచారణ కూడా ఈ నెల 16కు వాయిదా పడింది. తాజా విచారణకు ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి హాజరయ్యారు.

ఇంటిముందు మృతదేహం, డబ్బు, లేఖ

- గుర్తుతెలియనివారు కారులో తీసుకొచ్చి పడేసిన వైనం
- ప్రకాశం జిల్లా ముటుకుల గ్రామంలో ఘటన
- మృతుడు భవన నిర్మాణ కూలీ



మృతుడు శ్రీను (ఫైల్)

పుల్లలచెరువు/యర్రగొండపాలెం: ఒక యువకుడి మృతదేహాన్ని కొందరు వ్యక్తులు కారులో తీసుకొచ్చి అతడి ఇంటిముందు పడేసి వెళ్లిన సంఘటన ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం ముటుకుల గ్రామంలో సంచలనం కలిగించింది. మృతదేహంతోపాటు రూ.35 వేలు, క్షమాపణ లేఖ ఉంచి వెళ్లారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. మృతుడు ఉప్పు శ్రీను (35) భవన నిర్మాణ పనుల్లో కూలీగా చేస్తుంటాడు. పనుల కోసం ముఠావాళ్లతో చెన్నై, తెలంగాణ, ఇతర దూర ప్రాంతాలకు వెళుతుంటాడు. 10 రోజుల కిందట పనులకు చెన్నై వెళ్లాడు. అతడికి నయంకాని వ్యాధి ఉన్నట్లు గుర్తించిన భార్య పిల్లలను తీసుకుని రెండేళ్ల కిందట పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కొందరు వ్యక్తులు తెల్లటి కారులో శ్రీను మృతదేహాన్ని తీసుకొచ్చి అతడి ఇంటిముందు పడేసి వెళ్లారు. మట్టి ఖర్చులకు రూ.35 వేలు, క్షమాపణ లేఖ అక్కడ ఉంచి వెళ్లారు. ఆ లేఖలో 'అమ్మా.. పనిచేసే ప్రదేశంలో అందరం కలిసి పనిచేస్తున్నాం. ఈ క్రమంలో మీ అబ్బాయి చనిపోయాడు. మాకు దెబ్బలు తగిలాయి. తల్లి శోకం తీర్చలేనిదని మాకు తెలుసు. కానీ ఏమీచేయలేక పోయాం. మీ అబ్బాయి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.35 వేలు ఇస్తున్నాం. అమ్మా క్షమించండి..' అని రాసి ఉంది. ఈ లేఖను బట్టి భవన నిర్మాణ పనులు జరిగే సమయంలో తోటి కూలీలతోపాటు శ్రీను కిందపడి ఉంటాడని, ఈ నేపథ్యంలో అతను చనిపోగా మరికొందరికి దెబ్బలు తగిలి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి సీఐ కె.మారుతీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ వై.శ్రీహరి దర్యాప్తు చేస్తున్నారు.

6 నుంచి జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలు

సాక్షి, అమరావతి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 66వ జాతీయ స్కూల్ గేమ్స్‌ను ఈ నెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ, భోపాల్, గ్వాలియర్ వేదికగా 21 క్రీడాంశాల్లో అండర్–19 బాలబాలికల విభాగంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఏపీ నుంచి 707 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్ల బృందం జాతీయ పోటీలకు హాజరవుతుందన్నారు. ఇప్పటికే అంతర్ జిల్లాల పోటీలు నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

లోకేశ్ అడుగుపెట్టిన ప్రతిచోటా అపశకునాలే

- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత్ నాయక్

సాక్షి, అమరావతి: నారా లోకేశ్ అడుగుపెట్టిన ప్రతిచోటా అన్నీ అపశకునాలే ఎదురవుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ చెప్పారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. లోకేశ్ పాదయాత్రలో మొదటి రోజే నందమూరి తారకరత్న అస్వస్థతకు గురై, ఆ తర్వాత చనిపోయారని, అక్కడి నుంచీ అన్నీ అపశకునాలేనని చెప్పారు. లోకేశ్ పాదయాత్రపై ఎవరూ ఆసక్తి చూపడం లేదని, కనీసం వంద మంది కూడా వెంట ఉండటం లేదని తెలిపారు. ఆయన ప్రజల్ని ఆకర్షించలేకపోతున్నారని, ఏం మాట్లాడుతున్నాడో, ఎందుకు మాట్లాడుతున్నాడో కూడా అతనికే క్లారిటీ లేదన్నారు. 'జమ్మలమడుగు' అని పలకడం కూడా రావడంలేదని, 'జంబలమడుగు' అని అంటున్నారన్నారు. సీఎం జగన్, ఆయన కుటుంబ సభ్యులను తిట్టడం చూస్తే లోకేశ్‌కు మాట్లాడటం కూడా రాదని స్పష్టమవుతోందని తెలిపారు. లోకేశ్‌ను చంద్రబాబు బలవంతంగా ప్రజలపై రుద్దుతున్నారని చెప్పారు. టీడీపీ మొదటి విడత మేనిఫెస్టోను రాష్ట్ర ప్రజలు విశ్వసించరని చెప్పారు. టీడీపీ 2014 ఎన్నికల మేనిఫెస్టోలో 600కు పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా చివరికి వెబ్‌సైట్ నుంచే తొలగించిందని, ఈ ఘనత దేశంలో చంద్రబాబుకే దక్కిందని అన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.